చెప్పెను. వేదాధ్యయనము కావలయునే అని శంతను డనగా వసిష్ఠాదులకు వీని నప్పగించితిని. నాల్గువేదములను అంగ ఉపాంగములతోడ గ్రహించెను. అస్త్రవిద్య వేదములు నేర్చి ఆరితెను. శుక్రనీతి చెప్పించితిని. శుక్రునికి తెలిసినదంతయును వీనికి తెలియును అని గంగ చెప్పెను. శుక్రునియొద్ద నోపసముండునే. గురునొద్ద విడిచిన బాగుగ నుండునే అని రాజు అనగా, ఇంద్రాదులకు ఆచార్యుడై గురువైయుండు బృహస్పతికి యేమి తెలియునో అదియంతయును యీబిడ్డ డెరుగును అని గంగ చెప్పెను. విశేషాంశములు పరశురామునొద్ద చెప్పిన బాగుగ నుండునని రాజనగా, పరశురామునికి తెలిసిన దానికంటెను హెచ్చుగ వీనికి తెలియునని గంగ చెప్పెను. శంతను డీసంగతి విని అటులా అంతయు నేర్పితివా అని ఆమెను పిలుచుటకు లేనుగాన ఆమెచేత నీయబడిన బిడ్డను పిలుచుకొనిపోయి, గంగకు పుట్టినవాడుగాన గాంగేయుడనియు, దేవతలవలె నుండువాడుగాన దేవవ్రతుడనియు, ఆయనకు పేరుపెట్టెను. రాజు అతనికి ఉపనయనము సకల వేదాధ్యయనము చేయించెను. ఆదివరకే గంగ చేయించి యుండినను ఇతడు తండ్రిగాన నిమిత్తమాత్రముగ వీని చేయించెను.

---

(8) సత్యవతీ పరిణయము.

శంతనుచక్రవర్తి గంగాదేవి తెచ్చియిచ్చిన తనపుత్రుడగు భీష్ముని యువరాజుగ నుంచుకొనిన యెచ్చటినుండియో తెచ్చినవాడని జనులు ఆక్షేపించరా యనిన అటుల జరుగలేదు. భీష్ముని యొక్క అస్త్ర శస్త్ర నీతిశాస్త్ర పాండిత్యమును వాక్చాతుర్యమును చూచి జనులు అతనియందు ప్రేమగలిగియుండిరి. జనులు అచ్చటచ్చట నుండు గుణములను జూచియే ప్రీతిచేయుదురు. భగవదనుగ్రహ ముండవలయును. సర్వాంతర్యామి యేనోట కూర్చుండి మాటలాడునో ఆమాటలు అమృతముగ నుండును. భగవదనుగ్రహము తగ్గినయెడల యిదంతయును అధికప్రసంగము. ఇతడు చెప్పిన విషయమున పాతిక భాగము నిజము. ముప్పాతిక భాగము అబద్ధము అని తోచును. సాధారణముగ జనులు మాటలాడుటలో ప్రియముండును. సత్యము లేకపోవచ్చును. సత్యమును ప్రియమును గలిగియుండవచ్చును. పథ్యముగ (ముందటికి మేలుగ) నుండక పోవచ్చును. భగవద్గీత 17 అధ్యా 15 శ్లోకమున భయమును కలిగించనట్టిదియును, సత్యమైనట్టిదియును, ప్రియమైనట్టిదియును, హితమైనట్టిదియును అగుమాటలు పలుకవలయు ననియు అటులచేయుట వాక్తపస్సనియు భగవంతుడు చెప్పియున్నాడు. భీష్ముడు మహానుభావుడగుటచేత సదా ఆట్టితపసు చేయుచుండెను. అతనమునకు అందరు మెచ్చి వారియెడ ప్రీతితో మెలంగుచుండిరి. విత్తు ఒకటి నాటిన చెట్టు ఒకటి మొలచునా. అటులే భీష్ముడు

శంతనుచక్రవర్తికి సదృశుడుగా నుండెను. లేక అతనికంటెను ఒకయింత హెచ్చుగనే యుండెను. చక్రవర్తి ఆబిడ్డను దగ్గర పెట్టుకొని సంతోషములో నాలుగేండ్లు రాజ్యపాలనము చేయుచుండి, ఒకనాడు వేటాడగోరెను. మృగబాధ హెచ్చినపుడు ఆవేధను నివారణము గావించుటకై మహర్షులు రాజులతో చెప్పుదురు. భగవద్గీత 7 అధ్యా. 19 శ్లో. అట్లు అనేకజన్మములకు పిమ్మట కలుగు జ్ఞానమును మహర్షులు వ్యయపరుపరు. తామే మృగబాధ నివారణము గావించుకొనరు. అది వారిధర్మము కాదు. భగవద్గీత 3 అధ్యా. 30 శ్లో. అటుల పరధర్మము భయావహము. అందువలననే మహర్షులచేత నియమింపబడ్డి రాజులు వేటకు పోదురు. ఈకారణముచేతనే శంతనుచక్రవర్తి వేటాడబయలువెడలి యమునగట్టున వేటాడి మృగగణములను సంహరించి అడవిమృగముల బాధ తగ్గించి పోవుచుండగా సువాసనతోడ గాలి కొట్టెను. ఇదేమని చక్రవర్తి యోచించెను. ఆవాసన యిట్టిదని వర్ణించుటకు వలనుకాకుండెను. ఈవాసన యెందుండి వచ్చుచున్నదో యని కనుగొనుటకై రాజు రథ గజ తురగ పదాతులను ఒకప్రక్కనిలిపి అచ్చటికి పోయెను. యమునగట్టున ఒక కన్యయుండెను. ఆకన్య యమున దాటగోరువారియొద్ద స్వల్పద్రవ్యమును పుచ్చుకొని దాటించుచుండెను. ఉపరిచరవసువు దూరమందున్న భార్యను దలచి రేతస్సు జారగా దాని నొక డేగచేతనిచ్చి భార్యకు బంపెను. అది సముద్రమున బడగా చేప మ్రింగెను. చెంబడివాండ్రు ఆచేపనుపట్టి తరిగి అందుండిన బిడ్డను రాజున కిచ్చిరి. ఈకన్య ఆబిడ్డయేను. పరాశరుడామెను కోరి అంగసంగము చేయుగా ముందుండిన మత్స్యగంధముపోయి సుగంధము కలిగెను. మత్స్యగంధియను పేరుపోయి యోజనగంధియని పేరు కలిగెను. ఆకన్య సామాన్యురాలు కాదు. పరాశరానుగ్రహము బడసినది. శంతనుచక్రవర్తి యోజనగంధిని చూచెను. పరాశరానుగ్రహమున ఆమె కన్యాభావము తెలిసెను. వారికిటుల సంభాషణ జరిగెను. శం- కన్యా ఎటుల నీదేహమున నిట్టి సువాసన గలిగెను. స- పెద్దల అనుగ్రహముచేత. శం- అదేమి అనుగ్రహము. ఎంతసువాసనగల పదార్థములు ఉంచినను యిట్టివాసన ఉండునా. స- (నవ్వుకొనెను.) శం- సాధారణముగ స్త్రీల కేదోషమైనను ఉండకుండునా. పాదాది కేశపర్యంతము బాగుగ చూచితిని. నీయెడ ఒక్కదోషమైనను కనబడలేదు. నీపేరు తెల్పు. స- మీకాసంగతి యెందుకు. ద్రవ్యమిచ్చిన నదిని దాటించెదను. శం- నేనందుకై రాలేదు. సువాసన రాగా వచ్చితిని. నిన్ను చూచితిని. అపేక్ష కలిగెను. నన్ను పెండ్లాడుము. స- అదేమి. మర్యాద కొంచముకూడ లేక మాటలాడుచున్నారు. నేను అత్తకూతురినా లేక మామకూతురినా నాకును మీకును సంబంధమున్నదా. శం- సరసముగ మాట్లాడితిని. స- సరసములకు సమయముగాదు. మీవంటి నావంటి వారనేకులు వచ్చుచుందురు. పడవలో కూర్చుండిన కూర్చుండుడు. లేకున్న మీదారి చూచుకొనుడు. శం- అటుల చెప్పకుము. అఖండ భూమండల చక్రవర్తిని. అటుల మాటలాడెదవేమి. నీవు

అందముగ నున్నావు. పెద్దల అనుగ్రహమును గలిగి యున్నావు. కన్యగనున్నావు. నీకు తగువానికదా అనుభవించవలయును దైవసంకల్పము నీయెడ ప్రీతికలిగెను. స- మీరు చెప్పినదంతయును నిజమేను నాకు ఆయోచనలేదు. నాతండ్రి యెవరికిచ్చిన వాని పెండ్లాడెదను. అతని నడుగుము. ఆయన మీకుయిచ్చిన సమ్మతించెదను. శం- తండ్రి యనెదవే యెవరువాడు. యెచ్చటనున్నాడు. స- ఇటులోకసందు అటులోక సందు పోవుచున్నది. చేపలుపట్టువారి సందు ఉన్నది. అచ్చట మాతండ్రి యున్నాడు. శం- అదియేమి చక్రవర్తి అచ్చటకి పోనగునా. స- పెండ్లాడుటకు యిష్టముండిన పొండి. శం- చక్రవర్తి పోతగిన స్థలమా. స- నాకును మీకును ఆశయున్నది. మీరు నాకు తగుదురు. నేను మీకు తగుదును. అయినను తండ్రి చూచి యీయవలయును. కావున అతని సరిపరచుకొనుడు. అని యిటుల సత్యవతి చెప్పగా, నేనేమి నాయోగ్యత యేమి అటుల పోవగునా యనక అడ్డిగెదను ఇచ్చునాయని చక్రవర్తి అనెను. భగవద్గీత 3 అ 39 శ్లో చెప్పబడ్డిన కామవికారముచేత రాజా తనస్థితిని మరచెను. కామము అన్నిటికిపైన నిలుచును. మనుష్యులను అణచివేయును. పరమశివుడు భార్యను అర్ధశరీరములో నుంచెను. బ్రహ్మదేవుడు నోటిలో నుంచెను. విష్ణువు వక్షస్థలమున నుంచుకొనెను. త్రిమూర్తులును భార్యలకు పరిచర్యలు సేయుదురు. మన్మథుడు అణచుచున్నాడు. ఏమన్మథునిచేత త్రిమూర్తులు భార్యలకుచిక్కి అల్లాడుచున్నారో అమన్మథునికి నమస్కారమని ఒకకవి యనిరి.ఇట్లే చక్రవర్తియును మన్మథవికారముచేతజ్ఞానముపోగా చేపలు పట్టువారియింటికి పోయి పిల్ల నడుగవచ్చునా యనితెలపక రథమున గూర్చుండి చేపలుపట్టువారి యజమానుడటనే వాని యిల్లు యెచ్చట అని విచారించుచు పోయి వానియింటియెద్ద దిగెను. వాడు రాజుకు నమస్కరించి తాము యిచట రానగునా యనెను. నీ కూతురున్నదే యని రాజు తనభావమును తెలుపుచు అడుగగా సరిగట్టున జూచితిరా పెండ్లాడగోరితిరా మాటలాడితిరా ఆపె యేమనెను అని వాడనెను. తండ్రి యాజ్ఞ యనిఅనెనని రాజు చెప్పెను.మీరేల రావలయును నన్ను పిలుపనంపరాదా యని వాడనగా మామగారుగ జేసికొనుటకై బాంధవ్యమును వ్యక్తపరచుచు వచ్చితినని రాజు తన ఐశ్వర్య అధిపత్యములను మరచి అడ్డిగెను. అహా యిచ్చెదను ఆక్షేపణలేదని వాడు చెప్పగా యోచనయేమి. ఏమి యడ్డిగినను యిచ్చుటకు సిద్ధముగ నున్నాడనే యని రాజనెను. మహారాజా మేము తగ్గువారము. ఏదో వికారముచేత యిటుల వచ్చితిరి. మీమనోరథ మీడేరి మీరు ఊరికి పోయిన పిమ్మట మేము వచ్చినయెడల చెంబడ్డివాండ్రకు యిచ్చట కార్యమేమున్నదని అందురు. మమ్ము అత్త మామ అందురా. కావున మాబిడ్డగర్భమున పుట్టువాడు మీకు పిమ్మట రాజుకావలయునని దాశరాజనెను. మహారాజు విని మిగుల చింతించెను. సకల పాపపరిహారముచేయు గంగాపుత్రుడు మహానుభావు డుండగా యిదెటుల జరుగును.శాస్త్రప్రమాణ విరుద్ధము కదా. పుట్టబోవువాడు

చెంబడ్డదానికొడుకు. వాడు సాక్షాత్ గంగాపుత్రుడు. ఇటులడ్డగనే. వేరేదైన నడుగ రాదా యని రాజు చింతించెను. కామవికారముచేత అటులే చేసెదనని చెప్పుదమా యని తోచెను. చెప్పుటకు భయము. సర్వవిద్యాప్రవీణుడు మహానుభావుడు అట్టిబిడ్డ యుండ అడవిలోనివానికి పట్టము కట్టనగునా యని తోచెను. సమ్మతించుటకు విడుచుటకు లేక రాజుమనస్సు చింతలో మునింగెను. పరమచింతతో ఊరు చేరి ఈశ్వరా! నాగౌరవమేమి నావివేకమంతయును పోయి అడ్డగిలెనే. నీవు మనసున గూర్చుండి యిటుల చేసితివే పిల్లనైన తెచ్చి యిమ్ము లేక వివేకముచేత మనసును దిద్దుము. ఎంత వచ్చినను ఎంతపోయినను నిన్ను విడువజాలను అని రాజు భగవంతుని ప్రార్థించుచు కాలకృత్యములు విడిచి పరుండెను. ఇతనికి వ్యాధియేమైన వచ్చెనో లేక భయపడెనో దుష్టులు అక్రమించి యేమిచేసిరో అని తలచి భీష్ముడు తండ్రిని బిలువగా, పలనిమనసు చేపలుపట్టువారింట మగ్నమైనందున, పలుకలేదు. గృహమును కన్యను కీర్తి ప్రతిష్ఠ విద్యను దైవమిచ్చును. వీనినందుకొని అనుభవించునది శరీరము. దైవమిచ్చుభాగ్యముల ననుభవించుటకు కావలసిన శరీరమును తండ్రి యిచ్చుచున్నాడు. చతుర్విధపురుషార్థ సాధనమైన శరీరమును తండ్రి యిచ్చుచున్నాడు. ఒకతండ్రి యిటుల చింతించెను. బిడ్డలను యెటుల కాపాడితినో, అనేక దుర్దానములను గ్రహించి అబద్ధములాడి యీబిడ్డలను గాపాడితిని. పిమ్మట విద్యాభ్యాసకాలమున చదువుడని చెప్పియు, దీపమునుంచి నిద్రపోకుండుటకై వారిగోడ మేల్కొనియుండి యిటుల ఆహారనిద్రలు లేక పెంచగా, పెరిగిన బిడ్డలు నన్ను గౌరవించుచున్నారా లేదు. గౌరవించనక్కర లేదు. కన్నతండ్రియని చెప్పిన చాలునే. స్వయంభువులైనటుల తలచుచున్నారు. తలితండ్రులు చేరి కనిరని తలపరు. ఎవ్వరైనను యీతండ్రి నాకై యెంతశ్రమపడెనని చెప్పినపుడు మాప్రక్కయింటివారు వారి బాలునికై యెంతశ్రమపడిరి. వాడు పండితుడాయెనా. వారివారి పెద్దలు శ్రమపడనెడ తేరునట్లుండిన యెల్లవారును కృతార్థులు కాకూడదా, అందురు. ఈవిధముగ పితృభక్తియుండదు. భీష్మాచార్యులు పితృభక్తిని జూపుటకు అవతరించినవారు. కావున చక్రవర్తి నుద్దేశించి, తండ్రీ మీకేచింత పోరులవలన గలిగెనా లేక వ్యాధ్యాదులచేత కలిగెనా. నన్ను పంపరాదా అనెను. నేనొక కన్యను జూచితిని. చేపలవారింటికి పోతిని అని ప్రౌఢపుత్రునితో నెటుల చెప్పుకొందునని శంతనుచక్రవర్తి యోచించుచుండెను. ఇంకొకరీతిగ సంగతి తెలిసికొనవలయునని తలచి భీష్మాచార్యులు విచారించెను. ఇతరులవలన సంగతి విశదపడలేదు. పిమ్మట సారథిని పిలిచి తండ్రి వేటాడి వచ్చునపుడు రథ మెచ్చటెచ్చట పోయెనని అడిగెను. వేటాడివచ్చునపుడు ఒక కన్యను జూచి మోహించి అడ్డగి అది పొమ్మనగా చేపలవారింటికిపొమ్మనెను. అక్షేపించితిని. వినలేదు. వారింటికిపోయి అడిగెనని సారథి చెప్పెను. వారేల యీయలేదని భీష్ముడడుగగా వారొక వరము నడిగిరని సారథి చెప్పెను. ఏల తండ్రి యిచ్చెదననలేదని భీష్ముఁ

డడుగగా తెమరున్నారే యని సారథి అనెను. భీష్ముడు తండ్రిసంగతి తెలిసికొని తండ్రీ! స్నానమాచరింపుడు పోయివచ్చెదనని పోయెను.ఎవరివలన ప్రతిబంధకమో వారే ప్రయత్నించిన కార్యము కాకుండునా అని చక్రవర్తి లేచి భుజించెను. చేపలు పట్టువారి స్థలమునకు పోవచ్చునా యనిన తండ్రి పోయినచోటు పరిశుద్ధమని భీష్ము డచటికి పోయి విచారించెను. దాశరాజు.— మాకన్యక నిచ్చుటకు అక్షేపణలేదు. ఇటువంటివారి సంబంధము లభింపవలయుననే.భీ— మరి యోచనయేమి.దా-; దీనికడుపున పుట్టువానికి పట్టము గట్టవలయు నంటిని. మీతండ్రి పలుకక పోయెను. భీ— సరి. పెండ్లి చేయుము. పట్టము గట్టెదను. అఖండ భూమండలమునకు ప్రభువుగజేసెదను. దా— అఖండ భూమండలము నేలుటకు మీకు శక్తియున్నది.రాజ్యము మీకుగాక వానికగునా. భీ— నేను అటులచేసెదను. దా— మీరు పెద్దలు. మీకు పితృభక్తి యున్నది. రాజ్యము వలదని చెప్పుచున్నారు. మీబిడ్డకు అటులుండునా. రాజ్యమునకు వచ్చిన నెటుల. భీ— దాశరాజా నీవుచెప్పినది మిగుల యుక్తము. నేను పెండ్లియే చేసికొనను సత్యము. నాకు రాజ్యము వలదు. నా పుత్రునివిషయమునకదా సందియము. అదియును వలదు. సత్యము.సత్యము. సత్యము. దా— మన యిరువురి ముందర యీవిషయమును నిర్ధారించు కొనిన చాలునా. భీష్ము డపుడు దేవతలారా యని పిలువగా ముప్పదిమూడు కోటుల దేవతలును వచ్చిరి. భీష్ముడు వారిని జూచి దేవతలారా నాతండ్రికై నాకు రాజ్యము నే వలదంటిని. నాబిడ్డలు కోరకుండుటకై పెండ్లి వలదంటిని.మీరుసాక్షులు అనెను. వారు పుష్పవృష్టిచేసిరి. ఇట్టి కొడుకు యుండునా. పూరు తనవయస్సును తన తండ్రికియిచ్చెను. తనతండ్రి తనయౌవనమును కొంతకాల మనుభవించి మరల తనకు యిచ్చునను నమ్మిక అతనికి ఉండెను. భీష్ముడు తండ్రికై అసుఖమును బొత్తిగ వదలెను. అతనికంటెను యితడు హెచ్చు అని దేవత లాశ్చర్యపడి భీష్మం భయంకరము. నీవలె పితృభక్తిగల వాని యెచ్చటను జూడలేదు. నీవుచెప్పుమాట భయంకరముగ నున్నది యని ఇతనికి 'భీష్ముడని' పేరు పెట్టిరి.ముప్పదిమూడు కోటుల దేవతలును స్తోత్రము చేసిరి.భీష్ముడు దాశ రాజుతో అటులచెప్పి సత్యవతిని జూచి అమ్మా 'రథమున గూర్చుండుము అని తల్లియను భావముతో పిలుచుకొని పోయెను.భీష్ముడు తండ్రిని దలచుచుండగా అయన సత్యవతిని తలచుచుండెను. భీష్ముడామెను సమర్పించి నమస్కరింపగా యిటులెవరు చేయుదురని తండ్రి మిగుల సంతోషించెను. శంతనుచక్రవర్తి న్యాయవిరుద్ధముగ నడచువాడు కాడు. భగవత్సంకల్పముచేత అటుల కోరెను. సత్యవతిని విధివత్తుగ వివాహమాడెను. ఉపరిచర వసువుయొక్క వీర్యముపడ్డ మత్స్యములో యీమెపుట్టెను. ఆమెయే యీసత్యవతి. కావున సత్యవతి క్షత్రియ స్త్రీయేను. క్షత్రియ స్త్రీయైనను దాశరాజింట నుండుటచేత పెండ్లాడనగునా యనిన కణ్వుడు పెంచిన శకుంతలను దుష్యంతుడు పెండ్లాడలేదా. పెద్దకులస్థులని వారు విడువలేదు. చిన్నకులస్థులని వీరు విడువలేదు. శ్రమచేత సాధ్య

మైన స్త్రీగాన చక్రవర్తి ఆమెయందు మిగుల ప్రేమతో నుండెను. సత్యవతివంటి రూపముగల స్త్రీ యుండదు. అటు లుండినను దేహముమీద ఆమెవలె సువాసన యుండదు. శృంగారరసమునకు దేవత. అటుల రూపమెత్తి వచ్చెనో యనవచ్చును. ప్రపంచమున నెవరు చూచినను వారి మనస్సులను నేత్రములను ఆకర్షించునే. దేవరూపము. భీష్ముడట్టియామెను తెచ్చి యిచ్చెను. చక్రవర్తి ఆమెను విధివత్తుగ పరిణయమై ప్రపంచమును మరచెను. ఆమెతోడ సకల సుఖములను అనుభవించెను. చక్రవర్తి పుత్రుడుచేసిన కార్యమును దలచి అయ్యో నాకొరకై రాజ్యసుఖమును విషయసుఖమును విడిచితివే 'పుత్రా నీకు రేమి యీయగలుగుదును. తండ్రీ నీకు స్వచ్ఛందమరణము కలుగునని గొప్పవరమిచ్చెను. స్వచ్ఛంద మరణమనగా తన అభిప్రాయప్రకారము చావు కలుగుట. ఎచట నెపుడు పోవలయునని దలచిన నప్పుడు పోనగును. అని వరమిచ్చెను. మనుష్యుడు తన సకల సౌఖ్యములను వదలియైనను తలిదండ్రులను సంతోషపరచవలయును. శంతనుచక్రవర్తికి సత్యవతియందు చిత్రాంగద విచిత్రవీర్యులను యిద్దరు పుత్రులు కలిగిరి.

---

(9) ధృతరాష్ట్ర పాండు మహారాజుల జననము.

యమునగట్టులో పరాశరానుగ్రహమున వేదవ్యాసుని గని కన్యాత్వము చెడకుండిన సత్యవతిని లేక యోజనగంధిని శంతనుచక్రవర్తి పెండ్లాడగా నామెకు యిద్దరు పుత్రులు కలిగిరి. వారిలో చిత్రాంగదుడు మొదటివాడు. విచిత్రవీర్యుడు రెండవవాడు. శంతనుచక్రవర్తికి గంగాదేవియెడ భీష్మాచార్యులు కలిగియుండిరి. ఇటులుండగా శంతనుచక్రవర్తి భగవచ్చరణారవిందములు చేరిరి. సత్యవతి, యిద్దరు పుత్రులు, భీష్ముడును ఉండిరి. భీష్ముడు కులపరంపరగ చిత్రాంగదుని సింహాసనమీద గూర్చుండబెట్టి అభిషేకము చేసెను. చిత్రాంగదుడు రాజ్యమేలుచుండగా భీష్ముడు పైవిచారణ సేయుచుండెను. సర్వజ్ఞుడును, మహానుభావుడునైన శంతనుడు పోగా చిత్రాంగదుడు పితృపితామహుల రాజ్యమును న్యాయముగ నేలుచుండెను. ఒకనాడతడు వేటకుపోగా నచ్చటికొక గంధర్వుడు వచ్చి, ఓరీ! నాకు చిత్రాంగదుడని పేరు. నీకును అపేరుండరాదు. అపేరును యుత్తివేయుము అనెను. ఒకేపేరు యిద్దరికి ఉండదని రాజనగా యుద్ధము జరిగెను. గంధర్వుడు రాజును చంపి తనలోకమునకు పోయెను. చిత్రాంగదుడు కాలముచేయగా, భీష్ముడు తాను రాజగుటకు లేదుగాన రాజ్యము అరాజకమగునని నానితమ్ముడగు విచిత్రవీర్యునికి పట్టముగట్టెను. అయన రాజని పేరు. సకలమును భీష్ములు చెప్పినటుల జరుగును. విచిత్రవీర్యునికి వివాహము చేయవలసియుండుటచేత భీష్ములు తల్లితో యోచించి, కన్యను విచారించుచుండగా, కాశీరాజు తన ముగ్గురు కూతుండ్రకును

స్వయంవరము జరుపుటకుల చాటించెను. స్వయంవరమనగా కన్యలు మహాసభలో యెవరిని యిష్టపడిన వారిని పెండ్లాడుదురు. వచ్చినరాజుల రూపమును స్వయముగ చూతురుకదా. ఆరాజుల గుణవిశేషములను తమవారు యెత్తిచెప్పగా విని తోచినవారిని పెండ్లాడుదురు. అటులకాకున్న వచ్చినవాడు జయించి పెండ్లాడవలయును. భీష్మాచార్యుల కీస్వయంవరముసంగతి తెలిసెను. మనము పోయి తమ్మునికి యేర్పాటు చేయుదమని భీష్మాచార్యులు బయలుదేరిరి. స్వయంవరమంటపమున సకలరాజులును వచ్చి కూర్చుండి యుండిరి. కన్యలను పిలుచుకొని వచ్చి వారిని వర్ణించి చెప్పిరి. తమ్ముడు రాలేదు. వీరవరులైన వరించిన నెటుల అని తలచి భీష్ములు న్యాయప్రకారము వారినందరిని జయించి అంబ అంబిక అంబాలిక అను ముగ్గురిని రథమున కూర్చుండబెట్టుకొని పోయిరి. ఎవడో బ్రహ్మచారి వచ్చి ముగ్గురిని తీసికొని పోవుటయా యని అందరును యుద్ధమునకు వచ్చిరి. సాళ్వుడనువాడు సౌభమను విమానమును కలిగియుండెను. అది నవరత్నఖచితమై జనులు వృక్షములు వాపీకూపతటాకాదులు కలిగి ఒకపట్టణమువలె నుండెను. సాళ్వుడు ఆవిమానముతోడ బయలుదేరి తనకు అనుకూల స్థలమయినయెడల ఆయూరి బయలులో దిగును. కాకున్న పట్టణముమీదనే కూర్చుండును. అట్టిసాళ్వుడు యుద్ధమునకురాగా, భీష్మాచార్యులు కొంచెము శ్రమపడి వాని జయించి ఆరాజకూతుండ్రను తీసికొనిపోయి, తల్లితోచెప్పి వివాహమునకు యేర్పాటుచేసిరి. వివాహమునకు ముహూర్తము చూచిరి. వారిలో మొదటిదగు అంబ భీష్మాచార్యుని చూచి అయ్యా నేను మీతమ్ముని పెండ్లాడను. నాకు పెండిలిచేసెదరా యని నవ్వుచు బలికెను. ఏలయని భీష్ము డడుగగా తాము నన్ను బలాత్కారముగ తెచ్చుటకుముందు నేను మహాపరాక్రమశాలియైన సాళ్వుని భర్తగ వరించితినని అంబ తెలిపెను. న్యాయమని తోచినందున పోవచ్చునని భీష్ముడామెకు అనుజ్ఞనిచ్చి పంపి, తక్కిన యిద్దరిని చిన్నతమ్మునికి పెండ్లి చేసెను. అంబ సాళ్వునికడ కేగి తన్ను పెండ్లాడుమనగా మనమిరువురమును వరించితిమి. మనసు కలిసెను. అయినను యెపుడు వాడు జయించి తీసికొని పోయెనో అపుడు వాని సొత్తైగాన పొమ్ము అని వాడనెను. అంబ మరల భీష్మాచార్యులయొద్దకు వచ్చి మనసు ప్రకారమైన నతని వివాహమాడవలయును. న్యాయప్రకారమైన మీరు పెండ్లాడవలయును. మీతమ్ముని పెండ్లాడనేల యనెను. స్వయంవరన్యాయప్రకారము పెండ్లియను కొనిన నేను పెండ్లాడ నగును. తెచ్చునపుడే తమ్మునికని తెచ్చితిని. కావలదని భీష్ముడనెను. అంబ ఉభయభ్రష్టురాలాయెను. శూర్పణఖ తన్ను పెండ్లాడుడని రామలక్ష్మణులమధ్య తిరిగినటుల, అంబ భీష్మ సాళ్వులమధ్య తిరిగెను. ఇటుల ఆరేండ్లు గడువగా వారు వీరు అంగీకరించరని తలచి, ఆమె హిమాలయము ప్రాంతమున నదిగట్టున తపమాచరించెను. పండ్రెండేండ్లు కాగా శివునియనుగ్రహమున పూలహారము లభించెను. దీని ధరించువాడు భీష్ముని చంపునని వరము. అంబ ఆహారమును తీసికొని

ఒక్కొక్కరి దగ్గర పోయి దీని ధరింపుడు ఇది వరప్రసాదము. భీష్ముని చంపుడు అనెను. హారము బాగుగనున్నది. భీష్ముని చంపజాలము అనిరి. ద్రుపదమహారాజు కొడుకు నడుగగా వినలేదు. అంబ ఆమాలను ద్రుపదునింట పడవైచి పోయెను. దాని తాకిన నేమగునోయని వారు తాకకుండిరి. అంబ తపముగావించుచుండి మృతినొందెను. ద్రుపదుడు తపమాచరించగా అంబ వారింట బుట్టెను. ద్రుపదుడు పరమశివునిగూర్చి తపమాచరించగా కుమారికలుగునని ఆయన చెప్పెను. అదేమి యని ద్రుపదుడడుగగా కుమారుడగునని శివుడనెను. ద్రుపదుడునమ్మి కొడుకువలె ఆశిశువుకు నామకరణము ఉపనయనము చేసెను. అదిబాలక దశార్ణదేశాధిపతి హిరణ్యవర్మ యనునతని కూతురిని పెండ్లిచేసెను. ఆమె తనతండ్రికీసంగతిని తెలియజేయగా నేను రేపటికి సైన్యలతోడవచ్చెదను. మీబిడ్డ స్త్రీయైయుండిన సంహారమొనర్తునని ఆరాజు లేఖ బంపెను. ద్రుపదునికూతురిని కుబేరుని పరిచారకుడొకడుచూచి ఆమెయొక్క దుఃఖనివారణము గావింప దలచి, నాయొక్క పుంస్త్వమును నీకిచ్చెదను. ఒకవార ముంచుకొని నురల నాకీయుము పొమ్ము అనెను. మాతాపితల మాట అబద్ధముకారాదను అభిప్రాయముగల శిఖండి యక్షునిపుంస్త్వమును గైకొని యింటికిపోయెను. పిమ్మట హిరణ్యవర్మ వచ్చి అల్లుని చూచి వేరువిధముగ ఖిని యిటులనేసితిని మన్నింపుడని వేడి పోయెను. గంధర్వుడు స్త్రీగానుండుటచేత కుబేరుడు పిలువగనే పోలేదు. అందుచేత కుబేరుడు స్వయముగవచ్చి స్త్రీగానుండు పరిచారకుని జూచి సంగతితెలిసికొని నీవుచేసినకార్యమునకు సంతోషము. ఉపకారము చేయుట మంచిది. అయినను నీవునాకీసంగతిని తెలిపి నాయాజ్ఞను పొంది నీయుద్యోగమున మరియొకని నుంచికదా యిటుల చేయవలయును. నీ వటులచేయలేదు కావున కడవరకును అది పురుషుడుగనే యుండవలయును నీవు స్త్రీగనే యుండవలయును అనెను. పిమ్మట శిఖండి రాగా గంధర్వుడు సంగతిచెప్పి నీభాగ్య మనెను. ఆమె పురుషరూపముతోనే పోయెను. ఆకాలమున ఆహారమును ధరించెను. ఈసంగతి సంగ్రహముగ ఆదిపర్వమున చెప్పిరి. కాశీమహారాజు కూతుండ్రు పరమ రూపలావణ్యశాలురు. విచిత్రవీర్యుడు వారితోడ రేయింబగళ్లుండి అతియుపభోగమున క్షయరోగము కలిగి మరణము నొందెను. సూర్యునివలె ప్రకాశించుచుండిన ఆరాజు, సూర్యుడస్తమించినటుల, మృతినొందెను. అతిభోగముచేత రోగము కలుగును. వైరాగ్యము తప్ప యితరవిషయము లల్లో పర్యవసానమున భయమున్నది. ఇటుల భర్తృహరి చెప్పెను. అధికముగ దాహము త్రాగుట, అధికముగ స్త్రీసంభోగము చేయుట, మధ్యాహ్నము నిద్రపోవుట, రాత్రి మేలుకొనుట, మలమూత్రములను అడచుట, రోగహేతువులని వైద్యశాస్త్రము. ఇందులో నొకటియైన అధికసంభోగముచేత విచిత్రవీర్యుడు మృతినొందగా, సత్యవతికి చింత కలిగెను. నా కన్యాత్వ అవస్థలో నొకపుత్రుని గంటిని. వాడెచటికో పోయెను. అఖండ భూమండల చక్రవర్తిని పెండ్లాడి యిద్దరిని కంటిని. వారు

పోయిరి. పూతికొడుకు (భీష్మాచార్యుడు) బ్రహ్మచారి, పెండ్లాడడు. రాజ్యమును అంగీకరించడు. ఏమి చేయగలను అని చింతించి, సర్వకార్యనిర్వాహకుడగు భీష్మాచార్యులను పిలిచి యిటుల చెప్పెను. సత్యవతి— నాయనా, దేవవ్రతా, భీష్మా, గాంగేయా, రాజ్యము శూన్యముగ పోయెనే. భీ— ఔను. స— వాడు పోయెను. వీడు నీవు టు విను చుండెను. సంతోషించుచుంటిని. అతిభోగముచేత పోయెను. ఇద్దరు పుత్రులును పోయిరని దుఃఖింతునా. రాజ్యమునకై దుఃఖింతునా. భీ— అమ్మా యిద్దరు కన్యలనుదెచ్చి పెండ్లి చేసితివి. ఇటులగునని తలచితినా. వానికి కష్టము పెట్టక అన్ని కార్యములు చేయుచుంటిని. వాడు పోయెనే. అన్యథాచింతితంకార్యం దైవమన్యత్ర చింతయేత్ అన్నటులాయెనే. అనియిటుల చెప్పి భీష్మాచార్యులును చింతింప నారంభించెను. ఇద్దరు దుఃఖించిరి. స— నాయనా' నీవు అనుగ్రహించి సంతతి కలిగింపుము. (ఆయుగమున అట్టి దేవరన్యాయ ముండెను.) భీ— అమ్మా నేను ముప్పదిమూడు కోటుల దేవతలముందు ప్రతిజ్ఞ చేసితిని. స్వభార్యయెడ లేనిది యితరులయెడ కావలయునా. నాకు చింతకలుగుచున్నది. అమ్మా! యీయుగమున అట్టి యాచార మున్నను నాది వేరుసంగతి. ప్రతిజ్ఞ చేయకున్న న్యాయ ముగ నుండును. నేను ప్రతిజ్ఞ చేసితినికదా. స— ఎందుకు ప్రతిజ్ఞ. భీ— మీకొరకే. స— అదేమి. భీ— నాకు బిడ్డ పుట్టరాదనికదా ప్రతిజ్ఞ. జ్ఞాపకములేదా. (భీష్మాచార్యులు జితేంద్రియుడు జితక్రోధుడు నిత్యబ్రహ్మచారి గాన వలదనెను. అ పెంకు పొత్తుమీద ఆశ గాన చమత్కారముగ చెప్పెను.) స— తండ్రీ! ధర్మము వేరు. ఇది ఆపద్ధర్మము. బిడ్డలుండిన అడుగుదునా! దీనికై ప్రక్కయింటివారి నడుగుదునా. నీప్రతిజ్ఞ తెలి యుదా. ఇది మాతృవాక్యము. ధర్మమును తప్పినను దోసములేదు. భీ— అమ్మా! అగ్ని కాలుట, సూర్యునియెడ ఉష్ణము, చంద్రుని కిరణముల చల్లదనము మారినను మారును. భీష్ముడు చెప్పినమాట మారదు. స—సరి ఉండనిమ్ము మారదనినయెటుల ఇది ఆప ద్ధర్మశాస్త్రముగనున్నది. అని సరియైన ధర్మమును విడిచి ఆపద్ధర్మము ననుసరించి సత్య వతి మరల చెప్పనారంభించగా, భీ— అమ్మా! కోపించుకొనరాదు. మీరుచెప్పుడానికెని నేను చెప్పుడానికెని ధర్మశాస్త్రము లున్నవి. నేను బలముగ ప్రతిజ్ఞ చేసితిని. నాకు పుత్రులు కలుగరాదు. కొన్ని సంగతులను చెప్పెదను వినుము. స— చెప్పుము. భీ— నా ప్రతిజ్ఞకును వంశమునకు భంగములేకుండునటుల చెప్పెదను. సంతతికి ఒక మనుష్యుడు కావ లయునుకదా. స— నాయనా సరి నిన్ను బాధింపనేల. వంశవృద్ధికొక మార్గము చూపుము. భీ— అమ్మా పురాణాదులలో నుండు సంగతిని వినుడు. పరశురాముడు ప్రతిజ్ఞ చేసి యిరువదియొక పర్యాయములు క్షత్రియకులమును నాశముచేసెను. వారి స్త్రీలకు దుఃఖ ముగలిగి వేదవేదాంగముల నెరిగిన బ్రాహ్మణుల అనుమతి ప్రకారము బ్రాహ్మణులను రక్షించి బిడ్డలను కనిరి. జ్ఞాపకము చేసికొనుము. అటులచేయుదము. స— నాయనా! మరి యోగ్యుడైన ఉదాహరణ మున్నదా. భీ— అట్లు అడుగుడు. ఒక కథ చెప్పెదను వినుము.

బృహస్పతియన్న ఉతథ్యుడు. అతనిభార్య మమత. ఆమెకు దీర్ఘతముడను పుత్రుడు కలిగెను. బృహస్పతి శాపముచేత అయన గ్రుడ్డివాడుగ పుట్టెను. విద్యను జూచి అతనికి కన్యనిచ్చిరి. ప్రద్వేషిణియని అతని భార్యపేరు. అధిక కామాతురుడై హింసించగా ఆమె అగౌరవపరచెను. భర్తయనిన భరించువాడు. ఇతనికి నేనే సకలము యీయవలసినటులున్నది. అటులుండియు రాత్రియు పగలును యీయందవేమి అని ప్రద్వేషిణి యనెను. భగవద్గీత 5 అధ్యా 23శ్లో కామవేగము తగ్గవలయుననిరి. ప్రద్వేషిణి వేగములో మాటలాడెను. ఆమె తనబిడ్డను పిలిచి ఇతని భరించుటకు వీలు లేదు. అనంగడుగునకును హింసించుచున్నాడు. సముద్రమున పడవేయుమనెను. పుత్రులటులే అతని కట్టి సముద్రములో వేసిరి. బలియనురాజు స్నానముచేయుచుండి వీని చూచి మహానుభావుడని పిలుచుకొనిపోయి తనభార్యను అనుగ్రహించమని సంతానము బడయుదమని పంపెను. రాణి అసహ్యపడి కలవరెను. రాజు భార్యకు నిర్బంధముగ చెప్పెను. ఆమె దాసికి శృంగారించి పంపెను. అచట పుత్రులు కలిగిరి. దీర్ఘతముడు మహాజ్ఞానిగాన జ్ఞానదృష్టిచేత సంగతి తెలిసికొనెను. ఒకనాడు రాజు నాపుత్రులనగా దీర్ఘతముడు కాదనెను. ఔరసుడనగా భర్తకు భార్యయందు పుట్టినవాడు. క్షేత్రజుడనగా భార్యకు యింకొకనిద్వారా పుట్టినవాడు. ఈరీతి ననుసరించి వీరు నా క్షేత్రజులని రాజు చెప్పగా దీర్ఘతముడు కాదనెను. ఎందుచేతఅని రాజడుగగా దాసికి పుట్టిరని అయన చెప్పెను. రాజు సుధేష్ణయను భార్యను జూచి నిజముగ చెప్పెదవా సంహారమొనర్తునా యని అడుగగా అసహ్యమని అటులచేసితినని ఆమె చెప్పెను. ఇపుడు పొమ్మని రాజు చెప్పగా ఆమె అటులచేసెను. ఆమెకు అంగ, వంగ, కళింగ, రాజులు పుట్టిరి. స– భీష్మా సరి. నీవుచెప్పినటులవారు సంతానమును బడసిరి. అటుల చేయుదమా. భీ– అమ్మా అటుల చేయుదము. స– బ్రాహ్మణుని రప్పించుదమా. (ఎవరిని రప్పింతమని భీష్ముడు యోచించగా సత్యవతి నవ్వెను.) భీ– అమ్మా ఏల నవ్వెదవు. స– భీష్మా నీకుచెప్పక యెవరికి చెప్పుదును. సామాన్యక్షత్రియులు సామాన్య బ్రాహ్మణులవలన సంతానము బడసిరి. ఈవంశ మట్టిదియా. భీ– అమ్మా అదియే యోచించుచున్నాను. స– ఒక్కడున్నాడు. ఎరుంగుదువా., భీ– ఎవడు. స– మనలో చేరినవాడేను. నేను ఉపరిచర వసువు వీర్యమునకు పుట్టినదానను. నన్ను దాశరాజు పెంచుచుండెను. పరాశరుడు వచ్చి అనుభవించి పుత్రుని కనెను. నేనుప్రార్థించగా కన్యాత్వమును అనుగ్రహించెను. అపుట్టినవాడు వేదవ్యాస భగవానుడు. సామాన్యుడుకాడు. వేదములను విభజించినవాడు. భీ– ఆశ్చర్యము అమ్మా వేదవ్యాసుడు మీబిడ్డయా అటులైన రమ్మనుము.అని భీష్ముడు చెప్పగా వ్యాసుడు కుటుంబమున చేరినవాడు మహానుభావుడు. భగవదవతారము. ఇందుకు సమ్మతించునో సమ్మతింపడో యని సత్యవతి చింతించి వ్యాసా యని పిలిచెను. అమ్మా యెపుడు తలచిన అపుడు వచ్చెదను. ఏమిచెప్పిన అటుల చేయుదును అని చెప్పలేదా.

నేను అట్టిబిడ్డనుకదా. దీనికి యోచనయేల సకల కల్యాణగుణ రత్నాకరుడు భీష్ముడు, శాంత శమదమ సంపూర్ణుడగు తమ్ముడును, తల్లివగు నీవును చెప్పిన వినవా. అనుచు వ్యాసుడు వచ్చెను. తండ్రీ వ్యాసాయని సత్యవతి కౌగిలించుకొనెను. అన్నాయని భీష్ముడు కౌగిలించుకొనెను. వ్యాసుడు- అమ్మా ఏల పిలిచితివి. సత్యవతి- కార్యార్థముగ పిలిచితిని. వ్యా- అదేమి కార్యము. (సత్యవతి తనపెండ్లిసంగతిని భీష్ముని సంగతిని భీష్మునికిని తనకును జరిగిన సంగతిని చెప్పి రాజ్యము అరాజకమగును వంశము నిర్మూలమగును అపధర్మము. నీవుతప్ప సద్బ్రాహ్మణు డెవడున్నాడు మహానుభావుడవు నీయనుగ్రహమున సంతతి కలుగవలయును అని తన అభిప్రాయము తెలిపెను) వ్యా- అమ్మా తమయాజ్ఞను శిరసా వహించెదను. నీకోడండ్రు నాయంగసంగమమునకు తగరు. (భగవదంశగాన) ఒకసంవత్సరము నేనుచెప్పు వ్రతము చేయు మనుము. అపుడు అందుకు తగినవారగుదురు. వ్రతమును విధిప్రకారము చేయనిమ్ము. నే నపుడు వచ్చి అంగసంగమముచేసి సంతతి కలిగించెదను. స- నాయనా ఒక సంవత్సరమా యిక వారు పుట్టి పెరుగుటయెపుడు, శక్తిపోయిన బిడ్డ పుట్టినటులే. ఇపుడే పుట్టవలయును. వ్యా- మాతృవాక్యము. అమ్మా వారిని రమ్మనుము నేను నారూపముతో రాను. వేరువిధముగ వచ్చెదను. నన్ను చూచి భయపడినను, కన్నులు మూసికొనినను బిడ్డ కన్నులు లేకయే పుట్టును. స- నాకుమారుడనిచెప్పి వారిని సరిపరచెదను. వ్యా- అసమయమున నన్ను చూచి ప్రియముతోను, భక్తితోను, అనుభవించవలయును. పోయి వచ్చెదను. అంతఃపురమునకు రమ్మనుము. (సత్యవతి పెద్దకోడలిని పంపెను. భగవద్గీత 11 అధ్యా 80 శ్లోకముటుల వ్యాసుడు కోటిసూర్యోదయమైనటుల ప్రకాశముతో రాగా ఆమె భయపడెను. పరమానుగ్రహముచేత వచ్చెను. అత్తచెప్పెను అనితలచి రండి యని ప్రీతితో పిలువలేదు. రాజుతో అనుభవించిన దాననని శరీరమును ముడుచుకొని కన్ను మూసికొనెను. అయితే అత్తమాటనుబట్టి. పరుగెత్తి పోలేదు. వ్యాసు డామెను స్పృశించగా గర్భధారణమాయెను. అంబికా నారూపమును చూచి ప్రీతితోనుండక జుగుప్సపొందితివి. కన్నులు మూసితివి. నీకు పుట్టువాడును కన్నులుమూసికొనియే పుట్టును. వానికి పుత్రులుందురు. ఐతే జాత్యంధుడు అనెను. ఆమెకటులే పుత్రుడు కలిగెను. వ్యా- అమ్మా ఆజ్ఞప్రకారమొనర్చితిని. స- కన్నులులేవే. వ్యా- కోడలి నడుగుము నాపై తప్పులేదు. (సత్యవతి కోడలినడుగగా అత్తా భయముగ నుండెను కన్నులుమూసితిని అనెను. అయ్యో యోచనయంతయును వ్యర్థమాయెనే కోడలు యిటుల చేసెనే యని ఆమెకు దుఃఖమును కోపమును కలిగెను.) వ్యా- అమ్మా వ్రతముచేయవలయునంటిని మీరు వినలేదు. యోగ్యత లేనందున అటులే అయెను. స- వీనిగతియెటుల. వ్యా- బలిష్ఠుడుగ నుండును. నూర్గురిని కనును ఇక పోయెదను. స- ఏమిరా గ్రుడ్డివాని పుట్టించి పోయెదవు. మరిమరి నిన్నే వేడ దయరాదా నీమనసున. నీవే మన వంశమునకు సంతతి నేర్పరచి యీయ

వలయు ననగా యింత ప్రార్థింపవలయునా. వ్యా— సరి ఇంకొకతెను పంపుము. సత్యవతి అంబాలికను పిలిచి ఓసీ పున వాడేయని చెప్పితిని. జాగ్రతయంటిని. ఇన్ని చెప్పియును అది కన్నులుమూయనేల. అనెను. ఔనత్తా అనిఅంబాలిక యనెను. నీవటుల చేయకుము. అంగములు ముడుచకుమని సత్యవతి చెప్పెను. వల్లెయనిచెప్పి అంబాలిక పోయెను. ఏమగునోయను భయముచేత ఆమె దేహకాంతిమారి తెల్లఫోయియుండెను. భయ, శృంగార రసములచేత శరీరముయొక్క వర్ణము మారును. భయముచేత తెల్లబారియుండిన అంబాలికను వ్యాసుడుచూచి దీనికంటెను అదియే మేలుగ నుండెనని స్పృశించెను. గర్భధారణమాయెను. వీనికి కన్నులుండును. ఐనే దేహము తెల్లగ నుండును అనెను. అమ్మా దీనికి పుట్టబోవువాడు తెల్లగ నుండును కారణము. కోడలి నడుగుము. అని వ్యాసుడు చెప్పగా సత్యవతి కోడలి నడిగెను. భయముచేత నాశరీరము అటులాయెనని ఆమె చెప్పెను. స— ఏమిరా యిందుకా నిన్ను గప్పించినది. వ్యా— ఒక సంవత్సరము వ్రతము సల్పవలయునని చెప్పలేదా. స— వారికి చెప్పితిని వారికి బుద్ధిలేదు. మరల అంబాలిక యెడ నొక పుత్రుని అనుగ్రహింపుము. వ్యాసా, మేము నిన్ను పిలిచితిమి నీవు తగునటుల రేర్పాటు చేయవలయునా యిటుల చేయవలయునా. మంచిబిడ్డ పుట్టవలయుననికదా నిన్ను పిలిచితిని. లేనన్న మరియొక బ్రాహ్మణుని రమ్మనవా, ఒక సత్పుత్రుని కలిగింపుము. వ్యా— అటులే. అమ్మా యికె అటుల కన్నులు మూయరాదు. వ్యాసుడిటుల చెప్పగా సత్యవతి కోడలిని జూచి రేమేయనెను. లేదుఅత్తాయని ఆమె యనెను. కాశీరాజకూతురు వ్యాసుని రూపమును దలచి మరల పోవువా రెవరున్నారని జుగుప్సపొంది తనదాదికి తనయాభరణములను స్వహస్తములతో శృంగారించి పంపెను. అహా, నాకిట్టి మహాపురుషుడు భర్తగలభించునని స్వయముగ శృంగారించుచున్న దే నేడెవరిముఖము చూచితినో పెద్దల అరిగి సంగమము కలుగబోవుచున్నదేయని ఆదాసి పరమభక్తితో పోయెను. నీకు సర్వవిద్యాప్రవీణుడును, పరమభాగవతుడును, నీతివిదుడును నైన పుత్రుడు కలుగునని వ్యాసుడనెను. అంబికకు పుట్టినవాడు ధృతరాష్ట్రుడు. అంబాలికకు పుట్టినవాడు పాండురాజు. దాసికి పుట్టినవాడు విదురుడు. విద్ జ్ఞానము. సర్వవిద్యలలో జ్ఞాతగాన విదురుడనిపేరు. శూద్రస్త్రీకి పుట్టినవాడు అంత మహానుభావుడగునా. పాండవులకు దుర్యోధనాదులకు నీతిదెలుపువాడు శూద్రస్త్రీకి పుట్టునా. అటులేల పుట్టెను అనగా, సాక్షాత్ యమధర్మరాజు మాండవ్యముని శాపముచేత శూద్రుడు కావలసివచ్చెను. అతడు సామాన్య స్థలమున బుట్టునా. మాండవ్యుడు తపమాచరించుచుండగా, అచటికి సమీపమందుండిన రాజుసొత్తులను చోరులపహరించిరి. దూతలు తరుమగా ఆచోరులు ఆశ్రమమున వేసి పోయిరి. రాజభటులు సొత్తులనుజూచి ఋషియును చోరులతో సంబంధపడినవాడని తలచి అతని కొట్టిలేపి తస్కరు లెచ్చట యని యడిగిరి. అయన సమాధిలో నుండెనుగాన మాటాడలేదు. ఈయువ్వకును ఒకభాగ

ముండువటు ఉన్నదని తలచి అతని కొట్టి పోయి రాజుతో చెప్పిరి. ఆరాజు మాండవ్యుని శూలములో రెక్కించుడని ఆజ్ఞాపించగా దూతలటులే చేసిరి. ఆశూలము ఆయన మునుండ్రి గొంతువరకు వచ్చెను. ముఖమున కళ తగ్గలేదు. మునుపటికంటెను హెచ్చుగ కాంతియుండెను. ఈసంగతిని దూతలు రాజుతో చెప్పగా అపరాధమును మన్నింపుడని రాజు ఆఋషిని ప్రార్థించెను. నాయనా తెలియక చేసితివి పొమ్ము అని మాండవ్యుడనెను. శూలము బాధకలిగించునను తలపుతో వారు తీయుటకు చూచిరి. వలనుపడలేదు. క్రింద కొంచము విడిచి కోసిరి. క్రింద చీలయున్నదిగాన అణిమాండవ్యుడని ఆయనకు పేరుకలిగెను. ఇట్టిపాపము యేలవచ్చెనని ఆయన యముని నడుగపోయెను. అటులపోయి యముని జూచి యేమిరా, నేనేపాపము చేసితి ననెను. అయ్యా మీరు పండ్రెండేడులలోపల చీమలను, వనమక్షికలను, పట్టి పుల్లలో గ్రుచ్చుచుంటిరి (రాత్రియందు నల్లుల, దోమల, బాధ కలుగును. పగటియందు ఈగల, యాచకుల బాధ కలుగును. చీమల, భార్యయొక్క బాధ రాత్రియును, పగలును కలుగుచుండును.) మీరు మీదపడినవానిని తోలి యిన్నియని తెలియుటకై పుల్లలలో గ్రుచ్చుచుంటిరని యముడు చెప్పెను. ఈఋషికి కోపము వచ్చెను. నిన్నెవరురా యీ యధికారమున నుంచిరి. ఏమో బాల్యమున అటుల చేసితినట. దానికే. నాకు శూలారోహణమట మహాజ్ఞాతను. నాకా పాపము, నీకు ధర్మశాస్త్రము తెలియదు. పండ్రెండేండ్లవరకు బాలునికి దిక్కులు తెలియని కాలము. వాడు తప్పులు చేసెనేని తల్లిదండ్రులకు చేరును. అటులుండగా లీలలలో చేసిన దానికి యింత దండనతగునా. నీకు ధర్మము కొంచము కూడ తెలియదు. నన్ను బ్రాహ్మణుడని తెలియక పోతివి. నీవు మనుష్యుడవై శూద్రుడవై పుట్టుమని శపించెను. ఆయముడు సాధారణస్త్రీల గర్భమున పుట్టరాదని సాధారణవీర్యమునకు పుట్టరాదని వేదవ్యాసుల సంబంధముగలిగిన శూద్రస్త్రీకి పుట్టెను.

(10) కురు పాండవ జననము.

ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురుడు అను ముగ్గురు పుట్టిరే. వారిలో నెవరైన రాజుగ నేర్పడిరా. రాజ్యము అరాజక మగుననికదా వారిని పుట్టించినది అనగా పాండురాజు రాజాయెను. అదేల ధృతరాష్ట్రునకదా ముందుపుట్టెను. మహావిద్వాంసుడును, నీతిమంతుడును, అగు విదురుడు రాజుకారాదా యనిన, ధృతరాష్ట్రుడు జ్యేష్ఠపుత్రుడైనను, జ్యేష్ఠరాణిపుత్రుడైనను, గ్రుడ్డివాడు. రాజు తనదేశములో నుండు విషయములను చూచుచుండవలయును. ధృతరాష్ట్రు డట్లు చూడలేడు గాన జ్యేష్ఠపుత్రుడైనను రాజ్యమాయనకు యీయలేదు. విదురునికేల రాజ్య మీయలే దనగా క్షత్రియునికే కదా రాజ్యము. వారు క్షేత్రజులు వేదవ్యాసునికి వీర్యజులైనను యితడు శూద్రస్త్రీకి

పుట్టెను. క్షత్రియత్వము లేనందున యీయనకు రాజ్యము రాలేదు. కావున పాండు మహారాజు రాజ్యమేలుచుండెను. వీరికి వివాహము చేయవలసియుండుటచేత భీష్ముడు విదురుని జూచి మంచికులమున పుట్టిన మంచిపిల్లలను దెచ్చి వీరికి పెండ్లిచేయవలయునే అనెను. తండ్రి తల్లి గురు దైవములు మీరగుటచేత యోచనయేమని విదురు డనెను. గాంధారదేశాధిపతి యగు సుబలమహారాజుకూతురు గాంధారి యనునామె. భీష్ము డామెను ధృతరాష్ట్రునికిమ్మని యడిగి, యితడు గ్రుడ్డివాడైనను, దీర్ఘాయుష్మంతుడై యుండును. మహాజ్ఞాత పరమ అనుష్ఠాత. పుత్రులు కలుగుదురు అనియును తెలిపెను. సుబలమహారాజు మహాబుద్ధిశాలి. కులశీలాదులను, ఖ్యాతిని యోచించి కూతురిని విధివత్తుగా అలంకరించి కన్యాదానము చేసెను. ధృతరాష్ట్రుడు గాంధారిని వివాహమాడెను. గాంధారి భర్తయింటికి వచ్చెను. ఆమెభర్తకు కన్నులు లేనిదితప్ప యేమియు తక్కువలేదు. ధృతరాష్ట్రుడు గాంధారితోడ సుఖముగ నుండెను. ఆహా యేమిద్రవ్యము దాసదాసీజనులు అని అన్నిటిని చూచి నేనానందించుచున్నాను కదా. భర్తకు కన్నులతో చూచి ఆనందించుభాగ్యము లేదుకదా. ఈసంతోషము నాకేల. వారు అనుభవించిన శేషమునుకదా నేననుభవించవలయును అనితలచి గాంధారి తన కన్నులకు వస్త్రము కట్టుకొనెను సన్నవస్త్రమును కట్టుకొనెనా యనిన కాదు. ఇరువది ముప్పది మడతలుగ మడిచి కట్టుకొనెను. అదేల భర్తకు లేకున్న తానట్టుల చేయవలయునా. పతివ్రత. భర్తకేది యున్నదో దానికదా అనుభవించవలయును. పతివ్రతలు అన్నివిధములలోను శుశ్రూషచేయుదురు. ప్రతిఫలమునకై భర్తను ఉపచరించుట ఉత్తమస్త్రీలక్షణము కానేరదు. గాంధారి యిటుల పతివ్రతలలో మొదటి దాయెను. అటులామె కాపురము చేయుచుండెను. ధృతరాష్ట్రునికి మంచిస్థలమున పెండిలిచేసితిని. పాండురాజుకు చేయవలదా యని భీష్ముడు విదురునితో యోచించెను. కుంతిభోజమహారాజు తనకూతురు కుంతికి స్వయంవరముచేయ తలచెను. శూరుడనురాజు శ్రీకృష్ణమూర్తికి తాత.వసుదేవుని తండ్రి. కుంతి ఆయనకుమారిక పరమ రూపలావణ్యశాలిని. కృష్ణుని మేనత్త. కుంతిభోజుడామెను అడుగగా శూరుడు తన పుత్రికను సఖుడగు అతని కిచ్చెను. కుంతిభోజమహారాజు సకలరాజులను రప్పించి స్వయంవర మేర్పరచగా, భీష్మాచార్యులు పాండురాజును పిలిచి నాయనా స్వయంవరమున నెల్లవారిని జయించి నేను మీతల్లిని తెచ్చినటుల, నీవును తెమ్ము అనిచెప్పెను. పాండురాజు భీష్ముని అజ్ఞానుసారముగ పోయి జయించి ఆమెను తెచ్చెను. వివాహమాయెను. సుఖముగ నుండిరి. రాజుకు అనేక భార్యలుందురు. పాండురాజుకు మరియొక కన్యను వివాహము చేయుదమా అని భీష్ముడు విదురునితో యోచించెను. పాండురాజు కుంతితో సంసారముచేయుట యెటు లుండెననగా, ఇంద్రుడు ఇంద్రాణితో స్వర్గలోకమున ఉండువటు లుండెను. మహానుభావుడైన పాండుమహారాజుకు మరియొక పెండిలి చేయుదమని భీష్ముడు యోచించి చూచుచుం

డెను. మద్రదేశాధిపతియగు శల్యునిచెలియలు మాద్రి. మీచెలియలి నియ్యవలయునని భీష్ముడు కోరగా ఆహా యిచ్చుటకేమి. మాయింట కన్యాశుల్కమును తీసికొనుట వాడుకగ నున్నదనెను. అటులేయని అనేక రత్నరాసులను కుమ్మరించెను. పాండురాజు రాజ్యపాలనము చేయుచుండెను. పట్టము కట్టుకొనగనే దిగ్విజయము చేయుట రాజధర్మము. శిష్టులను పరిపాలించి దుష్టులను శిక్షించవలయును. బహుదినములు దండయాత్రకు పోకపోయిన తమకుపైవారు కలరనుమాట మరతురు. నేనున్నానని ఒకపర్యాయము చూడవలయును. నాల్గుదిక్కులకును పోయి జయించి రాజులనియెందరున్నారో వారందరును తన క్రిందువారుగ నుండునటుల చేసికొనవలయును. పాండురాజు జయించి యెల్లవారును తనకు కప్పము కట్టునటుల చేసికొని వచ్చి చేరెను. ఇటుల దిగ్విజయము చేసివచ్చి మరల రాజ్యపరిపాలనము చేయుచుండెను. దుష్టమృగములబాధ హెచ్చగా రాజధర్మము ననుసరించి పాండురాజు కుంతీ మాద్రులను తోడ పిలచుకొని వేటకు పోయెను. యోగక్షేమములను విచారించువాడు విదురుడు. వారుండ యోచనయేమి. మృగములను సంహరించుచు ఊరక వనప్రదేశములో తిరుగుచుండెను. తోడ భార్యలున్నారు.ఇంటి యోగక్షేమమును విచారించుటకు విదురుడు భీష్ముడు ఉన్నారు. కావున వనమున సంచరించుచు, పుష్పజాతులను చూచుచు నుండిరి. ఇటుల వేటాడుచుండగా నొకనాడు ఒకమగజింక తనస్త్రీలతోడ ఆటలాడుచుండుటను పాండురాజు చూచెను. అవి మిగుల సుఖముగ కలిసియుండునప్పుడు మిగులకరుకైన ఐదుబాణములు వేసెను. అవి యటుల తొలగగనే వేయరాదా. మగజింక మృతినొందెను.ఆజింకలోనుండిన తేజస్సు బయలువెడలి పురుషుడై ముందు నిలిచెను.చూడగా ఆతడొక మహర్షిగ నుండెను. పాండురాజు భయపడెను. నేను కిందమమహర్షిని. (లీలలు అనుభవించవలయునని తోచి మహర్షులు అటులసంచరించుచుందురు.) నేను భార్యతోడ నిటుల సంచరించరాదని తలచి నాతపోబలముచే జింకలమై యుంటిమి. రాజు మృగముల సంహరింపవలసినదే.ఆసమయము కాదు.ఆసమయమున నెంత సుఖముగ నుండియుందుము.బాణము వేయగా నెంతదుఃఖముకలిగెను.నీవు భీష్మునివలె బ్రహ్మచారివా,ఇద్దరుభార్యలను పెండ్లాడిసుఖము లనుభవించుచుండువాడవు. వేటకును వారినితోడ పిలుచుకొని వచ్చితివి.నాకు సుఖమునకదా మరణము కలిగెను. నీకు నేటినుండియు ఆసుఖము లేకపోవలయును. కామాతురుడవై సుఖ మనుభవించ నారంభించితివేని ఆసుఖము అంత్యములో నావలె మృతినొందుదువు.అని యాఋషి యనెను.పాండురాజునకు శాపముచెవిలోపడి కర్ణకఠోరముగనుండెను. మహర్షియని యెరుగుదునా. జింకయని బాణము వేసితిని. ఋషియై వచ్చి యిటుల శపించెనే అని మిగుల దుఃఖించెను. నేనేమిసేయుదు. నీకేమి సేతును. మావంశము వృద్ధికావలయుననియుండ యిటులాయెనే. ఎవరితో చెప్పికొందును అని భగవంతుని ప్రార్థించెను. వేదవ్యాసుని రప్పించి యెంతశ్రమపడిరి. అని చింతించెను.

స్వామీ! మరి వేరే దిక్కెవరు. నన్ను బ్రోవకుండుట న్యాయమా. సరియైనమార్గమును వదలని నన్ను బ్రోచెడు దొరవుకదా. ఇట్టినన్ను కష్టమున విడిచితివే అనియిటుల ప్రార్థించెను. స్వామికి శక్తియుండినను భక్తపరాధీనుడగుటచేత శాపమును మార్చజాలడు. అటుల మార్చినయెడల కేపెవరైనను ఆయననుగూర్చి తపమాచరింతురా. కుంతియును మాద్రియును ఉండినను సంతతికలుగుటకు లేదుగాన మీరు ఊరికి పొండి. ఇట్టి శాపపాత్రుడు ఊరికి వచ్చి యేమిప్రయోజనము. నేను యిచ్చటనే సంచరించుచుండెదను అని పాండురాజు భార్యలతో చెప్పెను. మమ్ము ఊరికి పొమ్మనిన మిమ్ము విడిచియుండజాలము. ఇచ్చటనే దూరముగనుండి మీదర్శనముచేయుచు నుందుము. బలాత్కారముగ పొమ్మనిన పోయి నీటబడుదుము అని కుంతిమాద్రులనిరి. అటులైన ఉండుడని పాండురాజనెను. పాండురాజు తీవ్రతపము గావింపదలచి హిమవత్పర్వతము దాటి గంధమాధన పర్వతమునకు పోయి దానిదాటి ఇంద్రద్యుమ్న సరస్సును జూచి దానిదాటి హంసకూటమునుదాటి శతశృంగపర్వతమునకుపోయి తపమాచరింపసాగెను. భార్యలనుసహా తపమాచరింప నాజ్ఞాపించెను. భగవద్గీత 6 అధ్యా 10 శ్లోకమటుల స్వామియందే మనసుంచి తపమాచరించుచుండిరి. ఈయనకు ఊరికిపోవ నిష్టము లేకుండెను. భార్య లుండుటకును యిష్టములేదు. వేదవ్యాసానుగ్రహమునకదా నేను బుట్టితిని. భగవంతుడేకదా వేదవ్యాసుడు. ఆయనేకదా నాతండ్రి యని తలచి తండ్రీ! వచ్చి సమాధానము చెప్పరాదా యని పాండురాజు ధ్యానయోగమున తలచెను. భార్యలు ఋషిపత్నులవలె నుండిరి. నేను కేవల అజ్ఞానిని. పరమ పతితుడను. ఋషిని చంపితిని. బ్రహ్మహత్య చేసినటు లాయెను. నన్ను గాచుటకు స్వామి వచ్చునా. నేనెందు వెదకుదురా, హరి స్తుతించినరాడా నాలుగుముఖములతో నాలుగు వేదముల్లను చెప్పుచు అర్థము చేయుచుండు బ్రహ్మస్తోత్రమును విని రాని నిన్ను యెందువెదకుదురా. కలుషాత్ముడై దుష్కర్మయుతుడై పలుమరు దుర్భాషియై భక్తాగ్రేసరవేషియై యుండు నేను నిన్నెందు వెదకుదురా అని యిటుల పాండురాజు స్తుతించుచుండగా, ఆకాశమున ఋషులు బయలుదేరిరి. వారిని జూచి పాండురాజు- ఎచ్చటపోవుచున్నారు. ఋషులు- సత్యలోకమునకు పోయి బ్రహ్మదర్శనము చేయుదుము. పాం- నేనును వచ్చెదను. ఋ- నీవు రాజాలవు. శతశృంగ పర్వతమున తపమాచరించగనే మాతోడ రాగలుగుదువా. (పాండురాజు కొంతదూరమ్ము పోయెను. వలనుపడలేదు. నాయనా పొమ్ము. సంతతి కలుగవలయును పొమ్మనిరి.) పాం-పొమ్మనిన నెటుల మార్గమును చూపుడు. ఋ- మార్గమేమున్నది, నీకు శాపముకదా. పాం- అయిన నాకు గతిలేదా. ఋ- నీకు ఔరసపుత్రుడు కలుగడు. నీ క్షేత్రమున కలుగవచ్చును. అనిచెప్పి ఋషులు పోగనే పాండురాజు తలోచించెను. ఈసంగతి నాకు సమ్మతముగ నున్నది. నాభార్య సమ్మతింపవలయునే. అవసరముగ పిలిచి ఓపీ యెవరైనను పొంది సంతతిబడయవలయునని

పతివ్రత యగుదునో అని మిగుల చింతించి భార్యను పిలిచి చెప్పెను. పాండురాజు—
కుంతీ! యేమందును. కుంతి— ఏమిచింత. పాం— కుంతీ' మహర్షి శాపము వచ్చెను. నీసన్ని
ధానమునకు వచ్చుటకు లేదు. ఈ యుగధర్మము ననుసరించి పెద్దలను పిలిచి సంతతిని
బడయుము. నేను మనఃపూర్వకముగ సమ్మతించుచున్నాను. కుం— అదియేమి. అటుల
న్యాయమున్నదా. పాం— శారదండా అనురాజు సంతతిలేనందున భార్యను పిలిచి ఒక
మహర్షిని ప్రార్థించి పుత్రుని బడయుమని చెప్పెను. ఆమె భర్తయాజ్ఞను పొంది యొక
ఋషిని ఆశ్రయించి ముగ్గురు పుత్రులను కనెను వ్యభిచరించి పుట్టిరని దోషమేర్పడెనా.
ఉభయకులములకును ఉత్తారకులైరి. కుం— మీరు చెప్పుటకు ప్రతిచెప్పుచున్నా నను
కొనకుడు. ఇతరులను పిలిచిరయే కనవలయునా. పాం— నేను దగ్గర రాకూడదే. కుం—
అవశ్యములేదు. సంతతి కలుగవలయునని మీరు మనసా తలపుడు. ఇది శాపమునకు ప్రతి
బంధకము కాదుకద. పాం. ఓసీ! వెఱ్ఱిదానా! స్పర్శలేక సంతతి కలుగునా. కుం— నాకను
కూలమైన కథను చెప్పెదను. వినుడు. వ్యుషితాశ్వునిభార్య సుభద్ర. భర్త మృతినొం
దగా సంతతిలేదని చింతించెను. మరియొకని బిలిచి పుత్రుని బడయుమని ఆయన అనెను.
దీనికై మఱియొకని పొందనని ఆమె చెప్పెను. నేను మృతుడనైతినే యని ఆయన అనగా
అయిన నేమి మీవలననే కలుగవలయునని ఆమెచెప్పెను. శవశరీరమును మంచముమీద
నుంచి ఆలింగనము చేసికొనుము సంతతి కలుగును అని ఆయన చెప్పెను. ఆమె గొప్ప
పతివ్రత. పతిభక్తియుండిన పతి మృతుడైననేమి. బ్రతికియుండిననేమి అని తలచి శవశరీర
మును ఆలింగనము చేసికొని పుత్రులబడసెను. వారు సాళ్వ మద్ర దేశాధిపతులైరి.
మిమ్ముఁవినా నామది యెందు నిలువదు. దీనికై ఒక్కని నాశ్రయింపవలయునా మీరు
మనసున దలచిన కలుగదా. పూర్వము స్త్రీలు తోచినటుల ఉండవచ్చునని యుండెను.
ఒక వ్యవస్థ లేకుండెను. ఎవరియెడ యిచ్ఛయో అటులుండవచ్చునని యుండెను. పాం—
అందుకే చెప్పుచున్నాను. కుం— కడవరకును వినుడు శ్వేతకేతుడనుఋషి తండ్రి ఉద్దా
లకుడు. సాఽఽత్మాతత్త్వమసి యని ఆయన శ్వేతకేతునకు ఉపదేశించెను. శ్వేతకేతుడు
చూచుచుండగనే ఉద్దాలకమహర్షి భార్యను ఒక బ్రాహ్మణుడు చేయిపట్టుకొనెను.
న్యాయము ననుసరించి ఉద్దాలకుడు ఊరకుండెను. శ్వేతకేతు సహించక ఆబ్రాహ్మ
ణుని పిలిచి వలదనెను. న్యాయ మటులున్నదని అతడనెను. తండ్రితో చెప్పెను. న్యాయ
మటులున్నది అని ఆయనయును చెప్పెను. తండ్రీ! యెవరిటుల వ్యవస్థచేసిరో నేటినుండి
యును యీవిధిని కొట్టివేయుచున్నాను. నేటినుండియు స్త్రీలు పరపురుషుని దలచిననే పతి
తులగుదురు. అదియేమి న్యాయము ప్రౌఢుడను నాముందు యిటుల చేయుటయా. నేటినుండి
యును కుంభీపాకాది నరకముల ననుభవించవలయును అని శ్వేతకేతు శాసనమేర్పర
చెను. పూర్వముండిన శాసనమును కొట్టివేసెను. కావున నేను అటులాచరించుటకు
న్యాయములేదు. పాం— కుంతీ! కడవరకును చదివితివా. క్రింద యిటుల వ్రాసెను.

శాసనమును మార్చితిని. భర్తఆజ్ఞ మీరరాదని ననియు లేకున్న పాపమనియు వ్రాసితిని. సంతతి లేకపోయినయెడల భర్త మనఃపూర్వకముగ నెవరినైనను రప్పించి సంతతిని పొందుమని భార్యతో చెప్పగా తప్పినయెడల అట్టిభార్యకు నరకము కలుగును అని వ్రాసెను. చూడలేదా. భర్త అనుమతిని నడుపవలయునని యున్నదే చూడలేదా. కుం- చూచితిని. పాం- నేను మనఃపూర్వకముగ చెప్పుచున్నాను వినకపోతివేని నరకమే. కుం- అటులెవరైనను చేసియున్నారా. పాం- శారదండాయని సంగతి చెప్పితినికదా. కుం- ఒకసంగతియేనా. పాం- కల్మాషపాదుడు లేక సౌదాసుడు అనువనికి సంతతి లేకపోగా మదయంతి యను భార్యను పిలిచి మనకులగురువు వసిష్ఠుడు. వారిని రప్పించి పుత్రుని బడయుమని చెప్పెను. ఆమె భర్తయాజ్ఞచేత అట్లేచేసి అశ్మకుడను పుత్రుని బడసెను కుం- వారటులచేసిరి. మనయింట అట్టియాచార మున్నదా. (పాండురాజు తలవంచెను.) కుం- ఏల అటులున్నారు. పాం- నే నటులే వ్యాసాను గ్రహమున పుట్టితిని. కుం- అటులా, అవశ్యం. పితురాచారం. పాం- ధర్మశాస్త్రమును, అనుష్ఠానమును, మనయింటివాడుకయును. అటులేయున్నవి. (ఇదివరకు కుంతి ధర్మశాస్త్రము ననుసరించి తలయెత్తి మాటలాడెను. ఇపుడు యితరుని రప్పించవలసినటుల ధైర్పడెను. పరపురుషుని రప్పించుకొనెదనని స్త్రీ చెప్పునా. తలవంచి మాటలాడెను. దైవమా! నిన్నునమ్మి తెగించి సమ్మతింపవలసియున్నది అని చింతించి సిగ్గుతోను భయములోను అటులే చేసెదననెను). పాం- ఎవరిని రప్పించెదవు. కుం- సామాన్యులను రప్పించరాదు. దేవతలను రప్పించవలయును. పాం- అట్టిశక్తి నీకు కలదా. కుం- (తలవంచి) అదియే చెప్పవచ్చుచున్నాను. నేను పిలిచిన దేవతలు వత్తురు. పాం- అదెటుల. కుం- నేను చిన్నతనమున నుండగా దూర్వాసుడు వచ్చెను. మహాకోపనిధి ఆయనకు కోపము తెప్పించిక బ్రహ్మసృష్టిలో నొకరును ఉండరు. కారణమ్ము లేకనే ఆయనకు కోపము వచ్చును. నేను ఆయనకు ఒకసంవత్సరము! శుశ్రూష చేసితిని. అమ్మా నీపై భర్త తండ్రి ప్రీతిగ నుండవలయునని వరమీయరాదు. ముప్పదిమూడు కోటుల దేవతలలో నెవరినిపిలిచిన వారు రావలయును. అట్టిమంత్రమును ఉపదేశించెదను. ఇది పిలుచుట, మనము పోవుటయా యని వారికి తోచినను యీమంత్రము వారిని గొంతు పట్టి నెట్టుకొని వచ్చును అనిచెప్పెను. అట్టి పుత్రప్రదమైన మంత్రమును నాకు ఉపదేశించెను. మీకంటెను హెచ్చైనవారిని రప్పించెదను. పాం- ఎవరినైనను రప్పించి చూచితివా. కుం- తల వంచెను. పాం- నీపై నేరములేదు. మంత్రప్రభావమును చెప్పుము. కుం- చిన్నవాడు సూర్యుని రప్పించితిని. అతడు రాగా పొమ్మంటిని. పోననెను. ఒక పుత్రుడు (కర్ణుడు) కలిగెను. పాం- సరి ఒకదేవతను రమ్మనుము ఇది పాపమని రేపు యముడు చెప్పునని భయపడుచున్నావు. ఆయముని నే రమ్మనుమని పాండురాజనగా

కుంతి యముని బిలిచెను. అగడు వచ్చెను. గర్భిణియై తోడనే పుత్రుని గనెను. యమ ధర్మరాజాగాన మిగుల ధర్మాత్ముడు పుట్టెను.) పాం—కుంతీ రాజ్యమును పెరరాజా గ్రహించినను నేనైననేమి పిన్ననేమి యనును.అట్టిశాంతమూర్తి పుట్టెను. చురుకుగ నుండునట్టి వాడు పుట్టవలయును. జగత్ప్రాణుడుగనుండు వాయుదేవుని పిలువుమని పాండురాజా అనగా, నామె వాయు దేవుని బిలిచి పతియాజ్ఞయాయె నొక పుత్రుని అనుగ్రహించవలయు ననగా సరియని అతడు భీముని నిచ్చెను. వాడు మిగుల సాధువు వీడు మిగుల దుష్టుడు. సమరసముగ నుండిన బాగుగ నుండును. (అతనికి కొట్టినను కోపము రాదు. ఇతడు కారణము లేకయే పరులను కొట్టును) అని పాండురాజనగా యెవరిని పిలతునని కుంతి యడిగెను. లోకరాజా ఇంద్రుని బిలువుమని పాండురాజనెను. ఆమె యటులే చేసి అర్జునుని కనెను. ఇక ఊరక పిలువుమనకుడు. మీయాజ్ఞ ననుసరించితిని. మూడవ వాడు అందముగను చమత్కారిగను నున్నాడు అని కుంతి యనెను. రాజాయొక్క పెద్దభార్యకు గౌరవము జరుగును. చిన్నభార్యమీద మోహముండినను రహస్యముగ చూపవలసియుండును. విషయ మటులుండగా పాండురాజువలన పుత్రుడు కలుగుటకు లేదు.మాద్రికి మంత్రము రాదు. ఇక మనగతి మోస మనుకొనెను. మాద్రి అటుల తలచి రహస్యముగ భర్తను పిలిచి నాకొక మంత్రమును చెప్పుమనుడని యడిగెను. కుంతీ దానికొక మంత్రము చెప్పుమని పాండురాజనెను. నాకే మంత్రోపదేశమాయెను. మీకొరకు ఒకమంత్రమును చెప్పెదను మరల మరల అడుగరాదు అని కుంతి ఒకమంత్రము చెప్పెను.ఒక కన్నుగలవాడు కన్నుగలవాడే కాడు. ఒకపుత్రుడుండుట యుండుటే కాదు. ఆబిడ్డకు వ్యాధివచ్చిన నెటుల. మరియొక మంత్రముండిన బాగుగ నుండునని మాద్రి తలచెను. కుంతి చెప్పదని తెలియును కావున ఒక మంత్రమును చెప్పవలయును యిద్దరుదేవతలు రావలయును యిద్దరు బిడ్డలు పుట్టవలయును అని తలచి మాద్రి ఒకరినొకరు యెడబాసియుండని అశ్వినీదేవతలను తలచెను. చమత్కారి. అటుల ప్రార్థించగా వారిద్దరు వచ్చిరి. నకులసహదేవులు పుట్టిరి. అయిదుగురికిని నామకరణము చేసిరి. వీరు దేవాంశసంభూతులు. వీరివలన భూభార పరిహారము కాబోవుచున్నది అని దేవతలు పూలవాన గురిపించిరి. వీరు దేవకార్యమునకై అవతరించిరి. దుష్టనిగ్రహము శిష్ట పరిపాలనము జరుగును. ఇక దేవతలకును భూమికిని క్షేమము కలుగును. అని అశరీరవాణి పలికెను. అప్సరలు ఆడిరి. దేవదుందుభులు మ్రోగెను. హాహా హూహూ గంధర్వులు పాడిరి.

---

(11) పాండవాగమనము.

పాండురాజు వేటకు పోయియుండిన కాలమున వేదవ్యాసుడు హస్తినాపురమునకు వచ్చెను. ధృతరాష్ట్రుడును గాంధారియును వారికి నమస్కరించి సంతతి కలుగలేదు. కలుగునటుల ఆశీర్వదింపుడు. సుందరకాండ పారాయణము, అశ్వత్థప్రదక్షిణము, రామేశ్వరయాత్ర మొదలగు కార్యము లెందుకై చేయుదురు. భగవన్ముఖోల్లాసము కలుగుటకుకదా. ఏభగవంతుని అనుగ్రహమునకై యీయత్నములు చేయుదుమో ఆభగవంతుడుకదా మీరు. ఏల ఆశీర్వదింపక తామసించుచున్నారు. సంతతి కలిగింపుడు అని ప్రార్థించిరి. నేను మీకోడలిని. ఆయన మీకుమారుడు పదులనెల్లరను అనుగ్రహించుచున్నారు. మమ్ము అనుగ్రహింపరాదా అని గాంధారియును ప్రార్థించెను. శక్తిలేని ప్రభువు యొద్దకేగి ప్రార్థించినయెడల స్వల్పముగ నిచ్చును. వేదవ్యాసుడు శక్తిగలవాడు విశేషముగ నీయగలుగును. ఎన్నిబిడ్డలు కావలయునని గాంధారిని నడిగెను. గాంధారి నూర్గురు పుత్రుల నడిగెను. పరమబలిష్ఠులై నీభర్తకుసములై, వారివీర్యమునకు అటులనే పుట్టుదురని వేదవ్యాసుడనెను. వారి అనుగ్రహముచేత గర్భధారణమాయెను. దినక్రమముగ గర్భము వృద్ధియై రెండుసంవత్సరములైనను ప్రసవము కాలేదు. గర్భము పెద్దదాయెను. బిడ్డలుండునటులున్నది. నూర్గురున్నారుగుకదా. మహర్షి యనుగ్రహము వృథకాదు అనితలచి గాంధారి నమ్మికతో నుండెను. ఇటులుండగా కుంతికి ఒక కుమారుడు కలిగెనను వర్తమానము వచ్చెను. గాంధారి యీమాటవిని నాకు రెండేండ్లుగ నేమియును లేకున్నది. దానికి పుత్రుడు కలిగెనట వ్యర్థముగ నీభారమును సహింపనేల యని తనగర్భము నొక రాతితో కొట్టుకొనెను. ఒక మాంసపు సంచి పుట్టినది. పక్వముకాలేదు. కాయగానుండెను. ఇదేమి గ్రహచారము. దీని పారవేయవలయును అని గాంధారి తలచెను. వేదవ్యాసుడు సాక్షాత్ నారాయణుడగుటచేత యెచ్చటనున్నను నిండియుండు ఆయనకు గాంధారితలపు తెలిసెను. సంచిని పారవేయించులోపల ఆవిర్భవించి యేమమ్మా' యిటుల చేసితివని అడిగెను. వైద్యునియొద్ద సంగతిని దాపవచ్చునా. నిజము చెప్పవలయును. దాచిన వ్యాధి యెటులకుదురును. కావున గాంధారి నిజము చెప్పెను. నాకు యీగర్భమునుగూర్చి నమ్మిక యుండెను. నిరాశించితిని. కుంతికి పుత్రుడు కలుగుటను విని రాతితో కొట్టుకొంటిని. ఈసంచి పడెను. దీని నేమిచేయుదును. పారవేయ దలచితిని అని గాంధారి చెప్పెను. కుంతిమీది యసూయచేత నిటులచేసితివని వేదవ్యాసుడు నూరుబిందెలను తెచ్చి నేయివేసి నూరు తుండములుగ చేసి దానిలో వేసెను. అవసరపడకుము. ఇవి గ్రుడ్లయి పగిలి బిడ్డలు పుట్టును. మరల యొత్తి చూడకుము. కొంచెము ఓర్చుకొనుము. క్రమేణ పుట్టుదురు. వీనిని కాపాడుచుండుము అని ఆయన చెప్పెను. గాంధారి యటులే కాపాడుచు వచ్చెను. కుంతికి పగటి

యందు. రెండవబిడ్డ పుట్టెను. నేను వేదవ్యాసుని దలపగా నతడు సర్వజ్ఞుడగుటచేత వచ్చి నూరుఖండములను నేతిపాత్రలందుంచి పోయెను. జాగ్రతలో కాపాడు మనెను. వీని కాపాడుట శ్రమగనున్నది. కుంతికి రెండవబిడ్డ పుట్టెను అని గాంధారి వ్యాసుని ధ్యానించెను. ఆరాత్రియే దుర్యోధనుడు పుట్టెను. పాండవులు యోగ్యులు. దేవాంశసంభూతులు. వీరు అసురాంశసంభూతులు.

దుర్యోధనుడు పుట్టగనే గాడిదవలె నేడ్చెను. ఒకసారి గాడిదవలెను, మరియొకసారి కాకమువలెను, యింకొకసారి గృధ్రమువలెను యేడ్చుచుండెను. అనర్థము సంభవించునటులున్నది. ఈబిడ్డను ముగించినటులైన బాగుగ నుండునని గాంధారి తలచెను. ఇల్లు బాగుగ నుండవలయుననిన యీబిడ్డను పారవేయుడని భర్తతో చెప్పెను. ఒకనివలన యిల్లు చెడునటులుండిన యేదియోయిచ్చి వాని బంపివేయవలయును. ఒకకులమును చెడుపువారిని త్యజింపవలయును. ఒక కుటుంబమువలన గ్రామమునకు హాని కలుగునటులుండిన ఆయింటికి నిప్పుపెట్టవచ్చును. ఒకగ్రామమువలన జిల్లాకు అసౌఖ్యము కలుగునటులుండిన అచ్చట నుండువారి నందరిని పంపి ఆగ్రామమును చెడపనగును. తనసౌఖ్యమునకై అన్నిటిని త్రోసిపుచ్చవచ్చును. మనకుటుంమునకై యీ యొకబిడ్డను పారవేయుమని భీష్మాదులు విదురుడు ద్రోణాదులు సభలోనివారందరు చెప్పిరి. ఎటులైనను మనయింట పుట్టినబిడ్డకదా యని ధృతరాష్ట్రుడు పారవేయుటకు యిష్టపడలేదు. వాని విడువలేదు. భగవద్గీత 2 అధ్యా 62, 68 శ్లోకములటుల ఒక విషయమున ఆశపడినవానికి చదువు మరగిపోవును. ధృతరాష్ట్రుడు వివేకి యైనను వివేకము లేకపోయెను. ఆబిడ్డ అటుల పెరుగుచు వచ్చెను. ప్రతిదినమును ఒకబిడ్డ పుట్టుచువచ్చి నూరుదినములకు నూర్గురు బిడ్డలుపుట్టిరి. అచ్చట యిద్దరు బిడ్డలు నిలిచియుండెను. సంవత్సరమున కొకబిడ్డ పుట్టుటచేత వారిమాట రాలేదు. ఆడువారికి కుమారునిమీద మిగుల ఆశయుండదు. అల్లునిమీద ఆశ ఉండును. కోడలిభర్తగాన కుమారునియందు తక్కువగను కూతురిభర్తగాన అల్లునియందు అధికముగను ప్రీతియుండును. ఇది ఆడువారగుణము. అనగా వారికి ఆడుబిడ్డమీద ప్రీతి యధికము. అటులగుటచేత గాంధారి కుమారిత కలుగవలయునను తలపులో వేదవ్యాసుని ధ్యానించెను. ఆయన రాగా సంగతి చెప్పెను. వ్యాసుడు నూరుబిందెలను తెమ్మని వాటియందుండినదానిని యెత్తి చేర్చగా నొకపిండమాయెను. ఆది కూతురుగ పుట్టెను. ఆమె పేరు దుస్సల. ఒకదాసి పట్టరాణియగు గాంధారికి విసరునప్పుడు రాజుకును విసరుచుండెను. అధిక పరిచయముచేత సంబంధమేర్పడి దానికొక పుత్రుడు కలిగెను. అతనిపేరు యుయుత్సు. వైశ్యస్త్రీకి పుట్టినవాడు. ఈకథకు దుర్యోధనాది జననమని పేరు. పూరువంశవర్ధకులై పెరుగుచుండిరి, ధృతరాష్ట్రుని బిడ్డలు రాజ్యములోను, పాండురాజుపుత్రులు వనములోను పెరుగుచుండిరి. భీముడు పాలు ద్రావగా మరల నొకసోలవరకు పాలుండవు. ధర్మరాజు అర్జునుడు

పాలుద్రావుటకు రాగా భీముడు వారిని త్రోసి తాను త్రాగును. కుంతి యొక్క వ్యవస్థ చేసెను. భీమా! ఒకభాగము నీకు. వారిని కొట్టకుము అనెను. దుశ్శాసనుని జరాసంధుని చంపవలెనా. ఇతరుల సంబంధములేక త్రాగెను. తల్లియొడిలో పరుండి త్రాగుస్థితిలో అటుల చేసెను. నడచు స్థితిలో ఋషిపుత్రులతోడ పోయి చెట్టెక్కి కొమ్మలలో ఆడుదురు. భీమునివంతు వచ్చినపుడు కొమ్మవిరుగును. వేరొకదానిలో ఆడవలసి యుండును. ఇవి పరమ బాలలీలలు. వారిటుల వృద్ధియగుచుండగా ఉపనయన కాలమాయెను. పాండురాజు అడవిలో నుండెను. వీరు పాండురాజుకు పుట్టినవారుకారు. ఎటుల ఉపనయనము జరుగునని తలపగా, వసుదేవుడు వారి మామగాన పురోహితుని తోడ వచ్చి చౌలోపనయనముల చేయించెను. క్షత్రియులుగాన ధనుర్విద్య నేర్పవలసి యుండెను. తపమాచరింపుచుండిన ఒకరియొద్ద పాండురాజుబిడ్డలని ఒప్పగించగా అతని యనుగ్రహమున ధనుర్విద్యయందు పారంగతులైరి. పాండవులు పరమ సుందరాకృతులు. పదునారు, పదునేను, పదునాలుగు, పదిమూడు సంవత్సరముల వయసుగలవారై యుండిరి. వారు స్వయముగనే తేజస్సుతో గూడియుండిరి. ఉపనయనమై ధనుర్విద్య నేర్చగనే అధికముగ ప్రకాశించిరి. మన్మథుడు తన అయిదుబాణము లుండునటుల తానును అయిదు రూపము లెత్తవలయునని తలచి అటుల చేసి త్రైలోక్యమును మోహింపజేయుటకై తిరుగుచున్నాడో యని పాండవులను జూచిన ఋషులు తలచిరి. పాండవు లటుల వనప్రదేశములలో సంచరించుచుండిరి. ఇటు లుండగా వసంతఋతువు వచ్చెను. అది మనోహరమైన ఋతువు. పుష్పములు విస్తారముగ దొరకు ఋతువగుటచేత దశరథుడు శ్రీరామునికి అపుడే పట్టాభిషేకము చేయతలచెను. అట్టి ఋతువది. ఎచ్చటచూచినను చంపక పుష్పము లుండెను. వానిగాలి వీచుచుండెను. ఎచ్చటచూచినను పొగడపూవు లుండెను. వానిధూళి విసరుచుండెను. ఆధూళిని గాలి తెచ్చుచుండెను. మామిడిపండ్లు పండెను. వాని మెక్కి కోకిలలు పంచమ స్వరములో కూయుచుండెను. అపుడు స్త్రీలను విడిచిన పురుషులకును, పురుషులను విడిచిన స్త్రీలకును, వారిని చేరవలయునని కోర్కెపుట్టును. ఇంతకు మామిడిచిగురు కారణము. ఎర్రతామరలలోని తేనెనుత్రాగి తేనెటీగలు ఝుంకారముచేయుచుండెను. ఆపుష్పములు మన్మథుడు భుజించు తేనెగిన్నెలుగ తోచెను. మన్మథాగ్నియొక్క ప్రకాశమువలె తోచెను. మల్లెలు పుష్పించెను. అవి తెల్లగనుండెను. పాండురాజా! నీవు మరణమునుసహా యోచించక పోవుచున్నావుకదా యని ఋతువు నవ్వునటులుండెను. అదిమొదలు వివేకులకైనను వివేకమును తగ్గించుకాలము. అట్టికాలమున కుంతి యింటిపనులు చూచుచు వచ్చు ఋషులను ఉపచరించుచు ఉండెను. పాండురాజు ఏకాంతముగ నుండెను. మాద్రి దేవతాస్త్రీవలె సమీపమునకు వచ్చి చేరెను. మనోహరమైన కాలమున ఏకాంతసమయమున దివ్యరూపముతో వచ్చిన మాద్రినిచూచి పాండురాజు కిందమమహర్షి యొక్క

శాపమును మరచి రతిసుఖమును గోరెను. శాపమున్నదే యని మాద్రి చెప్పగా అతడు లక్ష్యము చేయలేదు. భగవద్గీత 3 అధ్యా 37 శ్లోకము మొదలు 43 శ్లోకము వరకు కామము చెరచినట్టిదని స్వామిచెప్పెను. ఎట్టివారికైనను కామమును కలిగించు కాలమగుటచేత పాండురాజు మాద్రిని బలాత్కరించి, ఒకటితో నొకటి యొరసుకొని పూలతో గూడియుండిన గోరింటవృక్ష గృహమునకు పిలుచుకొనిపోయి, క్రిందపడియుండిన పూలను పరచి పాన్పుగచేసికొని బలాత్కారముగ సుఖమనుభవించెను. రతిసుఖము ముగియగా అతని ఆయుష్యుసహా ముగిసెను.

పాండురాజు మృతినొందెను. తోడనే మాద్రి యేడ్చెను. ఈసంగతి కుంతికి తెలిసెను. కుంతియును పుత్రులును ఋషులును వనదేవతలును యేడ్చిరి. పాండురాజు పరమధర్మాత్ముడు. అంత గుణవంతుడైనను అప్పటి స్థితిని జూచి శాపమును మరచెను. చెప్పినను వినక అనుభవించి మృతినొందెను. పాండురాజుశవమును జుట్టుకొని అందరును యేడ్చిరి. భర్తయొక్క అంగసంగసుఖము లేకున్నను సేవించుచు ఆనందమును పొందుచుంటిని. చరణసేవ చాలునని యుంటినే, దర్శనసుఖముసహా లేకపోయెనే. దైవము యెత్తుకొని పోయెనే. ఏపాపము చేసితిరా. రామా. పురుషసుఖమును, పురుషుని, లేక చేసితివే. ఊరినుండి బయలుదేరుటకు జ్యోతిష్కులెట్టిముహూర్తము పెట్టిరో. శ్రీరాముని పట్టాభిషేకమునకు పెట్టినటులైనది. రెండుదినములు జ్వరమువచ్చి పోరాదా. ఋషిమాటను అతిక్రమించి పోయెనే. అది నాగోడ అనుభవించి పోరాదా, ఆసుఖము నాకు కలిగియుండరాదా అని కుంతి అనేకవిధముల దుఃఖించి, మాద్రీ! నీవైనను బుద్ధిచెప్పరాదా, నీకును బుద్ధి యొచటికేగనే అనెను. అక్కా! నేనెంతో చెప్పితిని. నేను బలాత్కరించలేదు. శాపమును జ్ఞాపకపరచితిని. పురుషుడు బలాత్కరించిన నేనేమి చేయగలుగుదును అని మాద్రి అనెను. సంస్కారములు సల్పిరి. ఈయనర్థము నావలననే యేర్పడెను. కావున నేనిక మనియుండజాలను, అనుమరణమును పొందవలయును అని తలచి మాద్రి తన యిద్దరు పుత్రులను అక్కకు ఒప్పజెపి, అక్కా! భర్త నన్ను కోరి సుఖమనుభవించెను. అట్టి భర్తను విడిచి యుండజాలను పతిలోకమునకు పోయెదను అని చెప్పి చితిమీద పరుండెను. ఇంతవరకు పాండురాజుండెను కావున యిల్లయిన నేమి వనమైననేమి యని యుంటిమి తలిదండ్రులులేని బిడ్డలను, తండ్రిలేని బిడ్డలను, ఉంచుకొని యీమె యేమిచేయుగలదు అని ఋషులు తలచి కుంతిని, యేవురు కుమారులను, హస్తినాపురమునకు పిలుచుకొనిపోయి భీష్మునియొద్ద నొప్పగించి జరిగిన సంగతి చెప్పిరి. ధృతరాష్ట్రునికి ఒప్పజెప్పి వీరు ధనుర్విద్యలో పారంగతులు. ఇదివరకు వీరిని భగవంతుడు కాపాడెను. ఇకమీదు మీబిడ్డలే. దిక్కులేని బిడ్డలు. తమ్ముని పుత్రులని తలపరాదు అనిచెప్పిరి. అటులేకానిండని ధృతరాష్ట్రుడనెను. చిన్న పెద్ద తండ్రుల బిడ్డలని తలపరాదు. సహోదరులని తలపవలెను. అని దుర్యోధనాదులతో చెప్పగా వారును

సమ్మతించిరి. ఋషులు అంతర్ధానమొందిరి. కుంతియును,బిడ్డలును ఉండుటకు బంగళా నేర్పరచిరి. భోజనాదులకు యేర్పాటుచేసిరి. ఇటుల జరుగుచుండగా వేదవ్యాసుడు వచ్చి బిడ్డలను చూచి యీబిడ్డలకు నీవే తల్లి తండ్రివని భీష్మునితో చెప్పెను. సత్యవతికి నమస్కరించి, అమ్మా! అనేక సుఖదుఃఖములను చూచితివి. ఇక నిచ్చట నుండవలదు. అడవికి పొమ్ము. ఈ నూర్గురును కుటుంబమును నాశము సేయబుట్టిరి. వీరికి కలహములు పుట్టును. వీరు పరమ అయోగ్యులు.వారు పరమ యోగ్యులు.వీరికిని వారినికి సరిపడదు. యుద్ధము జరుగును. ఆఘోరమును చూడకయే వనమునకు పోయి తపమాచరించి మోక్షమునకు పొమ్ము అనిచెప్పెను. సత్యవతి యేకాంతముగ యిద్దరు కోడండ్రను పిలిచి అంబికా నీతో చేరినవారు కౌరవులు. అంబాలికా నీతో చేరినవారు పాండవులు. వీరికి కలహములు కలుగునని పెద్దకుమారుడు చెప్పెను. వీరు నామునిమనుమలు మీకు మనుమలు. వీరి దుఃఖమును చూడచాలము వనమునకు పోవుదము రండు యనెను. అత్తా! మంచిమాట. పోవుదమని వారనిరి. సత్యవతి భీష్మునితో చెప్పి యిద్దరు కోడండ్రతోడ వనమున కేగి సిద్ధిపొంది వారితోడ మోక్షమునకు పోయెను.

---

(12) కురు పాండవ విద్యాభ్యాసము—బాలలీలలు.

పాండవులు హస్తినాపట్టణమునకు వచ్చినపుడు పదునారు, పదునేను,పదునాల్గు, పదిమూడు, సంవత్సరముల వయసు గలిగియుండిరి. భీముడు పుట్టినరాత్రే దుర్యోధనుడు పుట్టెను. భీమునికిని అర్జునునికిని మధ్య నూర్గురు పుట్టిరి. మహాసాధ్వి మహాపతివ్రతాశిరోమణి కుంతి. దిక్కులేని బిడ్డల నుంచుకొని యుండెను. వారువారు కుంతిని జూచి, అమ్మా! బిడ్డలనుంచుకొని కష్టపడుచున్నారే అనగా మేము చేసిన కర్మమును అనుభవింపవలదా, ఏజన్మమున నేపాపము చేసితినో ఆఫలమును అనుభవించుచున్నాను. సంసారమున సుఖదుఃఖము లుండును. వాని భగవంతుడే యిచ్చును అనితలపవలయును. సుఖము కలిగినపుడు తాము చేసినటులను, దుఃఖము కలిగినపుడు భగవంతుడు చేసినటులును తలపరాదు. సకలమునకును వాడేయని తలపవలయును. ఏకష్టము వచ్చినను భగవంతుని కటాక్ష ముండవలయును. న్యాయాధిపతి కొందరిని దండించుటచేత చెడ్డవాడనియు, కొందరిని మన్నించుటచేత మంచివాడనియు తలపబడడుకదా, అటులే భగవంతుడు మనకర్మములను హృదయాకాశమున నుంచుకొని, ఒక్కొక ఫలముగా యిచ్చుచుండును. అతడు నిష్పక్షపాతి యని బుద్ధిశాలియగు కుంతి దుఃఖప్రశ్న చేయువారికి బదులు చెప్పుచుండెను. పాండవులు అడనారంభించిరి. చిన్నబిడ్డ లగుటచేత పాండవులేవురును, కౌరవులు నూటయొక్కరును, మొత్తమున నూటఆర్గురునుచేరి ఆటలాడుచుండిరి. ఒక్కొక

ఆటలోను వారు ఓడిపోదురు. పాండవులకు జయము కలుగుచుండును. భగవదనుగ్రహపాత్రులు. అరమైలు పరుగెత్తవలయుననియు ముందుపోయినవాని వెనుకచిక్కిన వాడు యెత్తుకొనవలయు ననియు పందెము వేసికొందురు. భీముడు ఒకమైలు పరుగెత్తును. రాయివేసి చెట్టునుండి ఫలములను రాల్చవలయునని పందెము వేసికొందురు. వారు నూరురాళ్ళను వేసినను పడవు. భీముడు ఒకరాయి వేయగా నూరుఫలములు రాలును. వారు ఐదు పది పండ్లను భుజింతురు. భీముడు వేయి రెండువేల ఫలములను భుజించును. వేగముగ పరుగెత్తవలయును. పరుగెత్తువాని పట్టి క్రిందపడవేసి కదలకుండ కట్టవలయును అని పందెము వేసికొందురు. భీముడే అనాయాసముగ నూటఒక్కరిని త్రోసివేయును. భగవదనుగ్రహముచేత బాలక్రీడలలోనే వారు అనేక ఘనకార్యములు చేయుచుండిరి. అన్నిటిని చెప్పుటకు సాధ్యమగునా. కొన్ని సంగతులు మాత్రము తెలుపబడును. ఆనూటఒక్కరు ఒకకక్షిగను ఈయైదుమంది ఒకకక్షిగను ఉందురు. భీముడు నూటఒకరి జుట్లను ఒకటిగా చేర్చి యెత్తును. గాయములు తగులగా వలదు వలదందురు. హోయని అరతురు. ఈతకొట్టుదురు. భీమా యెత్తుకొని పోయెదవా యని వారడుగగా పదుగురు పదుగురిని ఒక్కొక భుజమున నెక్కించుకొని యీదుచుపోయి నీటిమధ్య మునుగును. తత్త్వమా కర్మయోగమా జ్ఞానయోగమా యనిన గీతాచార్యుని యనుగ్రహము. భీముడు చెట్టును కాలితో తన్నగా అది గడగడ యాడును. ఫలములకై మీద నెక్కియుండినవారు క్రిందపడుదురు. పెద్దగాలికి ఆడినటు లాడును. చేతిలో పండ్లతోను పండ్లబుట్టలతోను నోటిలో పండ్లతోను క్రిందపడుదురు. ఇటుల బాలక్రీడలు జరుపుచుండ వారికి మాత్సర్యము హెచ్చెను. మనము యిందరున్నాము. వారు యేవురేను. వారేజయించుచుందురు. వారిలో వీడొకడే చాలును. వీని చంపవలయును అని భీముని చంపుటకు తలచిరి. జలక్రీడలని యేర్పాటు చేసిరి. శ్రమము గలిగిన అచ్చటచ్చట నిలుచుటకు యేర్పాటుచేసిరి. పాతాళమువరకు పోవునట్టి ప్రమాణకోటి యను మడుగుకు ప్రక్కన ఒక యిల్లు కట్టిరి. అచ్చట భీముడు పరుండి నిద్రించుచుండగా మరల పైకి రాకుండుటకై అతని కాలుచేతులు కట్టి నీటద్రోసిరి. వీడొకడు చచ్చిన ఆనలుగురిని చంపవచ్చునని యోచించిరి. వారు నూర్గురు. మనమేవురము. అయిననేమి యింకను వేయిమందిరైనను భయమేమి అని యుంటిమి భీముడు పోయిననెటుల. దైవంమానుషరూపేణ యని భీమునిరూపములోనుండి దైవము కాపాడుచుండెను అని నలుగురును ప్రలాపనము చేయనారంభించిరి. రామా! నిన్నువినా యెవరున్నారు మాటిమాటికిని దెలుపవలెనా అని చింతించిరి. యథేచ్ఛముగ పుష్పించిన తామరపుష్పములను పడకగ పరచి దానిలో నిద్రించిన నెటులో అటుల భీముడు నిద్రించెను. నదీతీరము. పుష్పము అన్నియును పూచియుండెను. సువాసన వీచుచుండెను. కావున భీమునికి మంచినిదుర పట్టెను. వారాసమయమున అతని త్రోయగా నీటిలోపలపోయెను. నిదురలేచెను. నీరు

లించుకొనగా కట్టిరియుండిన కట్లు వీడిపోయెను. వన్నిటుల కట్టి త్రోసిరా యని యీది పైకివచ్చి ఓరీ నిదురించుచున్నప్పుడా యిటుల త్రోసితిరి. అని వారిని కొట్టెను. ఒకనాడు శ్రాంతుడై మరల రారనితెంచి నిదురించగా, అయోగ్యబాలురు పాములవారితో చెప్పి నాగుబాములను భీమునిమీద విడిపించిరి. వానియొక్క కోరలు తాకినను గాలికొట్టినను చాలును. అట్టిపాము లవి. వాని ఆయాఅంగములలో విడిచిరి. ఆపాములు కరచి నాలుకతో నాకినవి. కారణమేమనగా పాములకు వాయువు ఆహారము. వీనితండ్రిని తినగా మధురముగ నుండును. వీని కరచిన నెటులుండునోయని బాగుగ కరచినవి. శరీరమాద్యంతము రక్తమువచ్చుటకు బదులుగ పాముల కోరలువీడెను. వీనికి విషము యొక్క లేదు. భగవద్గీత 7 అధ్యా 12 శ్లోకమున అర్జునా బలము బలమందురే అది నావలననే. బలరూపములో నేను కూర్చుండి అటులచేయుచున్నాను అని స్వామిచెప్పెను. కావున భీమసేనునిబలము వానిది కాదు. భగవంతునిదే. ఇదేమి చిత్రము. వీడెటుల చచ్చును అని దినదినమునకును వారికి అసూయ హెచ్చెను. ఒక్కొక్క కార్యములోను అపజయము కలుగగా భీముడు భుజించుపదార్థములలో నన్నిటిలోను విషము కలిపి పెట్టిరి. విషమును పదార్థము కలకండవలె మధురముగ నుండునందురు. అన్ని లడ్డులను యీయనకు పెట్టిరి. సంతోషములో భుజించెను. అరగంటలో చచ్చునని చూచుచుండిరి. అరగంటకు ఫలహార మీయుడనెను. భీమునికి సంకటముగ నుండెనా. అవి సుఖముగ జీర్ణించెను. విషమిచ్చియును పాములచేత కరిపించియును ప్రయోజనము లేకపోయెను. ముందు సుమారుగ కట్టితిమి. ఇపుడు గొలుసులతోను, త్రెంపినను తెగని లతలతోను కట్టుదము. మరల రానేరదు అని కౌరవులు తలచిరి. మరల ఆటలాడిరి. వీరివలన నేమి కాగలదని ధైర్యముతో భీముడు గొప్ప యింటిలో సుఖముగ పరుండెను. మరల నీటిలో త్రోసిరి. కట్లు వీడలేదు. ఎంతలోతుకు పోవునోయని పోయెను. కొంచెకొంచెముగ విదిలించుచు నాగలోకమునకు పోయెను. అచట నానావిధపాములుండెను. పాములుండు చోటికి వచ్చితినిగదా యని వాని కొట్టనారంభించెను. అవి కరువనారంభించెను. పాతాళలోకమందలి పాము లెటులుండును. అవి కొరకవా. భీముడు ఊరక నిలిచెను. చర్మము కమలలేదు. పాములపండ్లు వీడిపోగనే తమ యజమానుడగు వాసుకితో చెప్పకొనిరి. ఎవడో వచ్చెను. కరచితిమి. రక్తమురాలేదు. గట్టిగ కొరికితిమి మా పండ్లు వీడెను. ఇది అపూర్వసంగతిగ నున్నది యనిరి. నాగతియు నిటులే యగును. స్నేహము చేసికొనవలయును అని తలచి వాసుకి యింకను ఘన సర్పములతోడ భీముని యొద్దకు వచ్చెను. మన్మథాకృతిగనున్నాడు. జలమున త్రోయబడెను. గాయములు తగులలేదు. అలసిపోలేదు. అని వాసుకి ఆశ్చర్యపడి అయ్యా! మిగుల సంతోషము. భోజనమునకు యేర్పాటు చేయుదునా యనెను. చేయుడని భీముడనెను. అచ్చట అమృతగుండముల నేర్పరచి యుండిరి. అందలి అమృతమును ఒకచెంబెడు యీయుమనగా భీముడు నైకొని పదివేల

యేనుగులబలము నొసగు నీయమృతము చాలదనెను. వాసుకికి లోపల భయముగ నుండినను పైకి సంతోషించి, ఓరీ! వానికి యెంతకావలయునో అంత యీయుడని చెప్పెను. యజమానునిఉత్తరు వాయెను. లెక్కయేమి మీకు వలసినంత స్వయముగ గైకొనుడు అని సర్పములు చెప్పగా భీముడు గుండములోని అమృతమునంతయును ముగించెను. ఒకగుండము అయ్యెను. చాలునా యనిరి. చాలలేదని భీము డనగా వాసుకితో చెప్పిరి. ఎంతభుజించునో చూతము కావలసినది యీయుడని వాసుకి చెప్పెను. భీముడు యెనిమిదిగుండములందలి యమృతమును బొట్టులేక చేసి పరమతృప్తి నొందెను. నిదురరాగా వాసుకి పడక వేయించెను. బలవంతుడగు భీమునికి అమృతముకూడ చేరెను. భగవత్కృపయుండనేని ఒకడు చెరచదలచినను మేలేయగును. భీముడు అమృతమును భుజించునపుడు స్వామిని తలచియుండవలయును. అట్లుచేయక దుర్యోధనుని దలచుచు భుజించెను. అమృతమును స్వీకరించుచు నిదురించుచు యెనిమిది దినము లుండెను. చంపవలసినవారు పడకవేసి ఉపచారములు చేయుచు స్తోత్రములు చేయుచు ఉండిరి. మన్మథునిబోలియుండిన భీముడు అమృతస్వీకారముచేత మరియును ప్రకాశము గలవాడాయెను. భీముని చంపుటకు దుర్యోధనాదు లెంతశ్రమపడిరి. ఏసాధనముచేత చంప దలచిరో ఆసాధనముచేత మన్మథుడాయెను. అనగా దృఢమైన త్రాళ్ళచేత బంధించిరి. అందువలన త్రెంపుకొనుటకులేక పాతాళమువరకు తీసికొనిపోయెను. అమృతపానమునకు హేతువాయెను. అమృతపానముచేత మన్మథాకృతియాయెను. వినాయకుని చేయ పోయిన కోతియైనట్లాయెను. బావిని త్రవ్వబోగా భూతము వెడలినట్లాయెను. భీముని నీటద్రోసి దుర్యోధనాదులు పరమానందముతో దినముల నెన్నుచుండిరి. దుర్యోధనుడు చక్కరపంచెను. వార్తాపత్రికలలో ప్రకటించిరి. పాండవులు కుంతియును భీమా భీమా యని దుఃఖించిరి. అయ్యో! గట్టిగ కట్టిరేమో యని దుఃఖించి క్షేమముగ రావలయునని ఆశీర్వదించిరి. ఆశీః= అనగా పాముకోరపల్లు. పాములు ఆశీః వేసినవి. ఋషులును ఆశీః చేసిరి. భీమునివిషయమున చెడ్డతలపుగలవారిది ఫలించలేదు. మంచి మనసు గల వారిది ఫలించినది. పాములు ఆశీః అను పన్నులను భీముని శరీరమునను చెను. మీరు ఆయుస్సులో నుంచిరి. అమ్మా! నకుల సహదేవులు మాతృహీనులు. మేము నలుగురును పితృహీనులము. భీముడు తండ్రివలె కాపాడుచుండెను. ఇక నెవరున్నారు అని ధర్మపుత్రుడు తల్లితోచెప్పి దుఃఖించెను. అధికదుఃఖ మగుటచేత అడచుటకులేక గట్టిగనేడ్చిరి. జగదీశ్వరా! మొరాలకింపవేమిరా వినకున్నదా వినియును గమనింపకున్నావా కృష్ణా! పరమాత్మా! ఆపద్బంధుడవు! దీనబంధుడవు. భక్తవత్సలుడవు అని కథలు విని నమ్మియున్నాము. అని ప్రార్థించిరి. పంచపాండవు లనుటను మాని చతుః పాండవులని చేయవలసినట్లాయెనని చింతించిరి. భీమా! నీవు లేకపోగా లోకమే శూన్యముగ తోచుచున్నదే నేనున్నాడను కాపాడెద నంటివే ఆ మాటలు అబద్ధమా

రోనా. నిన్ను తపముగావించి కంటినే. నీపరాక్రమమును పొగడతరమా అని చింతించగా విదురుడు వచ్చెను. పిచ్చిదానా! దుఃఖింపనేల మృత్యువన నెట్టుల. యముడు రాకలదా. భీముడు వాని గొట్టడా. కల్యాణీ! భగవదనుగ్రహముండునపుడు మీకు అమంగళమగునా. భీముడు రాబోవుచున్నాడు చూడుము ఎపుడు అలస్యము చేయుచున్నాడో అపుడు మేలగును. క్షేమముతో వచ్చును అని విదురుడనెను. ఏమో అటుల చెప్పుచున్నారని కుంతి ధ్యానము చేయుచుండెను. భీముడు వచ్చునని విదురుడు చెప్పినందున ఆశీర్వదించినటు లాయెను. తల్లియును సోదరులు చింతింపుదురను కారణముచేత భీముడు రావలసియుండెనే కాని లేకున్న అసుఖమును విడిచి వచ్చుటకు న్యాయము లేదు. వీరి దుఃఖమును దలచి వారితో చెప్పి మన్మథాకృతియై బయలుదేరి అన్నా యనుచు రాగా హస్తినాపురము గడగడ వడకెను. వీరికి సంతోషముచేత స్వరము హెచ్చెను. వారికి భయము దేరి సర్వము తగ్గెను. మరల ఆటకు రండి యనుచు భీముడు వచ్చెను.

ఈబాలురు అధికప్రసంగు లగుచున్నారు. వీరి నొక ఉపాధ్యాయునొద్ద విడువవలయును అని ధృతరాష్ట్రుడు తలచి గౌతమగోత్రోద్భవుడగు కృపాచార్యునొద్ద ఒప్పగించెను. అధికముగ నుండిన క్రొవ్వు కొంత తగ్గెను. కృపాచార్యు లెవరనగా! గౌతముని కొడుకు శరద్వంతుడు. ఈయన సకల విద్యలు నేర్చి ధనుర్విద్యను నేర్చెను. ఈయన తపము గావించుచుండగా, ధనుర్విద్యయందు పారంగతుడైన యితని తపమునకు ఇంద్రుడు వెరచి జాలవతియను అప్సరను బంపెను. పేరే జాలవతి అని జాలము సేయగా యీయన మైమరచెను. చేతిధనుస్సు క్రిందపడెను. ప్రజ్ఞ లేదు. రేతస్ఖలనమాయెను. అది యొకశరస్తంభమున ద్వివిధమై పడెను. ఒక కుమారుడును కుమారితయును పుట్టిరి. శంతనుచక్రవర్తి వేటకు వచ్చెను. అచ్చట నొక మగబిడ్డయును ఆడుబిడ్డయును సమీపమున శరచాపకృష్ణాజినములును ఉండుటను సేనాగ్రచరుడు చూచి శంతనుచక్రవర్తితో చెప్పెను. ఆయన ధనుర్బాణములను బిడ్డలను యెత్తికొని 'యేఋషివీర్యమో యని కృపతో పెంచెను. సంబంధము లేక కృపతో కాపాడెనుగాన ఆబిడ్డలకు కృపుడు కృపీ యని పేరు పెట్టెరి. శంతనుచక్రవర్తిచేత పెంచబడిన కృపాచార్యులు హస్తినాపురమున నుండెను. ధనుర్విద్యాపారంగతు డాయెను. పాండవ దుర్యోధనాదులను ఆయనయొద్ద విడిచిరి. విద్య బాగుగ నేర్చిరి. ఈవిద్య చాలదు యింకను నేర్పవలయును. వీరు ధనుర్విద్యయొక్క కడ యెల్లకు పోవలయును. వీరియశస్సు అష్టదిక్కులకు వ్యాపించవలయును అని ధృతరాష్ట్రునికి తోచి భీష్మాచార్యులతో చెప్పగా ఆయన బాలురను ద్రోణాచార్యులయొద్ద విడిచెను. ద్రోణు లెవరనగా, గంగానదియొడ్డున గంగాద్వారమను క్షేత్రము కలదు. అచట భరద్వాజుడు స్నానము చేయుచుండెను. ఈయన వచ్చుటకుముందే ఘృతాచియను అప్సరస వచ్చియుండెను. ఈపెవేదప్రతిపాద్యయైన స్త్రీ. అది స్నాన మాచరించి గట్టెక్కి తలనుతుడిచి విదిలించగా పళపళమని ప్రకాశిం

చేను. భరద్వాజునిమనసు అచ్చట లయించెను. బుద్ధిమంతుడైనను కామవేగ మటుల చేసెను. భగవద్గీత 2 అధ్యా 60 శ్లోకమటుల యెంత తపము గావించినను మనోనిగ్రహము లేకుండిన చెరచివేయును. వీర్యము స్ఖలితమాయెను. వీర్యము భూమిలోపడరాదని శాస్త్రము. పడిన దోషము. భరద్వాజుడు, ఆరేతస్సును (బిందె) ద్రోణమున నుంచెను. అమూల్యవీర్యముగాన ఆపాత్రము నుండి ద్రోణుడు ఆవిర్భవించెను. ద్రోణమను పాత్రమునుండి జన్మించిరిగాన వారికాపేరు కలిగెను. మరియును వారికి కలశోద్భవుడు, కుంభోద్భవుడు అనియును పేరులు. అగ్నివేశ్యుడను మహర్షి ద్రోణాచార్యులకు విద్య నేర్పిరి. అతనితోడ ద్రుపదరాజును నేర్చెను. భరద్వాజుని స్నేహితుడు పృషదను మహారాజు. ఆయన కొడుకు ద్రుపదుడు. ఇద్దరకును విద్యచెప్పిరి. వారు స్నేహితులగుటచేత ద్రోణా! నాకు రాజ్యము వచ్చేనేని నీకు అర్ధరాజ్య మొసగెదను అని ద్రుపదుడు చెప్పెను. ద్రోణుడు సరియని యుండెను. కృపాచార్యుల చెలియలు కృపియని తెలుపబడెను కదా. ఆమెను ద్రోణాచార్యులకు యిచ్చి పెండ్లిచేసిరి. ఆద్రోణాచార్యులకును కృపికిని అశ్వత్థామ పుట్టెను. అశ్వత్థామ గొప్పవారిని చూచి అవుపాలు కావలయునని అడుగ నారంభించగా దీని కేమి చేయుదమని తలచి ద్రోణాచార్యులు మహేంద్రపర్వతమున తపముగావించు పరశురామునొద్దకు పోయి వారిని చూచి మీరు సకలమును జయించితిరే. నాకు ధనము కావలయును ఒసగుడని యడిగెను. అయ్యో! నాలుగుదినముల క్రిందట రాకపోయితిరే. అంతయును బ్రాహ్మణుల కొసగితినే. ధనముతప్ప వేరేదియైన నడుగుము. దేనినడిగినను యిచ్చెదను అని పరశురాము డనెను. తమకు తెలిసియుండు అస్త్రశస్త్రముల నన్నిటిని నాకు ఉపదేశింపుడని ద్రోణాచార్యులడిగెను. పరశురాముడు తనకు తెలిసియుండిన వానినంతయును ఉపదేశించెను. పాలకు మార్గమేర్పడలేదు. గోదానమును గ్రహించువారుకారు. బాల్యమున ద్రుపదుడు చెప్పియుండిన మాటను స్మరించి తనకిచ్చెదననిన అర్ధరాజ్యమునకు బదులుగ నొక గోవును అడుగుదమని తలచెను. ద్రోణుని శరీరము అస్థిమాత్రావశిష్టమై యుండెను. జీర్ణవస్త్రమును ధరించియుండెను. ద్రుపదునియొద్దకు నడచిపోయిరి. అనేకులు కావలివా రుండిరి. రాజు సింహాసనమున కూర్చుండి యుండెను.

---

(13) ద్రౌపదీ జననము.

ద్రోణాచార్యులు ద్రుపదునియొద్దకు పోయెను. రాజద్వార మగుటచేట నిలిచి, తనను, అచటిస్థితిని చూచి రాజు మరచియుండును జ్ఞాపకముచేసిన పిలిపించుకొనును అని తలచి తనరాకను భటులతో చెప్పిపంపెను. వీని నొక మనుష్యుడని చెప్పుటయా యని వారు పోకుండిరి. అటులకాదు నేను స్నేహితుడను చెప్పుడని ద్రోణాచార్యు డనెను.

వారు బోయి మీస్నేహితుడట. వాకిట నిల్చియున్నాడని ద్రుపదమహారాజుతో చెప్పిరి. మహారాజుకు స్నేహితుడు మహారాజుగ నుండవలయును. దరిద్రుడు రాజస్నేహితుడని చెప్పినా పిచ్చివాడా అయినను చూతము రమ్మనుడు అని రాజనగా పిలుచుకొని పోయిరి. ద్రుపదుడు నవరత్నఖచితసింహాసనములో కూర్చుండియుండెను. [illegible] వింజామరలు వేయుచుండిరి. ఎవరని ద్రుపదుడడుగగా నీస్నేహితుడనని ద్రోణు డనెను. నీవును నీవస్త్రమును నీవు ఉండురీతి యేమి. దరిద్రుడవు. మహారాజుస్నేహితుడవా! బుద్ధిలేదా. అటుల చెప్పవచ్చునా ఒకవేళ కొంత పరిచయ ముండినను నేను పేదను, రాజును నాయందుదయ. పూర్వభాగ్యము నారాకను తెలుపుడు అనక యిటులనుటయా వెర్రిబ్రాహ్మణా! మహదైశ్వర్యముననుండు నావంటి మహారాజులకును నీవంటి దరిద్రుని కిని స్నేహమా అని ద్రుపదు డనెను. ఓహో ఐశ్వర్యమదము. వాడిపుడు యేమన్నను అనును. వానికి సింహాసనము. నేను నేలమీద నిలుచుచున్నాను. ప్రభుత్వము. రాజ్యము వానిది. కానిమ్ము యిపుడు కాదు తగుసమయమున ప్రతిచేసెదను స్నేహితుడని పోగా అర్ధచంద్రప్రయోగమాయెను. ఉంఛవృత్తిచేసి జీవించెదను అని తలచి ద్రోణాచార్యులు హస్తినాపురికి వచ్చెను. చదివినవానికి ఓర్పు జ్ఞాపకశక్తి యుండవలయును. ఎటులస్నేహము యెవరు మీరు అని యడుగక నీవెవరనుచున్నాడే. అయ్యో! నాస్నేహితుడిటుల చెడెనే. చదువులలో తక్కువాడయినా విద్యతక్కువకాదే పెద్దలవలె బుద్ధిలేకున్నదే. ఈశ్వరా చదువులేని మూఢునివలె మాటలాడెనే. వేదము తెలిసి శాస్త్రము చదివి యేమి. వివేకము లేకున్నదే. ఐశ్వర్యమదముచేత నిటుల నడిచెనే అని ద్రోణాచార్యులు నొచ్చుకొనుచు హస్తినాపురము చేరెను. అచట నొకయింట వాసముచేయుచుండిన కృపాచార్యులయింట నుండిరి. బావయింట పరమగూఢముగ కొంతకాలము వాసము చేయుచుండిరి. ఒకరికిని తెలియదు. ఒకనాడు పాండవాదులును దుర్యోధనాదులును చెండాడిరి. పరస్పరము వేడుకగా వచ్చిరి. ధర్మపుత్రుడు వేగముగా కొట్టెను. చెండు, వ్రేలియుంగరము సమీపగృహముబావిలో పడెను. ఆటనునిలిపి చెండును ఉంగరమును యెత్తుటకు ప్రయత్నించిరి. రాజపుత్రులు ఆభరణములు మేలు వస్త్రములు ధరించియుండిరి. ఎవరును యెత్తలేకపోయిరి. భగవత్సంకల్పముచేత ద్రోణాచార్యులు అచటికి వచ్చిరి. ఆయన నల్లగ నుండెను. తలనరసియుండెను. గడ్డముఉండెను. దేహము కృశించియుండెను. భోజనమునకు మార్గములేనివాడు. ఆపన్నుడు. ఇట్టియొక బ్రాహ్మణుని పాండవులు చూచిరి. పాండవులు— అయ్యా మీరెవరు. ద్రోణుడు—మీరేల నిలుచుచున్నారు. పాం—మా చెండు ఉంగరము బావిలోపడినవి. చెండుపోయిన పోగాక. ఉంగరముపోయెనే. ద్రో—ఎత్తుకొనరాదా. పాం— మీరు యెత్తుడు. ద్రో— నేను ముసలి వాడను. పాం— మరి యేల అడిగితిరి. ఏమో మాటలాడుచున్నారని పోయియుండరా దా. పెద్దవారు. మమ్ము అడుగనేల. ద్రో—ఎత్తియిచ్చినయేమిచేసెదరు. పాం— మేము

శిష్యులమరయ్యెదము. ద్రో.— అటులే యెత్తియిచ్చెదను. పాం.— అయ్యా! ద్రవ్యాశకు బావిలో దిగకుము. మరల లేముటకు తెలిసియుండిన దిగుము. ద్రో.— దిగకయే యెత్తెదను. పాం.— చూతము. (ద్రోణాచార్యులు ఒక పుల్లను అభిమంత్రించి అస్త్రము పెక్కించి విడువగా అది బావిలోకిపోయి చెండును ఉంగరమును తెచ్చెను.) ద్రో.— ధర్మపుత్రా! ఇది ఏదేవా. పాం.— తాతా వాదే.ఎటుల యెత్తితిరి. ద్రో.— ఓ కుమారులారా! దీనికి ఆశ్చర్యమా. ఈ యస్త్రముచేత యెన్నికార్యములు చేయుదునో. నేను చేయు కార్యములలో యిదియొక చిన్నకార్యము (ఇటుల చెప్పగనే దుర్యోధనాదులు పాండవులు నమస్కరించి, తాతా మీరెవరు మీపేరేమి ఎవరితో చేరినవారు. మీకే మికావలయును. మీరేమి అడిగినను యిచ్చెదము అనిరి. చిన్నవారితో తనసంగతి చెప్పనేలయని తలచి, బాలులారా! మీకు తెలియదు, మీ తాతతో జరిగినసంగతి చెప్పుడు. నారూపమును కార్యమును చెప్పుడు. ఆయన తెలిసికొనును. అని ద్రోణుడు చెప్పగా వారు భీష్మాచార్యులతో చెప్పిరి. ఓహో నలుపా దిగకయే యెత్తెనా ద్రోణాచార్యులా వచ్చిరి. ఎచట నున్నారు. మీరు పరుగులిడుచుపోయి నమస్కరించి పిలుచుకొనిరండి. నేను చెప్పితినని చెప్పుడు అని భీష్మాచార్యులు వారిని పంపిరి. వారు పోయి ద్రోణాచార్యులతో తాత సంతోషించి రమ్మనిరని చెప్పిరి. మీరెక్కడ అవతరించితిరి. ఎటుల విద్యగ్రహించితిరని భీష్ముడు అడుగగా ద్రోణుడు జరిగిన సంగతిని చెప్పెను. అగ్నివేశ్యులశిష్యులా, ద్రుపదుని స్నేహితులా, పరశురాముని యొద్ద విద్యగ్రహించితిరా రాజుకును దరిద్రునికిని స్నేహమా అనెనా దుర్బుద్ధి అని భీష్ముడనెను. నొచ్చి వచ్చితిని. లోకమున విద్యకు గౌరవము లేదు. ధనమునకే గౌరవము. కావున యీవేషముతో వెలుపలరాక ఉంటిని వీరిని చూచి చెండును ఉంగరమును యెత్తియిచ్చితిని. వీరు పిలువగా వచ్చితిని అని ద్రోణు డనగా భీష్మాచార్యులు, ఆనందబాష్పములు విడిచి పరమభాగ్యము హస్తినాపురికి నేడే భాగ్యము కలిగెను. ఎన్నడు చూచుటకు వచ్చితిరే. నాభాగ్యము. ఈబాలురభాగ్యము. వీరు నామనుమలు. మీరు వీరికి ఆచార్యులుగ నుండవలయును. అనేకవిషయములు చెప్పవలయును అనిరి. ఏల, కృపాచార్యులు చెప్పియుండలేదా అని ద్రోణాచార్యు లడుగగా, లేదు. కృపాచార్యులు మాతో చేరినవారు. తాము పరశురామునొద్ద గ్రహించితిరి. దానినంతయును చెప్పవలయును అని భీష్మాచార్యు లనిరి. అటులే అని ద్రోణాచార్యు లనగా, అటులకాదు, కృపాచార్యులశిష్యులని చెప్పరాదు. పుత్రులని భావించవలయును. శిష్యులు పుత్రులే. సకలవిద్యలు నేర్చి పండితులగుటకు వీరికి శక్తిలేదు. మీరటుల యేర్పాటుచేయుడు అని శిష్యులనుగ ఒప్పగించగా ద్రోణాచార్యులు సంతోషించి, అటులే అంగీకరించెదను. వీరు అవతారపురుషులు. స్వయముగనే వచ్చును. అందువలను కృపాచార్యులు చెప్పియున్నారు, ఎంత తెలిసినవారికైనను గురుడుండవలయును. కావున అటులే గురువునయ్యెదను అనెను.

గంగ భీష్మాచార్యులను సకల విద్యాపారంగతుని చేసెను. ఆయనకు తెలియనిది లేదు.
బ్రాహ్మణులద్వారా విద్యగ్రహించవలయునని బాలురను ద్రోణాచార్యులకు ఒప్పగిం
చెను. ఒకటికి పది గ్రహించిన యింకను చెప్పవలయునని తోచును. ఒక విషయమును
చెప్ప నారంభించగనే తూగిపడుట కారంభించిన చెప్పినది చాలునని తోచును. ఒక
భాగవతుడు కథచెప్ప నారంభించగనే కొందరు నిదురపోవుటకును కొందరు తాం
బూలము వేసికొనుటకును కొందరు మాటలాడుటకును ప్రారంభించిరి. అతనికి
కథచెప్పుటకు కష్టముగ నుండెను. చెప్పక నిలిపిన జీవనము పోవును ఎటులపోవు
టకును లేక ఆయన తపమాచరించెను. స్వామి వచ్చి యేమికావలయునని అడుగగా,
స్వామీ. నాపాపములకు తగుఫలమును నొసట వ్రాయుము. చెప్పిన సంగతిని తెలిసి
కొని సంతోషపడనట్టి అరసికుల సంబంధము కలుగునటుల మాత్రము వ్రాయకుము
అనెను. ఈబాలురు అటులగాక శ్రద్ధతో నేర్చుచుండిరి. ముందే వారికి తెలిసియుండు
టచేత జాడగ చెప్పుటకు లోపలనే గ్రహించుచుండిరి. ఇట్టిశిష్యులకుకదా చెప్పవలయును
సౌభాగ్యము భాగ్యమని ద్రోణాచార్యులు తనకు తెలిసిన సకలవిద్యలను నేర్పెను.
పాండవులును కౌరవులును సరిసమానులా యనివ గురువు సమముగనే చెప్పుచుండెను.
ఆవిద్య ఆయాపోటులలో అటు లటుల ఫలించెను. ఉపాధ్యాయుడు బుద్ధిశాలికి చెప్పు
నటులే మూఢులకును చెప్పును. చెప్పుటలో భేదము లేదు. పరీక్షలో కొందరు తేరి
కొందరు తప్పిపోయినచో ఉపాధ్యాయుని తప్పేమి. గ్రహించువారి బుద్ధిలో కౌశల
ముండవలయును. చెప్పువారిలో భేదము లేకున్నను పాండవులకు విద్య బాగుగ వచ్చి
నది. దుర్యోధనాదులకు అంతగా రాలేదు. వారిలో అర్జునునికి విశేషముగ వచ్చెను.
కృష్ణానుగ్రహము కలిగియుండెను. భగవద్గీత 10 అ. 37 శ్లోకమున పాండవులలో
అర్జునుడు నేనని స్వామిచెప్పెను. అనగా వానికి నావలన గౌరవమనిరి. అటుల వారు
విద్యాభ్యాసము చేయుచుండిరి. నేనే సామర్థ్యుడని వారువారు తలచి యుండిరి. ఒక
నాడు వేడుకచూచుటకై ద్రోణుడు దావాడు నెను. వారువారు బింగెలెత్తుకొని పరు
గెత్తిరి. అశ్వత్థామా యని పుత్రుని బిలువగా అతడును బింగాతో పరుగెత్తెను. అర్జునా
యనగా వారుణాస్త్రమును వేసెను. వర్షము గురియగా ఆచార్యా చాలునా యనెను.
స్నానముసహా ఆయెనని ద్రోణాచార్యు లనెను. గురి సరిగానున్నదాయని యిటు లొక
విషయమున పరీక్షించిరి. అర్జునుడు భుజించుచుండగా దీపము ఆరిపోయెను. త్వరితముగ
రండి అని గురుడాజ్ఞాపించగా అర్జునుడు చీకటిలో వెలుతురులోవలెనే భుజించి
ముగించెను. రెండుదీపములుండినటుల వీనికి గురితప్పదని ద్రోణు డనుకొనెను. ఇటుల
స్వల్ప విషయములలో పరీక్షించి వీడే పురోవృద్ధికి వచ్చును. వీనికి అన్ని విషయము
లును చెప్పవలయునని తలచిరి. ఇటులుండగా ఏకలవ్యుడను బోయవాడు వీరితోడ
వచ్చినను శిష్యునిగ చేసికొని విద్యచెప్పుడని యడిగెను. ఓరీ నీవు క్షత్రియుడవు కావు.

[illegible] చెప్పుదు అని ద్రోణుడు చెప్పెను. వారు చెప్పరా. వీరికి మీరు చెప్పుచున్నారు. నేను మీయనుగ్రహమున విద్య సంపాదించెద నని చెప్పి పోయెను. వీరు చూతమని యుండిరి. ఏకలవ్యుడు పోయి అరణ్యమున చేరి మట్టితో ద్రోణునిబొమ్మ చేసి నిజద్రోణునిగా భావించి పదియింతలు హెచ్చుగా శుశ్రూషలుచేసెను. సకలవిద్యలు వచ్చెను. ఒకనాడు పాండవులు అరణ్యమునకు పోయిరి. ఏకలవ్యుని, ద్రోణాచార్యులబొమ్మను, చూచి భయపడి కుక్క యరచెను. ఏకలవ్యుడు ద్రోణాచార్యులయొద్ద నేర్చుచుండగా అరచెను. దానినోటిని మూయుటకై యేకలవ్యుడు యేడుబాణములు వేసెను. అది పాండవులకుక్కగాన వారియొద్దకు పోయెను. ఆహా! యేడుబాణములు దీనినోట వేయబడెను. రక్తము గాయము లేదు. బాణములు కదకుగలవి. కొండను మలచును. ఇటుల చేసినవాడు డెవడు అని వారు వెతుకగా ఏకలవ్యు డుండెను. ఎవడవని యడుగగా ద్రోణాచార్యుల శిష్యుడనని చెప్పెను. మాతోడవిద్య నేర్చుకొనలేదేయని వారడుగగా ఆద్రోణుడు కాదు. ఈబొమ్మయని చూపెను. ఆచార్యులయొద్దకు పోయి ఆచార్యా మూడులోకములలో నీసముడుండడు అనియంటిరే అనిరి. ఔను ఎవడున్నాడని వారనగా సంగతిచెప్పిరి. మీరు సాక్షాత్తుగ చెప్పుచున్నారు. మాకు విద్య బాగుగరాలేదు. మీకంటెను యీబోయవానికి నాలుగింతలు అధికముగనే తెలియును. మీరును వీనివద్ద నేర్చుకొనవలసినదే యనిరి. అర్జునుని మించినవా డుండడని ప్రతినచేసియుండినందున ద్రోణాచార్యులు ఏకలవ్యు డుండు స్థలమునకు పోయిరి. ద్రో— ఓరీ నీవు మునుపు నాయొద్దకు వచ్చినవాడవా. ఏ— ఔను. ద్రో— అచట నుండునదియేమి. ఏ— మీరేను. ద్రో— నేను గురువువా. ఏ— ఔను. ద్రో— గురుదక్షిణ యిచ్చెదవా. ఏ— ఇచ్చెదను. ద్రో— దేనినిచ్చెదవు. ఏ— అడిగినది యిచ్చెదను. తమయనుగ్రహమున అన్నియును గ్రహించితిని. ద్రో— కుడిచేతి బొటనవ్రేలు యిమ్ము. ద్రోణాచార్యులు యిటుల అడిగి [illegible] చులోపలనే అది పోయిన నెటుల అనివాడు యోచింపక వరికి యిచ్చెను. అర్జునా! నీకంటెను వీని తగ్గించితిని. నీవు పైన. వాడు క్రింద నుండునటుల తోడ్పాటు చేసితిని అని చెప్పి ద్రోణాచార్యులు విద్య చెప్పుచుండిరి. ద్రోణాచార్యులు ఒక పక్షిని చేయించి ఒకమైలుదూరములో! నున్న చెట్టుకు జారవిడిచి అదిగో చెట్టు తెలియుచున్నదా తోటయు వృక్షశాఖలును తెలియుచున్నవా యని అడిగిరి. ఇతరబాలురకు పక్షిమీద బుద్ధిలయించనందున అన్నియును తెలియుచున్నవనిరి. అర్జునా! నేను చెట్టు శాఖలు నాలుగుదిక్కులు తెలియుచున్నవాయని ద్రోణాచార్యు లడుగగా యేదియును తెలియలేదు ఆపక్షితప్ప ప్రపంచమునహా తెలియలేదని అర్జునుడనెను. కొట్టుమని ద్రోణాచార్యులు చెప్పగా అర్జునుడు కొట్టి దానితలను తెచ్చెను. ఒకనాడు స్నానార్థమై గంగలో దిగిరి. ఒకమొసలి ద్రోణాచార్యులకాలును పట్టుకొనెను. పాండవులును దుర్యోధనాదులకును విద్యాభ్యాసము చేయించుచుండు [illegible]

పుల్లతో ఉంగరమును యెత్తినవారును అగువారికి విడిపిరచుకొనుటకు శాస్త్రీయము లేకపోవునా. శిష్యులలో సమర్థులెవరో చూతమని ఊరకుండిరి. ఒక్కొకడు బాణములను వేయుచుండగా అచ్చట యిచ్చట పడుచుండి కడపట ద్రోణాచార్యుల తొడలో పడెను. అర్జునా అనగా ఐదుబాణములను వేసెను. కడపటిబాణమునకు అది చచ్చెను. అర్జునుడు నీట దిగినా మోకాలని గురుతు చెప్పిరి. నూటిగ వేసెను. పెద్దజంతువు. నీటియందు దానికి బలమధికముగ నుండును అని అలస్యములేక బాణములను వేయగా మొసలి మృతినొందెను. ఏమిరా మొసలిని చంపితివని ద్రోణాచార్యులు అడుగగా మొసలి పట్టిన చంపవలగా యని అర్జును డనెను. గట్టులో మీరు శిష్యులైయుండునటుల నీటియందు యిదియు శిష్యుడై యుండెను అని ద్రోణాచార్యు లనగా మావలెనా యని అర్జునుడనెను. సింధుభూ అనగా గంగాపుత్రుడు. గంగాపుత్రుడగు భీష్మాచార్యులచేత వారు పెంచబడ్డిరి. సింధుభూ అనగా జలము. మొసలికిని సింధుభూచేత అనగా నీటిచేత వృద్ధి. శిష్యులు మొదుట పాదములు పట్టిరి. అదియును పట్టెను. వారు అంతేవాసులైరి. కొట్టినను తిట్టినను పోరు. అదియును పోలేదు. వారు విజయాస్త్రాగమాంతం విజయ=విశేషమైజయమునిచ్చు, అస్త్రాగమాంతం=ధనుర్వేదముయొక్క కొనను పొందిరి మొసలియును విజయ=అర్జునుని, అస్త్రాగమాంతం=శస్త్రమురాకచేతఅంత మొందినది. ఇందుచేతనే ద్రోణాచార్యులు మొసలిని శిష్యుడనిరి. అర్జునునకు చెప్పినటుల మాకును చెప్పుడని వారనగా వాడుచేసినటుల మీరును చేసితిరేని చెప్పెదనని ద్రోణాచార్యులనిరి. మట్టితో శిశువునుచేసి, దానిని గంగలోవేసి, యిది యెచ్చటపోవునో అచ్చట బాణము వేసి తేవలయునని ద్రోణాచార్యులనిరి. అందరును అటుల తేవలయునని తలచిరి. అందరికిని కన్నులుకట్టిరి. బొమ్మను వేసిరి. చూచితిరా తెండియనగా వారు తాము నిలిచియుండిన తావును యెరుగకుండిరి. ముందు చూడలేదా యని ద్రోణుడడుగగా అపుడు చూచితిమి. ఇపుడు తెలియలేదనిరి. అల్లరచేసిరి. విధిలేక బాణము వేసిరి. ప్రయోజనము కలుగలేదు. వారిచేతగాక కన్నులను విప్పమనిరి.విప్పగా కన్ను తెరచిరి. చూడుడు అర్జునుడు వేయబోవుచున్నాడు కన్నులు కట్టుడు అని ద్రోణాచార్యులనిరి. దుర్యోధనుడు కట్టెను. అర్జునుడు గురుని సేవించి జ్ఞాపకముంచుకొని ఐదు బాణములు వేసి నీటమునిగిన బొమ్మను తెచ్చెను. చూచితిరా వీనిశక్తి. అందరిని దూరముగ పంపి ద్రోణాచార్యులు బ్రహ్మశిరస్సను అస్త్రమును అర్జునునికి ఉపదేశించిరి. అందరికి చెప్పలేదు. కుమారునికిమాత్రము చెప్పిరి. అతనికి ప్రయోగమును మాత్రము చెప్పిరిగాని ఉపసంహారమును చెప్పలేదు. అర్జునునికి ప్రయోగమును నివర్తనమును చెప్పిరి. వీనికి అధికముగ చెప్పినాడని కోపకుండుటకై నీటనుండిన బొమ్మను తెప్పించి ఉపదేశించిరి. దేవతలు పుష్పవృష్టిచేసిరి. ధృతరాష్ట్రుడు భీష్మాచార్యులు ద్రోణుడు మొదలగువారు విండినసభలో పాండవ, దుర్యోధనాదులు తమ విద్యాకౌశలమును జూపిరి. భీముడు ధర్మ

పుత్రుడు తనకు తెలిసినది చూపెను. పిమ్మట భీమసేనుని సుయోధనుని పోటీవిడిచిరి. గదాయుద్ధమును జూపిరి. వీనిచేత గద. వానిచేతగద. వీడును పెద్దవాడు. వాడును పెద్దవాడు. ఏకశృంగముగల కొండలవలె తోచెను. ఈసంగ్రామమును దేవాసురులు ఆకాశమున చూచుచుండిరి. యోగ్యాయోగ్యకర్తలు బలేబలే అనుచుండిరి. వారు సమాన వయస్కులు. గదాయుద్ధమున సమర్థులు. పరమశూరులుగాన యిరువురును వారి గొప్పశక్తిని జూపిరి ఆహా వీరిసామర్థ్యమేమి. పొగడవలయునా గురుని మెచ్చవలయునా. అనిసంతోషించిరి. అందరును బలేబలేయనిరి. అర్జునుడు తన అస్త్రశస్త్రపాండిత్యమును ఆచార్యునికి చూపెను. అనగా ఒకటికి పదియింతలుగ గ్రహించెను. ద్రోణాచార్యులు క్రొత్తగ గ్రహింపవలసినటు లుండెను. చూచువారికి పరీక్షయని తోచును. తనకు చెప్పుచున్నాడని గురువుకు తోచును. వీనికి చెప్పినది సార్థకము. ఏమిచేయుచున్నాడు అని ద్రోణుడు ఆనందించుచుండెను. పూర్వజన్మమున పుణ్యము చేసియుండిన మంచిశిష్యులు లభింతురు. పాపము చేసియుండిన దుష్టశిష్యులు దొరకుదురు. దుర్యోధనుడును భీముడును జతయైనటుల అర్జునునికి జతనేర్పరుపదలచి కర్ణా! అర్జునుడు చూపినదంతయును నీవును చూపుము. వాడుచేసినదంతయును చేయుము అని ద్రోణాచార్యులనగా కర్ణుడు వారియాజ్ఞచేత చూపెను. వాడును వీడును సము లనిరి. అర్జునుడు కర్ణుని యుద్ధమునకు పిలిచెను. ఇద్దరికిని యుద్ధ మారంభమాయెను. అర్జునునిచేయి హెచ్చిన దేవతలును కర్ణునిచెయి హెచ్చినపుడు అసురులును బలేబలే యనుచుండిరి. పరమాద్భుతవ్యాపారములు చేసిరి. ద్రోణునియొద్ద మనమును వారును విద్యాభ్యాసము చేసితిమి. వారుమాత్రము బాగుగ గ్రహించనేల. మనకు రాకుండనేల. ఈశ్వరా! అందరును సములేయుంటిరే. వారినిమాత్రము హెచ్చించనేల. ఈవిద్యలంతయును ఆచార్యుడు చెప్పనేలేదే. అని యితరులు చింతించిరి. భీష్మాచార్యులు అర్జునా! బలే. కర్ణా! బలే యనిరి. యుద్ధము కాదుకదా. దుర్యోధనునికి పరమసంతోషము. కర్ణా రమ్ము. అనెను. పరమస్నిగ్ధుడైనకర్ణుడు పనిచేసెనని బిందెలతో జలము తెప్పించి సంతోషసూచకముగ అంగదేశాభిషేకము చేసితినని అటులచేసెను. కర్ణుని కనినది కుంతి. రహస్యప్రసవమైనందున వీనినీటవిడిచెను. రాధ అతిరథుడు అనుదంపతులు పెంచిరి. వాడీసంగతి విని సంతోషించివచ్చి కొడుకును చూచెను. పరమానందమొందెను. దుర్యోధనుడును కర్ణుని తోచేరినవారును పరమానందమొందిరి. ద్రోణాచార్యులయొద్ద వారువారు విద్యగ్రహించినందుకై బహుమానమీయవలదా. అందరును ముందుకువచ్చి నమస్కరించిరి. నాకేమియును వలదు. పాంచాలదేశమున ద్రుపదు డున్నాడు. ప్రాణములో తెచ్చి నాముందు పడవేయవలయును. మీకు విద్యచెప్పినందున కిదియే బహుమతి అని ద్రోణాచార్యులనెను. సంహరించి తెచ్చుట సులభమైనకార్యము. ప్రాణములో తెచ్చుట కష్టము. శిష్యులారా! యాగురుదక్షిణ నిచ్చినయెడల మిగుల సంతోషము. మీరు క్షేమముగ

నుండుడు' అని ద్రోణుడనగా అటులే చేయుదుమని సమ్మతించిరి. ద్రుపదుని కట్టి తెచ్చి పాదములలో వేయుటకై వారందరు పోయిరి. ద్రుపదుడును వీరును యుద్ధముచేసిరి. దుర్యోధనాదులు దెబ్బలుతిని ఊరికి తిరిగివచ్చిరి. పాండవులు భగవద్ధ్యానము గురుధ్యానము చేసి యిదివరలో యెంతో జరిగినది. ఇది గురుదక్షిణ అని పోయిరి? కౌరవులు యేమన్నచు వచ్చిరి. శత్రువుకు భయపడ్డి వారు పరుగెత్తిగని అచ్చటివారు హర్షించిరి. అర్జునుడు పోయి సమయముచూచి ద్రుపదుని కట్టి తెచ్చెను. ద్రుపదా' బాల్యమున సహపాఠులముగ నుంటిమే. ఆస్నేహమును వదలరాదని చూడవచ్చితిని. ధనికునితో నిర్ధనునికి స్నేహమా మందబుద్ధీ' యంటివి. రాజుకు రాజు స్నేహితుడా నంటివి. నాకు స్నేహమున యిష్టము. నీవుచెప్పియుండిన అర్ధరాజ్యమును గ్రహించి నీచేత స్నేహితుడనిపించుకొనుటకై తగుశిష్యులనుబట్టి నిన్ను హింసింపక తెమ్మంటిని. ఇపుడు రాజ్యమును పంచుకొందమా నీవు దక్షిణమునకు నేను ఉత్తరమునకు రాజులము. ఇపుడు నీస్నేహితుడని చెప్పుకొనవచ్చునా నీకు సమ్మతమేనా. రాజ్యమునిచ్చెదవాయని ద్రోణాచార్యులు అనగా ముమ్మాటికి యిచ్చితినని ద్రుపదు డనెను. నేను నిస్పృహుడను. నాకురాజ్యమేల అని ద్రోణాచార్యు లనగా యేమో అనేక రాచకార్యములు మరిచితిని. తెలియక చెప్పితిని. దీనికై యింతసంకటపెట్టవలయునా అని ద్రుపదు డనెను. స్నేహమునకై యిటుల చెసితిని. మనసున నుంచకుము అని ద్రోణాచార్యులు ద్రుపదునితో చెప్పి పెద్దలయెడ అపచారపడ్డిన నిటుల మానభంగ మగునని తెలిపి పంపిరి. ఈబాపనికి యింతపగయా. వీనిచంపవలయును అని ద్రుపదునికి తోచెను. ద్రోణుని చంపుటకు ఒక కుమారుడును అర్జునుని అల్లునిచేసికొనుటకు ఒకకుమారితయును కలుగవలయును. ఇందుకు పుత్రకామేష్టి జరుగవలయును. ఇందునకు తగువారిని పట్టి కార్యము సాధించవలయును అనితలచి ద్రుపదుడు భూమండలము నంతయును తిరిగెను. ఎవరును యీయాగము చేయించమనిరి. ద్రోణుడు మహానుభావుడే మావలనకాదు అనిరి. ఋషులందరు త్రోసి పుచ్చిరి.

భూమండలమునంతయు తిరిగినను పుత్రకామేష్టి చేయించువాడు ఒకడును చిక్కకపోగా ద్రుపదునికి నిదురపట్టలేదు. ఒక బ్రాహ్మణుడు యింతచేసెనే. నేను క్షత్రియుడను. క్షత్రియతేజస్సుచేత నతని చంపుటకు వీలుపడదు. చంపుటకు యేర్పాటుచేయవలయునే బ్రాహ్మణముఖముగ చేయవలయునే ఒకడును యాగము చేయననుచున్నాడే. యేమిచేయుదును అని నిదురలేక తపించుచుండెను. సర్వదా యిదియేయోచన. క్షత్రియులకు యింత కోపము ఉండవచ్చును. బ్రాహ్మణుడు యితనికి యింత దీర్ఘవైరమా. చెడ్డబ్రాహ్మణుడు. వీని చంపవలసినదే అని చింతించుచుండి, ఒక వనమున యిద్దరు బ్రహ్మర్షులు మహానుభావులు పరమవ్రతులు అగు యాజోపయాజులను అన్నదమ్ములను చూచెను. ఒక పుత్రుడును పుత్రికయును కలుగవలయును. అందుకై పుత్రకా

పోష్టి జరుగవలయును. ఎవరును చేయించమనుచున్నారు. మీరు మహానుభావులు. సాధిం
పించి చేయవచ్చును అని ద్రుపదుడు తమ్ముడగు ఉపయాజులతో చెప్పెను. అందరు
వారివలన కాదనిరి. కావున అన్నను అడుగుడు అని ఉపయాజి అనగా ద్రుపదుడు
యాజుల ఆశ్రమమునకు పోయెను. ఆయన యోచించెను. ఇతడు యోగ్యుడు. అగ్నిదే
శ్యుని శిష్యుడు. మహాబ్రాహ్మణుడును స్నేహితుడును అగువాని చంపదలచెను. ఇట్టి
వాని కిట్టి కోరిక కలుగుట లోపలి అంతర్యామికి యిష్టముగనుండును. వేదమున్నది.
దానిలో హత్యసంగతియు చెప్పియున్నది. ఆవేదము మన స్వాధీనములో నున్నది.
దాని ప్రయోగించమని చెప్పుట వేదమునకే అగౌరవమగును. యాగము చేయించెద
మనిరి. నాయనా! నీవు మంచివాడవే. బ్రాహ్మణభక్తియున్నదే. సామాన్య బ్రాహ్మ
ణుని తిట్టవలయును కొట్టవలయును అనినను యోచింతుమే. ఇట్టిబ్రాహ్మణుని చంప
దలపనేల యని యాజోపయాజు లడుగగా, బ్రాహ్మణులనుచున్నారే. మీరును బ్రా
హ్మణులేకద. కోపించకుడు బ్రాహ్మణుని కింతటి క్రోధమా. అర్జునుడు నన్ను చంపక
కట్టి తీసికొనిపోయి అతనిముందు పడవేసెను. అపుడు నన్ను చూచి నవ్వెను. నవ్వుచు
మాడలాడెను. పాండవులు దుర్యోధనాదులును యింకను అనేకులు నిండియుండిన
సభలో గంభీరముగా ద్రుపదమహారాజా! రాజేకద నీతో స్నేహము చేయవలయును.
ఇపుడు స్నేహితుడనేనా. అనెను. అంతటితో విడువలేదు. మరియొకమాట చెప్పెను.
'రేరే క్షత్రియసత్తమ' అనెను. (నీచసంబోధనమున రే యందురు. అంతకు మీదివారిని
హే యందురు. అంతకంటెను పెద్దవారిని హో యందురు.) నన్ను రే యనిరేమి కాక
రేరే యనెను. అనగా ద్రుపదమహారాజా! ఓయీ మీకు కొంచముకూడ బుద్ధిలేదు. అన్ని
టపెద్దవారే యనినటుల రేరే క్షత్రియసత్తమ అనెను. ఏమో చెప్పితిని. ఇంత చేయవల
యునా. మరియును అగ్నికి సముడైన అగ్నిదేశ్యునియొద్ద విద్యాభ్యాసము చేసితిమే.
జ్ఞాపకమున్నదా. తండ్రీ! ద్రుపదమహారాజా! నేను రాజైనపిమ్మట అర్ధరాజ్యమిచ్చెద
నంటివికదా. అధి రాజ్యము (రాజత్వము) కలుగబోవుచున్నది. దానియందు మొదటి
భాగమును నీకిచ్చి రెండవభాగమును నేను గైకొనెదనంటివి. అధిని అనగా మనఃపీడను
నాకుయిచ్చితివి. (దరిద్రునికిని మహారాజునకును స్నేహమా అనుటే మనఃపీడ) మొదటి
భాగమునిచ్చి చెప్పినటుల చేసితివి. రెండవభాగమగు రాజ్యమును నీవు గైకొంటివి. ద్రుప
దరాజా! యేమంటివి. ధిక్ ధిక్, దరిద్ర బ్రాహ్మణుని కాల్ప అంటివే అనెను. అని
యిటుల ద్రుపదమహారాజు చెప్పగా, ఆహా ఆటు లనెనా వినునపుడు మాకే సంకట
మగుచున్నది. నీ కెటులుండెనో అపుడు నీకేమితోచెను. అని యాజోపయాజు లడిగిరి.
నాకేమి తోచును. నేను వృద్ధుడను. వారికి శిష్యులున్నారు. వారు అపుడే విద్యాభ్యా
సముచేసి చురుకుగలవారై యున్నారు. నన్ను త్రాళ్ళతో కట్టియుండిరి. జగదీశుని ప్రార్థిం
చితిని. కాకాసురుడు మూడులోకములు గ్రుమ్మరి నీవేగతి యని రామునిముందు పడిన

టుంటి వానిపాదములలో బడితిని. కట్లువిప్పెను. నాకు సంతోషమా. నేను క్షత్రియుడను. అతడు బ్రాహ్మణుడు. ప్రార్థింపగా కట్లు విప్పెను. నాకు దుఃఖమువచ్చెను. ఎవరినడిగినను యీయాగము చేయించుటకు చేతకాదనిరి. ఈశ్వరునుద్దేశించి స్వామీ! విఘ్నేశ్వరుండును. నీవు యెల్లవారికిని మీదివాడవు. నిన్ను గూర్చి చెప్పుకోనవలసిన స్థానము లేదు. నీవు చెప్పునదే మాట. నీవుచేయునదే సరియైన కార్యము. నన్నుయింకను యేమి చేయదలచితివి. నీకు మీదివారు లేరు. అహంకరించుచున్నావా. కోటిదైవములలో నీవు ప్రథమదైవము. యుద్ధములో వెనుకకాలించవు. బ్రహ్మాండమును కాపాడువాడవు. శక్తిలేదా. నిన్నడుగువారు లేరనికదా సన్నిటుల చేయుచున్నావు అని దేవుని నిందించితిని. తోడనే అయన మిమ్ముచూపెను అని ద్రుపదుడు చెప్పెను. ద్రుపదమ్ అనగా ద్రు—చెట్టుయొక్క=పదమ్, వేరు. చెట్టుయొక్క వేరుకు సదా జలసంబంధముండును. ద్రుపదా! నీకును సదా జడసంబంధము (అయోగ్యసహవాసము) ఉన్నది. అచ్చట మిత్రతేజస్సు (సూర్యతేజస్సు) ఫలించదు. నీకును మిత్రతేజస్సు (స్నేహితులయొక్క హితము) యొక్క లేదు అని ద్రోణాచార్యులు తన్నుగూర్చి పలికెనని ద్రుపదుడు యాజోపయాజులతో చెప్పగా, సరి ఆ బ్రాహ్మణుని చంపవలయునని మనకు ఉద్దేశ్యము లేదు. ఎవరైనను మనయొద్దకు వచ్చి వేదమున నున్నదే చేయుడని అడిగిన చేయుట మనవిధి. చేయనన రాదు. అని వారొక పుత్రకామేష్టి చేయుటకు యేర్పాటుచేసిరి. యాజోపయాజుల వలన ద్రుపదుడు యాగము నారంభించెను. యజ్ఞము జరుగుచుండెను. ఒక పత్రమున అన్నముంచి మంత్రము చెప్పిరి. ద్రుపదునిభార్య దాని భుజింపవలయునని సిద్ధముచేసి యజమానపత్నీ! రమ్మని పిలిచిరి. స్త్రీలయొక్క స్వభావము ననుసరించి ఆమె ఆలస్యముచేయుచుండెను. ముమ్మారు పిలచియును రాలేదు. యజమానపత్నీ! నీవువచ్చి భుజించితే బిడ్డలు పుట్టవలయునని గర్వమా. రాకున్నావు రానక్కరలేదు. నేను పక్వము చేయుట తమ్ముడు మంత్రముచెప్పుట చాలును. నీవు వ్యాజము. ఇదుగో చూడుము అగ్నిలో వేయుచున్నాము బిడ్డ పుట్టును అని ఆహుతి వేయగా యెల్లరును చూచుచుండిరి. మగబిడ్డ బయలుదేరెను. స్వల్పకాలమైనను ఆలస్యమాయెనా లేదు. అయన్నమును యజమానపత్ని భుజించి పుట్టవలయుననిన ఒకసంవత్సరము పట్టునుకదా. ఒక నిమిషమున పళపళప్రకాశించుచు బిడ్డపుట్టెను. నాభార్యకు పుట్టియుండినటులైన వీడు ద్రోణుచార్యులను చంపునో చంపడో అని సందేహముండును. వీడు చంపునని తోచుచున్నది అనితలచిరి. ఆడుబిడ్డ పుట్టలేదేయని ద్రుపదు డడిగెను. కొంతతాళుము మంత్రము చెప్పెదమని వారనగా ఆడుశిశువు పుట్టెను. ఆమెయే పాంచాలి లేక ద్రౌపది. ద్రుపదుడు సంతోషించెను. ఉండనిమ్ము. జాగ్రతగా కాపాడుమని వారనగా అటులేచేసెదనని ద్రుపదుడనెను. నామకరణముచేసిరి. కుమారునకు ధృష్టద్యుమ్నుడని పేరుపెట్టిరి. ధృష్టమనగా మిగులధైర్యముగలవాడని యర్థము. ద్యుమ్నమనగా బంగారము. పాంచాలి

కేశపర్యంతము ఆభరణములను ధరించుకొని పుట్టెను. కనుకనే పాండవుల పేరాధిపత్నియాయెను. ఆడుబిడ్డకు కృష్ణ అనిపే రుంచిరి. నలుపుగ నుండినందున ఆమెకు ఆపేరు కలిగెను. లేక పూర్ణానందస్వరూపిణి యని యర్థము. ఈమెవలననే యుద్ధకారణ మేర్పడెను. నేరేడుపండు నల్లగనుండినను నోటవేసిన తియ్యగనుండును. కృష్ణయును నల్లగనుండినను అందముగనుండెను. అపుడు జలమును త్రాగిన మేఘ మెటులుండునో అటులుండెను. శరత్కాలమేఘము తెల్లగ నుండును. జలముతో గూడియుండిన పళపళమని ప్రకాశించుచుండును. సాక్షాత్ కృష్ణుడు యెటుల నలుపో అటుల కృష్ణునిమీదభక్తిగల కృష్ణయును నలుపుగ ఉండెను. ద్రౌపదికనియే స్వామి అడుగడుగుకును కాపాడుచుండెను. పాండవులకనికాదు, రాజుకు ద్రుపదుడని పేరేలకలిగెనని జనమేజయుడడిగెను. పృషదుడను మహారాజు పాంచాలదేశమున తపమాచరించుచుండగా ఇంద్రుని పంపున మేనక వచ్చెను. ఇంద్రియము జారెను. ద్రుపద—మేనకదర్శనముచేత స్ఖలితమై కాలిచేత అణచబడి పుట్టినవాడుగాన ద్రుపదుడని పేరుకలిగెను.

ధృష్టద్యుమ్నుడు ద్రోణాచార్యుల నాశ్రయించెను. తన్ను చంపుటకై పుట్టినవాడగుటచేత విద్యచెప్పననిన గౌరవము తక్కువగ నుండును. వీనికి విద్యచెప్పి వీనిచేత మృతినొందిన నొందగలను లేకున్న మాత్రము మరణముకలుగదా. పుట్టినవానికి చావు నిశ్చయముకదా. వీనికి విద్యచెప్పి నాకంటెను గొప్పవానిగచేసి వానిచేత చచ్చుట కీర్తియేకదా అనితలచి ద్రోణాచార్యులు ధృష్టద్యుమ్నునికి సకలవిద్యలు చెప్పెను. అట్టిమహానుభావుడు. మహానుభావుడైన ద్రోణాచార్యులను నిమిత్తమాత్రముగ నుంచుకొని యితడు సకల విద్యలు నేర్చెను. భారతకథకు ప్రధాననాయిక ద్రౌపది.

---

14 యౌవరాజ్యపట్టాభిషేకము, వారణావతి ప్రవేశము.

పాండురాజు పోయెను. నాకు కన్నులు లేవు. విదురుడు సరియైన తమ్ముడుకాడు. దాసీపుత్రుడు. పాండవులు సర్వోత్కృష్టులై యున్నారు అర్జునుడు గురుదక్షిణనిచ్చెను. పాండురాజుపుత్రులలో జ్యేష్ఠుడు ధర్మరాజుగాన వానికి యువరాజ పట్టాభిషేకము చేయవలయును అని ధృతరాష్ట్రునికి తోచెను. గుణములనుబట్టి అటుల తోచినను తనపుత్రులు అయోగ్యులు సహించరని తలచి యిటుల చేయదలచెను. జనులకు వీరిపైగల ప్రీతిని వీరికిగల అనుకూల్యమును చూచి పట్టాభిషేకము చేయుదలచెను. ధర్మనందనుడు ధార్మికుడు. తమ్ముల అనుకూల్యమున్నది. కాన రాజ్యమునకు తగినవాడు అని తలచి ధృతరాష్ట్రుడు మంత్రులతో యోచించెను. అది పెద్దకార్యము. మరువాదే ... మంత్రులు కానిండనిరి. సభకూర్చిరి. ప్రజలు కానిండనిరి. జ్యోతిష్కులను పిలిచి శుభ

దినము చూడుడనిరి. మాఘకాలమనిరి. ఒకసంవత్సరమాయెను. యౌవరాజ్యపట్టాభిషేకమాయెను. యువరాజను పేరు వచ్చెను. దుర్యోధన దుశ్శాసనాదులకు సహించలేదు. ధృతరాష్ట్రుడును పాండురాజును యిద్దరు. వారిలో ధృతరాష్ట్రుడు పెద్దవాడు. పాండవులతండ్రి లేడు. నాతండ్రి యున్నాడు. మాకుకాక, చచ్చినవానిపుత్రులకా యువరాజ్యము అని దుర్యోధనుడు దుఃఖించెను. ధృతరాష్ట్రుడు ధర్మనందనుని నవరత్నఖచిత స్వర్ణపీఠమున గూర్చుండబెట్టి గొప్ప ఋషులను పిలిపించి అభిషేకము చేసెను. పాండురాజు పోయినను ధర్మరాజుకు వానిస్థానమేర్పడెనే, పోయినకన్నులు భగవదనుగ్రహమున లభించినవని తలచుచున్నాను. అని ధృతరాష్ట్రుడు సంతోషించెను. భూమండలమును పరిపాలనము చేయతగువాడని జనలు తలచిరి. దంపతులను గూర్చుండబెట్టి పట్టాభిషేకము చేయవలయును. ధర్మరాజుకు పెండ్లికాలేదు. కావున ఒకనికే అభిషేకము చేసిరి. మీరు ధర్మనందనునికి చేసితిరే, మేమందరమును అతనిభార్యకు చేసెదమని భూపతి కాని భూమికి ఆనందబాష్పములతో జనులు అభిషేకము చేసిరి. పాండవులు ధర్మాత్ములు. ధృతరాష్ట్రునిమాట వినుచు పరిపాలించుచుండగా, అర్జునుడు ఆయారాజులను జయించి కప్పము కట్టించుచుండెను. ఆసంభ్రమములుచూచి ద్రోణాచార్యులు సంతోషించిరి. పాండవులకు చెప్పినవిద్య ఫలించెను. అర్జునునికీర్తి ధైర్యము శౌర్యము అంతయును మనది అని ఆచార్యులు సంతోషించుచుండిరి. అర్జునా! యెచ్చటికి పోతివి అని యడుగగా పడమర ఉత్తరము పోతినని చెప్పును. అదివిని ద్రోణాచార్యులు మిగుల సంతోషించుచుండిరి. ఒకనాడు అర్జునా! నీసరి పదునాలుగులోకములలోనను ఉండడు. నాపుత్రునికంటె హెచ్చుగ నీకు విద్య చెప్పితిని అని ద్రోణాచార్యులనగా అర్జునుడు గర్వపడుచుండెను. ఓహో నేనిటుల చెప్పితిని. వీనికి హెచ్చుగ అహంకారము కలిగినది అదికూడదు అని, యాదవకులమున పుట్టెనే కృష్ణుడు ఒకడు నీకుపైవాడు. నీవు అతనికి క్రిందివాడవు. అటులచేసితిని అందరికి పైవాడవు, భగవంతునికి క్రిందివాడవు నిన్నటుల చేసితిని అనిచెప్పి ద్రోణాచార్యులు అపుడపుడు సంతోషించి ఆశీర్వదించుచుండెను. భీముడును నకులసహదేవులును కార్యములను చూచుచుండిరి. అర్జునుడు దిగ్విజయము చేయుచుండెను. ధర్మరాజు రాజ్యలక్ష్మిని అనుభవించుచుండెను. కన్నులుండువాడు ఒకడుండినచాలును కన్నులులేనివారు నూర్గురుండిరేమి. పాండవులు యేవురయినను శూరులు. వారిలో ధర్మపుత్రుడు జ్యేష్ఠుడు అని ధృతరాష్ట్రుడు సంతోషముతోను నిశ్చింతతోను ఉండెను. పాండవులు యితరరాజ్యములను స్వాధీనము చేయుచు తమరాజ్యమును అభివృద్ధి చేయుచుండిరి. అంతవరకు ధృతరాష్ట్రునికి అసూయ కలుగలేదు. దుర్యోధనాదులు రాజ్యవిషయమున సంబంధములేక వేళకు భుజించుచు కాలము గడపుచుండగా, రాజులందరును ధర్మరాజుపాదములలో పడుచుండిరి. తమ్ములనిబిడ్డలు మిగుల వృద్ధికి వచ్చిరి. పాండవులు పరమశూరులు. మనబిడ్డలకు యేమియును లేదు.

వారిముఖమున కళలేదు. నేనున్నాను. నాకు కన్నులులేవు. బిడ్డలకు రాజ్యములేదు. అని పాండవులయెడ ధృతరాష్ట్రునికి అసూయ గలిగెను. భగవంతుడు అంతర్యామి హృషీకేశుడు ప్రేరేపించెను. లేనినాడు ఏకచక్ర అడవికి పొమ్మనునా. పాండవులను అంత హింసించక పోయినట్లైన దుర్యోధనాదుల సంహారమగునా. వీరికి యింతే శౌర్యము విద్య రాజ్యము సామర్థ్యము ఉన్నది. మనబిడ్డలకు లేదేయని ధృతరాష్ట్రునికి యెపుడును చింతకలిగెను. నిదురపట్టలేదు. పాండవులు రాజ్యపాలనము బాగుగ చేయుచున్నారు. నాలుగు సముద్రముల మధ్యలోగల భూమిలో ప్రసిద్ధులైరి అని పాండవుల అభ్యుదయమునుచూచి దుర్యోధనుడు మిగుల సంకటపడెను. దుర్యోధనా! భుజింపవెమ్మ అని తండ్రియనగా భోజనమునకేమి అని లేవకుండును. అతనికి అంతవరకు బుద్ధి చెడలేదు. దుర్యోధనునిదుఃఖమును చూచి తోడనే చెడెను. మనుష్యునకు రెండువిధముల కన్నులుండును. సకలమును చూచుటకు సాధారణమైనకన్నులు ఉపయోగపడును. మంచిచెడ్డలను తెలిసికొనుటకు హృదయములో కన్నులుండును. ధృతరాష్ట్రునికి తల్లి దోషమువలన వెలుపలికన్నులు లేకపోయినవి. కొంతకాలము లోపలి కన్నులుండెను. పుత్రదోషమున లోపలిదృష్టి పోయెను. పుత్రదోషమున లోపలికన్నులుపోయి మహానుభావులైన పాండవులయెడ వైరము కలిగెను. దుర్యోధనునికి ముందే ద్వేషముండెను. వారి ఆధిపత్యమునుజూచి అధిక ద్వేషమాయెను. ముసలివానిబుద్ధి చెడి ద్వేషము కలిగెను. ఊరిలో కత్తులు యేర్పడెను. ధృతరాష్ట్రునిబుద్ధి చెడెను. అతడు కొంచము మోసము చేసెను. పెద్దపట్టాభిషేకము చేసియుండవలయును. ఇష్టమైనపుడు త్రోయవచ్చునని చిన్నపట్టాభిషేకము చేసెను. మనమందరమును చేరి ధనము జమచేసి ఋషులద్వారా మహారాజ్య పట్టాభిషేకము చేయుదము. ధర్మపుత్రుడు యౌవనశాలి. గుణములచేత వృద్ధుడు. యువరాజై యున్నాడు. సత్యసంధుడు. తనక్రిందివారియెడ పరమదయగలవాడు. మహాజ్ఞాత. అట్టిధర్మపుత్రునికి మనమందరమును చేరి పట్టాభిషేకము చేయుదము. ఇందుకు భీష్ముడు సమ్మతింపవలదా యనిన ధర్మపుత్రునికి రాజ్యము వచ్చిన భీష్మునికిని ధృతరాష్ట్రునికిని తక్కువలేదు. దుర్యోధనుడు రాజైనచో పాండవులు అడవికి పోవలసినదే అని జనులుకూడ అనుకొనిరి. కార్యముచెడునని తలచి దుర్యోధనుడు ఏకాంతముగ తండ్రియొద్దకేగి, తండ్రీ! పెద్దరాజ్యము చేతచిక్కినచో ధర్మరాజు చెప్పినమాట వినడు. ఇపుడు మీరుచెప్పినటుల వినును. వాడు రాజాయెనేని నీకు భిక్షమేను. జనులు వానికి సహాయులుగ నున్నారు. కావున వాడు యౌవరాజ్యములో నుండగనే పాండవులను ఊరువిడిచి పంపుము. సమీపముననుండు వారణావతమును ఊరికి పంపినయెడల మేలు. మీకు అధికారముండునపుడే అట్లుచేయుము. అని దుర్యోధనుడు చెప్పెను. ధృతరాష్ట్రుడు అంశపురుషుడు. వేదవ్యాసుని పుత్రుడు. అతనికి ఉన్నటులుండక చింతకలిగెను. భగవంతునిశక్తిఅట్టిది. కర్తుమకర్తుమన్యథాకర్తుం శక్తియుతుడతడు. మేరువును తృణము

గన్న, తృణమును మేరువుగను, చీమను బ్రహ్మగను, బ్రహ్మను చీమగను, మూర్ఖుని బృహస్పతిగను, పరమదరిద్రుని చక్రవర్తిగను, చక్రవర్తిని దరిద్రునిగను చేయును. అట్టి గొప్పశక్తిగలవాడు స్వామి. భగవద్గీత 7 అధ్యా 14 శ్లోకమున నామాయను త్రిప్పనగు నాయనిరి. వారిమహిమలు వేదశాస్త్రపురాణములకు అందలేదు. కావున భగవత్ప్రేరణ చేత ధృతరాష్ట్రునికి పాండవులపై పరమద్వేషము కలిగెను. దుర్యోధనుడు నిర్బంధిం చెను. ధృతరాష్ట్రుడు మంత్రులలో రాజనీతినెరిగి పరమ శ్రేష్ఠుడైయుండిన కణికుని ఏకాంతమున పిలిచి,మనబిడ్డలకును పాండుపుత్రులకును పొసగలేదు.మనవారిని కొంచెము త్రోసి ధయుంచుదునా వారిని త్రోయుదునా అని యడిగెను. కణికుడు బుద్ధిమంతుడు. అందునను బ్రాహ్మణుడు ఉత్తముడు. ఇతడు యేమి చేయునో అనుతలపుతో దుర్యోధను డితనికి లంచములిచ్చి సరిపరచుకొనెను.ధృతరాష్ట్రుడు సంగతిచెప్పగా, దాయాదిపుత్రు లుకదా వారినిపంపివేసి యితరకార్యమును చేయవలయునని కణికుడనెను. నీతిశాస్త్రము నంతయును పఠించెను.దానికి కణికోపాఖ్యానమనిపేరు. భయమేల మనవారు నూర్గురు న్నారు. వారు యేమిచేయుదురని ధృతరాష్ట్రుడడుగగా,శత్రులు చిన్నవారైనను ఊరకుండరా దు. చిన్ననిప్పును ఆర్పవచ్చును. అశ్రద్ధచేసిన దానికి సహాయము దొరికిన కాల్చును. కావున శత్రువులు చిన్నవారని గుర్బలులని తలపరాదని కణికుడు చెప్పెను. వారు నమస్కరింపుదురేయని ధృతరాష్ట్రుడడుగగా అటుల తలపరాదు. మిగుల అణకువగ నుండువాని నమ్మరాదు. దాయాదిమీద వాత్సల్యముంచరాదు నేను పెంచినవారేయని తలపరాదు కృపచూపరాదు. కొట్టవలయును. కృష్ణసర్పమును ఉపేక్షించవచ్చునా. అని కణికుడు నీతిశాస్త్రమును చెప్పెను. అయిన నేమిచేయుమనెదవని ధృతరాష్ట్రుడనగా, రాజా! పాండవులయెడ కృపయుంచక పంపివేయుము. ఇపుడు కాకున్న పిమ్మట కానేరదు అనిచెప్పి కణికుడు పోయెను. దుర్యోధనుడువచ్చి తండ్రీ! నేనుచెప్పినదాని యోచించితిరా యని అడుగగా, ఔను మంత్రియును చెప్పెను. మీరు యెటులవృద్ధి పొందుదురో అటులచేయుమని చెప్పిపోయెను అని తండ్రి పుత్రులతో చెప్పెను. అటు లైన పంపివేయుమని దుర్యోధనుడు పోయెను. దుర్యోధన దుశ్శాసన కర్ణ శకునులను దుష్టచతుష్టయము ఒకటిగ చేరి యోచించిరి. పాండవులు యిష్టముండినను లేకుండినను తండ్రిఆజ్ఞయని పోదురు. పోయినవారు దివ్యసౌధమున వసించిన నేమిప్రయోజనము. పూతండ్రి పొమ్మనును. వారు పోదురు. ఆ యేర్గురిని దివ్యభవనమునుంచి నిప్పుపెట్ట వలయును. వారు మృతినొందగా మనము సుఖముగ నుండవచ్చును అని నలుగురును యోచించిరి. తండ్రీ! పాండవులను పంపెద నంటిరే దినములగుచున్నవే వారినిచూడ భయముగ నున్నదే శత్రువును రోగమును ఉపేక్షించరాదు. చిన్నకురుపేయనియుండిన వ్రణమగును. శస్త్రచికిత్స చేయవలసివచ్చును తండ్రీ! యిపుడే పంపివేయుము అని దుర్యోధనుడు నిర్బంధించ నారంభించెను. దుర్యోధనా! యెవరచ్చట యెవరును లేరే,

తలుపుమూయుము, నాకును వారిని పంపవలయునని యున్నది. నీవు చిన్నవాడవు, నేను పెద్దవాడను చెప్పనేల కార్యముచేయవలయును అనియుంటిని. చెడుకార్యమగుటచేత చెప్పలేదు అటుల తలచియుంటిని అని ధృతరాష్ట్రుడు చెప్పగా, తండ్రీ! మీరుయోచించిన సంగతేనా, మీకు తెలియదా మంత్రియును చెప్పెనా. నేడే పోవునటుల యేర్పాటుచేయుము అని దుర్యోధనుడు చెప్పెను. తండ్రి పిలువనంపగా ధర్మపుత్రుడువచ్చి నమస్కరించెను. ధర్మపుత్రా! సమీపమున శివాలయ మున్నది. నేను పోయి ఉత్సవాదులు జరుపుట వాడుక. నీవు పోయి వాని జరుపుము. ఇచ్చట నూర్గురున్నారు. అచ్చట సుఖముగ నుండవచ్చును. పోయెదవా యని గ్రుడ్డితండ్రి అడుగగా ధర్మరాజుకు విషయము తెలిసినది. ఉండినట్లుండి పొమ్మనెను. ఇదివరలో బుద్ధిచెడలేదు. దుర్యోధనుడు చెప్పియుండును. మంత్రులతో యోచించియుండును అని తలచి ధర్మరాజు తండ్రిమాటయగుటచేత ఆహా పోయెదనని చెప్పెను. నేడు అచ్చటనే భోజనమని తండ్రి అనెను. ధర్మరాజు వంశమునకు తగినటుల చెప్పెను. యయాతికి పూరు తనయౌవనమును యిచ్చెను. పితృవాక్యధురీణుడగు పూరువంశస్థుడుగాన వల్లె యనెను. నమస్కరింపవలసినవారికి నమస్కరించి ఆలయములకుపోయి నమస్కారములు చేసి భీమాది తమ్ములను తల్లిని పిలిచి, అమ్మా! తండ్రి వారణావతమునకు పొమ్మనెను. పోవుదము అనెను. అందేటుల చెప్పిరి. సదా విడువకుండిరే క్షేమసమాచారములు విచారించుచుండిరే. కారణమేమడిగితిరా యని భీముడనెను. ఏమిగనేల భగవత్సంకల్పమని ధర్మనందను డనెను. దివ్యసౌధమయినయెడల నిప్పుపెట్టుటకు వీలుపడదనితలచి దుర్యోధనుడు మంత్రియగు పురోచనుని పిలచెను. పురోచనా రమ్ము అని చేయిపట్టుకొనెను. చేతులు జోడించుకొని నిలువవలసినవాని గౌరవించెను. పాండవులు పోబోవుయింటికి నాల్గుప్రక్కల లోను ద్వారము లుండవలయును. నిప్పుపెట్టువానికి కష్టముగ నుండరాదు. పైకి చూచుటకు పళపళమని యుండవలయును. లోపల లక్క నేయి నూనెలుగ నుండవలయును. ఇటుల వారు వచ్చుటకుముందు యింటిని యేర్పరచుము. వారిసంరక్షణకై తండ్రి నిన్ను ఉంచినటులచెప్పి అచటనుండి సమయముచూచి వారు తప్పించుకొనిపోవు మార్గములతో నిప్పు పెట్టుమని చెప్పగా పురోచనుడు సమ్మతించెను. శ్రీరామచంద్రుడు మాతృపితృవాక్యమని పోయినటుల ధృతరాష్ట్రునిమాట వినవలయును, వినిన మంచిగనే జరుగునని తలచి ధర్మరాజు పోయెను. పాండవులు స్నానములుచేసి వారివారితో చెప్పిపోయిరి. వారుచూపిన సౌధమున దిగిరి. పురోచనుడు యెదుర్కొని సవినయముగ పిలుచుకొని పోయెను. వీరి కాపురమునకు కావలసిన సకలపదార్థములును ఉంచిరి. సమయముచూచి కాల్పవలయునని తలచి పురోచనుడు లోపల నుండెను. పాండవులు పోగా జనులు ఏడ్చుచు వెంటపోయిరి. మాకు యిచట యిండ్లున్నవే యెటుల అని వారు దుఃఖించగా, ధర్మరాజు సమాధానముచెప్పి పంపెను. ఎల్లవారును నిలిచిరి. విదురుడు

మాత్రము కూడపోయెను. ధర్మపుత్రా! ఒకసంగతి జ్ఞాపకముంచుకొనుము. ఇంటిలో
నిప్పుపడినట్లైన లోనులోని యెలుక కాలదు అనెను. సరి యింటిని కాల్చబోవుచు
న్నారు. ఇల్లుకాలును. దోవచూచుకొనుడనుచున్నాడు అని ధర్మరాజు తెలిసికొనెను.
నాయనా! శత్రువే చేయదలచినదానిని మనమే ముందుగ చేసినట్లైన మేలని విదురుడు
చెప్పగా, పినతండ్రీ! సంగతి తెలిసెను అని ధర్మరాజనెను. వాద్యవిశేషములతోడ
పురోహితుడు చూపగా పోయి లక్కయింట వాసముచేయుచుండిరి. ధర్మనందన
భీముల కిట్టుల సంభాషణ జరిగెను. ధ- భీమా చిన్నాయన చెప్పిన మాట వింటివా.
భీ- వింటిని. ధ- అర్థము తెలిసెనా. భీ- మీరే చెప్పుడు. ధ- ఈయింట లక్కయున్న
దని తోచుచున్నది. వీడు అందుకే యున్నాడు. భీ- అందరును నిద్రించునపుడు గదతో
గంగానదివరకు సురంగము త్రవ్వుదునా. ధ- నీవుగద నెత్తుకొని బయలుదేరిన అనర్థము
గును. ఎందుకని సందేహింతురు భగవద్గీత 9 అధ్యా 22 శ్లోకమటుల స్వామికికదా
అచింత. భీ- అన్నా అటులైన చేయవలదా. ధ- అవసరపడకుము. (వీరిటుల మాటలాడు
కొనిన మరునాడు అనుగంటలకు ఒకడు వచ్చెను. తల్లి ఉయ్యాలలో బిడ్డనువేసి కావలి
కాయునటుల భగవంతుడు మనము నిద్రించువేళలో మేలుకొని యుండును. మనము మేలు
కొనగా నిద్రించును. మనము నిద్రించునపుడు తేలుకుట్టినసెటుల. కాన భగవంతుడు
తల్లివలె మేలుకొనునని వేదవాక్యము విదురుడు పంపగా వచ్చినవాడు. వారేమి
చేయుమనిన దానిని చేయుమని విదురుడు చెప్పెను. మీరేమిచేయుమనిన దానిచేసెదను
సిద్ధముగ నున్నాను అనెను. ధర్మపుత్రుడు నవ్వి భీమా! స్వామియున్నాడనగా నవ్వి
తివే చూచితివా వానికృప అనెను. అన్నదమ్ములు యోచించిరి. ఈసమయమున తప్పిం
చుకొని పోవలయునని భూమిలోపల సురంగమేర్పరచుమనగా వాడు యేర్పరచెను.
మీరు అందరును ధారాళముగ పోవచ్చును. 'ఈప్రక్కలోను ఆప్రక్కలోను కొంత
స్థలము అధికముగనే ఉండునటుల చేసితిని. అవసరమున సామానులతోడ పోవచ్చును.
అనిచెప్పి వాడు పోయెను. వారిని కాల్చవలయును అని తలచి కదా వీడున్నాడు. వీని
నుంచి కాల్చవలయును అని భీముడు తలచెను. ఒకనాడు యేదియోవిశేషమాయెను.
అందరికిని భోజనము లాయెను. రాత్రి ఆడువాండ్రకు విందు జరిగెను. పురోచనుని చెలి
యలికి యేవురు బిడ్డలుండిరి. వారు పాండవులకును ఆమె కుంతికిని శుశ్రూషచేయుచుం
డిరి. కాలము పాండవులకు రాలేదు. దానికి వచ్చెను. కుంతీ! భోజనము అనుచు ఆమె
తనయేవురు పుత్రులతోడ వచ్చిచేరెను. బంధువులకు భోజనమాయెను. పిమ్మట వీరురాగా
కుంతి వడ్డించెను. అర్గురికిని కొంచెము అధికముగ వడ్డించెను. విశేషముగ భుజించుటచేత
బాలురతోడ యింటికి పోవుటకు కష్టముగ నుండెను. అచ్చటనే పరుండి బాగుగనిద్రిం
చిరి. ప్రజ్ఞలేదు. మధుపానము చేసియుండెను. అదుష్టహృదయ మత్తురాయి ప్రజ్ఞలేక
పరుండెను. పురోచనుడును నిద్రించెను. భీముడు మాత్రము మేలుకొని యుండెను.

ఊరిలో శబ్దము అణగెను. అగ్నికిసహాయముగ గాలి యారంభించెను.ఎవని మూలించుము యునో వాడు నిద్రించెను. ఊరివారు దుర్యోధనుని నిందించవలయును. పురోచనుడు వాని చెలికాలు వానిపుత్రులు పరుండిరి. భీముడు నాలుగుద్వారములలోను నిప్పుపెట్టెను. లక్క ఆంతయును అంటుకొనెను. కుంతియును ధర్మపుత్రాదులును అలసి నిద్రించిరి. నిప్పుపెట్టుసంగతి వారికి తెలియదు. నిప్పుఅంటుకొనగా భీముడు తల్లిని వీపునను నకులసహదేవులను నడుమునను ధర్మ అర్జునులను రెండుచేతులతోను యెత్తుకొనెను. భీముడు పరాక్రమ ముగలవాడుగాన గట్టిపట్టుతో అమ్మా అన్నారండియని త్వరితముగ సురంగముమార్గమున పోయెను. వారు నిద్రించుచుండిరి. వారికి యేమియు తెలియలేదు. ఇక వీరిని లెండులెండని లేప వలనుకాదని తలచి నిద్రతోనే పిలుచుకొనిపోయెను. వాయుకుమారుడుగాన వాయువేగశాలియై సురంగముద్వారా పోయెను. ఎచ్చటచూచినను చీకటి. నిద్రవేళ. పరమాత్మా, నినువినా బ్రోచుట కెవరున్నారు ఎచ్చటనో అడవియందు బుట్టితిమి. పెరిగితిమి ఊరికివచ్చి చేరితిమి. నీకృపలేకుండిన లక్కయింట కాలియుండమా.మాజాతకము ముమ్మారు నిర్యోత్సవమనుటకు మూరుగ నిత్యమును అపదగనే యున్నది.నీకృపయుండవలయును. నీదయకెదురుచూచుచున్నాను. అని యిటుల ఆపద్బంధువు దీనబంధువు అగువాని దలచుచు భీముడు సురంగముద్వారా పోయి గంగనుచూచి దీని దాటిపోవలయునే అనిచింతింపగా అచట నొకడు పడవను దీపమును ఉంచుకొని సిద్ధముగ నిలిచియుండెను భగవత్కృపయుండిన కొండవలెవచ్చిన అపద మంచువలె పోవును. దైవమ్మానుషరూపేణ అనినటుల స్వామి తగువారిద్వారా కాపాడును. పాండవులు వత్తురు నదిదాటవలసియుండును అని విదురుడు అతనిపంపెను.వారికి తగునైనటుల నమ్మికపుట్టునటుల చెప్పి గంగను దాటింపుమని చెప్పియుండెను.అచ్చట పదియిరువది దీపములతో నుండిరి. ఎచట వచ్చుచున్నారో వారికి మనము ఉండుసంగతి తెలియదు చూచుచుండుడని సిద్ధముగ నుండిరి. వారు పాండవులను జూచి ఓడలో కూర్చుండుడని చెప్పిరి. మీరెవరని భీముడడుగగా విదురుడు అజ్ఞాపించెనని ఓడవాడనెను. రాత్రిలో నింతసిద్ధముగ నున్నాడవు నీకేమి యీయవలయునని భీముడడుగగా నేమియును యీయవలదని ఓడవాడనెను.ఉచితముగ కూర్చుండవలెదవాయని భీముడడుగగా అటులకాదు. ధనముతీసికొనిన నెంతయగునో అంతకంటెను వేయింతలు హెచ్చుగ విదురుడుయ తేచ్ఛముగ నిచ్చెను. కూర్చుండుడు అని నావికుడనెను. సరియని కూర్చుండిరి. నావికుడిటుల విదురునిచేరినవారమని, నమ్మికకలుగునటుల చెప్పి కూర్చుండబెట్టుకొని అవలిగట్టులో దించెను.అచట గాఢాంధకారముగ నుండెను.మార్గము తెలియలేదు. రండియని సోదరులను తల్లిని పిలుచుకొని భీముడు పోవుచుండెను.కుంతి దాహమాయెను. అచట భయముగ నుండెను.కుంతి భీమాయని పిలిచి మనయోగ్యగతియేమి కులమిదే అకులములో జనించిన పాండుమహారాజుకు భార్యనై బిడ్డలతో వనములో చీక

టిలో ఆకలి దాహములతో అల్లాడుటకంటెను కష్టము గలదా. ఆకలియగుచున్నదిరా దాహముగా చీకటిరా మిట్టపల్లములురా అనెను. నడచుటకు వల్లకాదని కూర్చుండిరి. సురంగములోవలె కూర్చుండబెట్టుకొని భీముడు నడిచెను. అపుడు అర్ధరాత్రి. భీముడు ఆచీకటిలో మిట్టపల్లములలో రాళ్ళలో ముండ్లలో యేవురిని యెత్తుకొని త్వరితముగ పోయెను. అంతకంటెను కష్టముండునా. ఆట్టిసమయమున భగవంతుడు సహాయము చేయకున్న నేమైయుండును. నాయనా మాకు కష్టముగ నున్నదే మమ్ము యేవురిని యెత్తుకొని యెటుల నడచుచున్నావురా. శ్రీకృష్ణా! నీ అనుగ్రహమునకదా ప్రాణములతో వచ్చిచేరితిమి. మేనల్లుడు వాని స్మరింపుడు లేక కాపాడరమ్మని చెప్పుడు అని కుంతియనెను.

పాండవులు పోయినపిమ్మట లక్క యిల్లు కాలెను. కణ్వమహర్షి శకుంతలను దుష్యంతునొద్దకు శిష్యులతోడ బంపగా గుంపులుకూడిరి. ఓరీ మనయూరిలో (తాటిగుడిసెలలో) నిప్పుపడిన నేటుల గుంపుకూడుదురో యిచట అటులున్నారని శిష్యులు మాటలాడుకొనిరి.అటుల లక్క యిల్లు కాలగా గుంపులు కూడిరి.ఎవరేమియు చేయలేకుండిరి. పాండవులు కుంతియు పోయిరని అందరు దుఃఖించిరి. మహాపాపియైన పురోచనుడు పోయెను. జగత్తునకే క్షేమమని సంతోషించిరి. గ్రుడ్డివాడు అయోగ్యుడు ఆకన్నులుపోయెను యీకన్నులుపోయెను అచ్చటనే చంపుటకు కాదని యిచటికిపంపి చంపెను. వానికులమునకు హానియే. ఇకవీడు బాగుపడరు అని ఊరివారు నిందించిరి. నిప్పు ఆరిపోయెను. కొన్నిచోటులలో నిప్పుబొగ్గులు ఉండెను. నిప్పును ఆర్పి చూడగా ఒకడు దొరికెను. కాలియుండుటచెత గురుతు తెలియలేదు. పురోచనుడు అనుకొనె పాపీ చచ్చితివా యనిరి. జలముపోసి త్రోసిత్రోసి చూడగా ఆర్గురుండిరి. పురోచనుని చెలియలు ఆపె యేవురుబిడ్డలతోడ పరుండెనని వారెరుంగరు కాన పంచపాండవులును కుంతియును వారితోడ పురోచనుడును పోయిరని తీర్మానించి, ధృతరాష్ట్రునికి సమాచారము చెప్పిపంపిరి. దుర్యోధనుని దుర్బోధనచేత మనసుచెడి [illegible]వను తమ్ముని బిడ్డలగుటచేత రక్తము ఒకటియగుటచేత ధృతరాష్ట్రునికి దుఃఖము [illegible]దు. వాలిని చంపుటకు సుగ్రీవుడును, రావణుని చంపుటకు విభీషణుడును, యెంత ప్రయత్నించిరి. వారు క్రిందపడగనే వీరురేడ్చిరి. అటులే పాండవులు పోయి రనగనే ధృతరాష్ట్రుడు యేడ్చెను. పురోచనుడు పోయెనని దుర్యోధనునికి దుఃఖమా. కార్యార్థమై వానియేర్పగచెను. పాండవులు పోయిరని దుర్యోధనునకు సంతోషము.ఏడ్వకున్న బాగుగనుండదని దాక్షిణ్యమునకై దుఃఖింపవలసి యుండెను. దుఃఖప్రశ్న చేయువారిని చూచిన కన్నులలో నీరురాదు. యేడ్వకున్న బాగుగనుండదు యేమిసేయుదు[illegible] ఆహా మనయోచన ఫలించెనే అని తలపగా ఆనందబాష్పములు రాలెను. [illegible] స్నానముచేసిరి. ఏడ్చి తర్పణముచేసి పోయిరి. భీష్మాచార్యులు యేకాంతమున నేడ్చిరి. అయ్యో,

పాండవులకై యెంతకష్టపడితిని. వారు కాల్చబడిరే. ఈమీరుచేసి అన్యాయము చేసిరే యని యేడ్చిరి. పాండవులను యెత్తి పెంచినవారు, విద్యనేర్పినవారు కూడ యేడ్చిరి. విలాపమనగా యేడుపు. రోదనమనగా కన్నీరుగార్చుట. భీష్మాచార్యులు అంతయు చేసిరి. కాబట్టియే భగవద్గీత 2 అధ్యా 4 శ్లోకమున భీష్మాచార్యుల నెటుల చంపుదునని అర్జును డనెను. విదురునికి తెలియునుగాన పైకి దుఃఖపడెను. విదురుడు ధృతరాష్ట్రుని నొద్దకుపోయి యేడ్చెను. దుర్యోధనునిచూచి నూరింతలు హెచ్చుగ నేడ్చెను. భీష్మాచార్యులయొద్దకుపోయి యేడ్వలేదు. పాండవులయెడ ప్రీతిగలవారు. వారికై యేడ్చువారిలో నీయాయన ముఖ్యుడు. పాండవు లొకవేళ గతించినను నేనుసహా, [illegible] యేడ్వను అని పోయెను. భీష్ముడు స్నాన తర్పణములకై లేచెను. కొంతకాలమునకు విదురుడనెను. ఏమిరా యని భీష్ముడనగా పోయినది పురోచనుడేను వారార్గురును కారు. వారు తల్లిని పిలుచుకొని పోయిరి. అని విదురుడు చెప్పెను. ఎటుల పోయియుండిదురని భీష్ముడడుగగా రహస్యమును వెలిబుచ్చకుడని సంగతియంతయును చెప్పెను. గంగ దాటిరి. పరమరహస్యము మనయిరువురికే తెలిసియుండవలయును అని విదురు డనగా భీష్మాచార్యులు ఆనందముచేత పూరించెను. ఆయన జ్ఞాతయగుటచేత విదురా! నీవలన మేలాయెనని చెప్పక, భగవదనుగ్రహము వారికి తల్లి తండ్రి అన్నియును నీవేను. ధర్మజ్ఞ, బుద్ధిశాలివిరా. నీవు రాజనీతిలో నేమికత్తిరా. ఆసమయమున నీవు జాడ చూపకున్న నేమియగునురా అని కౌగిలించుకొనెను. అందరును చేరిరి. అందరికన్నులలోను నీరువచ్చెను. ఏడ్వగా వచ్చు నీటికిని ఆనందముచేత వచ్చునీటికిని భేదముండును. ఆహా వారు పోయిరికదా యని సంతోషముచేత దుర్యోధనాదులును, ఆహా వారు తప్పించుకొని పోయిరికదా యని భీష్మవిదురులును, ఆనందబాష్పములు విడిచిరి.

పాండవులు కృష్ణుడే గతియని పోయిరి. వారు దాహమును సహించిరి. కుంతి ముసలిదగుటచేత సైచలేకపోయెను. నేను పెద్దరాజు కూతురనై కుంతిభోజుని (పెంపుడు) కూతురనై పాండురాజు భార్యనై పరమశూరులగుమిమ్ముకనియుంతిదప్పిగొని శ్రమపడవలెనా అని కుంతిదుఃఖించెను. రాత్రిలో బిడ్డలేచి పాలకై యేడ్చును. పాలుపోసిన త్రాగును. పోయకున్న లేచుటకు చేతకానందున మరల నిద్రించును. అటులే కుంతి దాహమని దుఃఖించి లభింపనందున శ్రమచేత భీముని వీపుననే నిద్రించెను. దాహము తీర్చకున్న వీరందరును మృతినొందుదురు. లక్క ఇంటినుండి కాపాడినది హెచ్చుకాదు అనితలచి భీముడు వారితోడ పోవుచుండగా రెండుమైళ్ళ విశాలముగల గొప్ప వటవృక్షముండెను. దాని క్రిందపోయిన పెద్ద ఊరివలె నుండెను. భీముడు ఆవటవృక్షమును జూచి దానిక్రిందనిలిచి వారిని పరుండుడని చెప్పి అన్నా నకులసహదేవులారా జాగ్రతగనుండుడు. తీర్థము తెచ్చెదను అనిచెప్పి వారిని నిలిపి, ఈశ్వరా! అకాలము, రాక్షససంచారకాలము. చీకటి. ఇపుడు దాహము కలిగనే లేకున్న నిలుతురే. ఇపుడు నీవేశరణము వీరిని కాపాడుము

అని పోరెను. భీమునికి వారికంటెను దాహముగ నుండెను. వారు తనతో చెప్పుకొనిరి. తానెవరితో చెప్పుకొనును. ఈశ్వరా యనుచుపోయి ఒకకొలను చూచి స్నానమాచరించి తీర్థపానముచేసి శ్రమపరిహారము చేసికొని తామరాకును ఉత్తరీయమున వేసి జలమును తెచ్చెను. అడవిలో మృగఘోష. భీముఁడుతప్ప యితరులు సహింపలేరు. ఆయుత్తరీయమును చెట్టుకు కట్టెను. మట్టిలో పరుండిన అమ్మను అన్నను తమ్ములను చూచి హాయని యేడ్చెను. స్త్రీలను వృద్ధాప్యమున బిడ్డలు కాపాడవలయునని యున్నది. ఒకడుకాక ముగ్గురమున్నాము. యమధర్మరాజు ఇంద్రుడు వాయువుయొక్క అనుగ్రహమున ముగ్గురినికని హంసతూలికా తల్పమున పరుండవలసినతల్లి, అనాథరాలై భూమిలో పరున్నదే కర్మగతి యేమి అని భీముడు యేడ్చెను. నేను బిడ్డనై పుట్టితినే బరువు మోయుటకేనా. భగవానుడా, యేపాపము చేసితిరా, ఇదియొక వేడుకయా. అర్జునునితో సమానుడుండడు. వాడును అన్నయు యీచిన్నవారును క్రిందపరుండియున్నారే. ఇంతకంటెను దుఃఖమేమున్నది అని చింతించి వీరినిపుడు లేపరాదు. నిద్రించినవరకు నిద్రింపనిమ్ము. భయంకరమగువనము. లేచినపుడు తీర్థమును స్వీకరింపుదురు అని తలచి తాను మేల్కొనియుండెను. అచటికి హిడింబుడను రాక్షసుడు వచ్చి హిడింబయను తన చెల్లెలిని పిలిచి అమ్మా యెవ్వరో మనుష్యులు పరుండియుండునటు లున్నది. చూచి రమ్ము. వాసనవచ్చుచున్నది. పోయి యెందరున్నారో వారిని చంపి అటులే యెత్తుకొని రమ్ము. వారిశరీరమును కోసి మాంసమును మనమిరువురమును భక్షింతము అనెను. మల్లెపూలవాసనవలె మనుష్యవాసనచేత రాక్షసునికి ఆనందము కలిగెను. అన్న చెప్పిన తీరుననే నిజమైన భయంకరరూపముతో వచ్చెను. నలుగురు పురుషులు ఒక స్త్రీ ఉన్నారు. వీరిని నెత్తుకొనిపోయి తినుదము అని తలచులోపల ఒకమనుష్యుడు ఉండుటను చూచెను. రాత్రి చీకటిగ నున్నదే యెవడైనను వచ్చిన నేటుల అని యోచనలేక భీముడు ధైర్యముతో ఉండెను. హిడింబ భీముని రొమ్మును బాహువులను గంభీరమును చూచి, వీని భర్తగ గ్రహించిన మనోరథము సంపూర్ణముగ నెరవేర్చుకొనవచ్చునని అభిప్రాయపడి తనరూపమును విడిచి మనుష్యరూపముతో రంభయో మేనకయో ఊర్వసియో యనునటుల అగుపడెను. వారి యోగక్షేమము స్వామిదగుటచేత దాకిని కామవికారము గలిగెను.

---

(15) హిడింబునివధ, హిండిబకల్యాణము.

హిడింబ దూరమున నిలిచి భీమునిచూచి తనకు తగినవాడని తలచి సమీపించి ఆతని రూపమును గమనించి కామించి, ఆరాక్షసిరూపముతో కనబడరాదని తలచి కామరూపిణిగాన, దివ్యరూపముతో వచ్చెను. మంచిది, అని భీముడు పరమధైర్యముతో కూర్చుండియుండెను. హిడింబ యెటులవచ్చెననగా భీముడు చూడగనే కొంచము

యోచించవలసినట్టుగా ఉత్తమస్త్రీవలె సుందరస్త్రీయై ఒయ్యారముగ నడచుచు వచ్చెను. రాత్రి చీకటిలో యిదొక వేడుకయా యిది మనుష్యస్త్రీయగునా దేవతయా సమీపమునకు రానిమ్మని భీముడుండెను. హిడింబ సమీపమునకు వచ్చెను. భీముడు— నీవెవతెవు. హిడింబ— నేను అబద్ధమేల చెప్పవలయును. హిడింబుడు అనువాడు ఆరోగ్యుడు. మిమ్ము చంపుటకై నన్ను పంపెను. వాడు నాయన్న. భీ— అటులైన మమ్ము చంపవచ్చితివా. హి— నాయన్న యంటినే, వాడు యీప్రదేశమునకు రాజు. మిగుల బలిష్ఠుడు. యమునికి మిగుల స్నేహితుడు. యముడు చేయవలసిన కార్యములలో యితడు అర్ధభాగముచేయును. నాపేరు హిడింబ. మిమ్ము చంపి రక్తపానము చేయుటకై నన్ను పంపెను. నేనును ఆయభిప్రాయముతోనే వచ్చితిని. నిన్ను చూడగా రుధిరపానము వలదు. అధరపానము కావలయునని తోచుచున్నది. (హిడింబ నైజమైనది కాక తెచ్చుకొనినరూపముగాన ఒకే ప్రకాశముగ నుండెను. చీకటిలో నిప్పువలె మిణుకు మిణుకుమనుచు అగ్నిభగవానుని శిఖయో అనునట్లుండెను. కొల్చుటకై లక్ష్యుయింటినినిచ్చితినే ఆమేలుతలచి తనకు సహాయము చేసిన భీముడు శ్రమపడరాదని సహాయము చేయవలయునని అగ్నిభగవానుడు పంపెనో అని భీముడు తలచెను.) భీ— అటుల నీమనసు మారెను. ఏమి చేయవలయునని తోచుచున్నది. హి — నేనటుల తలచి వచ్చితిని. నాయభిప్రాయము మారెను. ఈబ్రహ్మసృష్టిలో మీవంటివస్తువు నాకు దొరకదు. నమ్ముము. సత్యము. మీరు మనుష్యులు. మిమ్ము చంపి మాంసము తినుట నాకు సమ్మతముకాదు. (మెరుపుతీగవలె ప్రకాశము. భగవత్సంకల్పము. ఇదొక ఆశ్చర్యము అని భీముడు తలచెను.) హి— వాడు వచ్చును. వచ్చిన విడువడు. అంతకులోపల వీరిని లేపుము. భీ— వానికి భయపడి వీరిని లేపుటయా శ్రాంతులై నిద్రించుచున్నారు హి— (మనసున సంతోషించుచు) నాయన్నతో సరియైనవాడు బ్రహ్మసృష్టిలో లేడు. వాడు మిగుల దుష్టుడు. నీహితమునకై చెప్పుచున్నాను. ఇదివరలో వానియొద్ద తప్పించుకొనినవారు లేరు. భీ— నీకు నీ యన్న సంగతిమాత్రము తెలియును. నాసంగతి తెలియదు. (అని రొమ్ము కొట్టుకొనెను). హి— ఒకకార్యము చేయుము. వాడు వచ్చును. నేను రాక్షసభావమును వదలితిని. అంగీకరింపుము. భీ— ఏల అంత అవసరపడుచున్నావు. హి— మన్మథబాణవేగమును సహించలేను. భీ— సరి. వాడువచ్చి అందరిని తినినయెటుల. హి— నీవుమాత్రము నన్ను అంగీకరింపుము. వాడువచ్చిన నిన్ను అత్తగారిని వీరిని యెత్తుకొని వానికి చిక్కక పారిపోయెదను. నిన్నెంత వేడుదునురా నాపైదయరాదా మన్మథబాణకి తాళజాల. శీఘ్రముగ మీతో చేరినవారిని లేపుము. యెత్తుకొని ఆకాశమార్గమున పోయెదను. భీ— వానికి భయపడియా వీరిని లేపవలయును. హి— మావానిని నేను కాపాడుకొనెదను, నీవు ఏపనికి పొమ్మనెదవా. యీ స్త్రీనీకేతగినదిరా. భీ— చెల్లెలా నిన్ను పంపగా వీరిని చంపకున్నావని వాడు కోపించుననుకొనుచున్నావా. వాడువచ్చిన

నేను చూచుకొనెదను. హి– వాడు మిగుల దుష్టుడే. వచ్చిననెటుల. భీ– నీవిపుడు నాశరీరపుష్టి అందమును మాత్రము చూచుచున్నావు. వాడు రానిమ్ము. నాపరాక్రమమునపుడు చూడగలవు. పిదప పెండ్లాడుము. హి– సరి సంహరింతురు. వానియొద్ద తప్పినవారు లేరే. భీము– నాబాహువులు ఊరు రొమ్ము చూడుము. అనెను. అంతియు భగవంతునికృప. మరియొకనైన మాటలాడునా. చీకటిలో నిటుల మాటలాడుచుండగా హిడింబుడు వచ్చెను. పోయినతోడనే చంపవలయునా మనుష్యులతో మాటలాడవలయునాఅని వానికి చెలియలిమీద కోపము వచ్చెను.అందుచేత కన్నులు యెర్రగ చేసికొని సరి, వారిని నిన్ను సహా అంతమొందించెదను అనెను. ఎర్రని వెండ్రుకలు గల వాడు చెలియలితో నిటులచెప్పి భీముని చూచి, దుర్బుద్ధీ! నీకు మంచిబుద్ధియుండిన నాచేపంపబడిన నాచెలియలితో నావనమున మాటలాడుదువా. శక్తియుండిన పరుగెత్తి పొమ్ము అనెను. భీముడు పోవునా. మనుష్యులను అటులే మ్రింగువాడు యెదుటనిలువగా కదలలేదు. ఏమిరా గమనించి చూచెదవు. ఓరీ! నన్ను పరుగెత్తుమంటివే. నీవు యెచ్చట పోయినను వదలను. వీరు నిదురించుచున్నారు అరవకుము. శక్తియుండిన చేయిచూపుమని భీముడనెను. సరి యింతసామర్థ్యము ఉండబట్టియే నిలిచినాడు. చంపునటుల తోచుచున్నది. లేకున్న నేను కోరుదునా అనిహిడింబ అనుకొనెను. హిడింబీ నిన్నెందుకై పంపితిని అని హిడింబుడడుగగా, తనభార్యయని ఓరీ ఆడుదానితో నేమి నాతో మాటలాడుము. స్త్రీజాతిగాన నారూపమును జూచి మోహించెను. దానితో మాటలేల. దానిపై కోపించకుము. చంపబంపగా కామించెనని దానిని దూషింపకుము. మన్మథుని దూషింపుము అని భీముడనెను. ఓసీ వచ్చి యింతిసరిపరచుకొంటివా అని దాని కొట్టుటకై హిడింబాసురుడు పోయెను.ఓరీ నేనుండునపుడు నాముందు స్త్రీహత్య చేయరాదు అని భీముడు చెప్పుచుండగా, వాడు హిడింబిని కొట్టుటకు బోయెను. ఓరీ పోకుము అని భీముడు చేతిని అడ్డముగ పెట్టి నాముందు యెవరినైనను హింసించరాదు. నీచెలియలినెకాదు.దానిమీద కోపించకుము.మన్మథుని అడుగుము. అటుల శక్తియుండిన పోరుటకు రమ్ము అనెను. ఏమీ అని అసురుడు చేతులెత్తెను. మనుష్యులను ఆలస్యముచేయక మ్రింగువాడు. వానితో నిటుల భీముడు అనగా దానికి ముప్పాతిక భాగము భయములీరెను. వాడు ఒక దెబ్బ కొట్టెను. భీముడు వానిని అటులే కౌగిలించుకొని వదలలేదు. తల్లియును సోదరులును నిదురించుచున్నారని వానిత్రోసి బరబర లాగుకొని సింహము కుక్కను యీడుచుకొని పోవునటుల పోయెను. అస్త్రమా, శస్త్రమా. చీకటి. రాత్రి. అపుడుకగా యీసంగతి యేర్పడెను. ఇటుల తిరిగి యొక మర్రిచెట్టును భీముడు పెల్లగించగా వాడును అటులేచేసెను. వారు సాలు తాల తమాల చూత మొదలగు గొప్పవృక్షములను వేరులతో పెల్లగించి కొట్టుకొని పిమ్మట యిరువురును కౌగిలించుకొనిరి. వాడు రాక్షసుడు. వీడు రాక్షసులను చంపుటకు అవతరించినవాడు.

నాయనా! కష్టములోనుండగా అందమైన భార్యను నిచ్చితివేయని భీముడు ఆనందము చేత వాని కౌగిలించుకొనెను. అంతమాత్రముచాలక పరుండి పొరలెను. కొండలతోను చెట్లతోను చేతులతోను పరస్పరము కొంతకాలము సమముగ యుద్ధము చేసిరి. గడగడ మని శబ్దము కలుగుచుండెను. వీరవాదములు చేయుచుండిరి. భూమి గడగడ మనుచుం డెను. వారు నిదురలేచిరి. రాత్రియే చీకటియే యెవడు వచ్చెనో యని వారు భీమా భీమాయనుచు లేచిరి. భీముడు కానకుండెను. పళపళ మెరయుచు ఒక స్త్రీ కనుబడెను. సంగతి తెలియలేదని యోచించిరి. భయపడ్డిరి. కుంతి స్త్రీయగుటచేత అదిరాక్షసస్త్రీగ కనుబడ్డిన భయపడ్డియుండును. కొంతదూరముగ మిగుల అందమైన స్త్రీ కనుబడగా సమీపమున శబ్దమేమని విచారింపదలచి, అమ్మా! నీవెవరవని హిండిబిని నడిగెను. నేనా, మీకోడలినని హిడింబి చెప్పెను. ఇదేమే కోడలి ననుచున్నావని కుంతి యడుగగా హిడింబి సంగతిచెప్పి భయపడకుము అనెను. మీపుత్రుడు నాభర్త అటులచేసెనని చెప్పెను. హృషీకేశుడు అటుల ప్రేరేపించెను. భీముని పాదముల బడునటుల చేసెను. అత్తా! మీబిడ్డ సామాన్యుడు కాడు. లేకున్న నేను వరింతునా అనెను. దైవమా భీముడు మేలుకొని యుండకున్న నేమగునని కుంతి దైవప్రార్థన చేసెను. అర్జును డీసంగతి విని వదినే! వారెచట అని పరుగెత్తెను. యుద్ధము జరుగుచుండెను. అర్జునుడు నిలిచి చూచు చుండెను. భీముడు అలసియుండునని అన్నా! వృత్రాసురుని ఇంద్రుడు చంపినటుల వీని చంపుము. మీకు వేడుక. మనవారు చింతించుచున్నారు. కానిండు. లేక మీరు బహుకాలముగ పోరుచుండుటచేత చేయి కందియుండును. నేను వచ్చెదను అనెను. భీమునికి పౌరుషము హెచ్చెను. అర్జునా! వీనివంటివారు పదివేలమంది వచ్చినను కాలితో రాచివేయనా. స్వల్పకాలమునకే చేయి కందిపోవునా. వేడుక చూచెదవా అని తండ్రి యైన వాయుదేవుడు ప్రళయకాలమున రేగిననెటులుండునో అటుల చెలరేగెను. వాయు బలమును వేగమును పుచ్చుకొని అర్జునా చేయి యెరుపాయెనో లేదో చూడుమని వాని యెత్తి చేతితో పట్టుకొని రెండుకాళ్ళను గిరగిరత్రిప్పి, ఓరీ మాచెలియలితో నేమి చెప్పితివి. మారక్తపానము చేసెదవా. నీవే అటులచేయుదువో నేను చేయుదునో చూతము అని వీరవాదముచేసి కాళ్ళుచేతులతో రాచివేసెను. హిడింబాసురుడు అంతమొందెను. పెద్దరాక్షసులకు చిన్నదూడదొరకిన శ్రమపడనక్కరలేదు. చిన్న దెబ్బకొట్టిన చచ్చును. అటులే భీముడు అనాయాసముగ వానిసంహరించెను. భీముడు హిడింబాసురుని సంహ రించెనో లేదో యని కుంతి భయపడగా, అత్తా! భయపడవలదు. వచ్చెదరు అని హిడింబి అనెను. దేవతలకు ఆనందమాయెను. పుష్పవృష్టి గురిపించిరి. కథ వినినపుడే మనకింత సంతోషము కలుగుచున్నదే. కన్నతల్లికి సోదరులకు కామించిన స్త్రీకి యెంత సంతోష మగునో. వారందరును సంతోషించిరి. యమునికైన యముడు అనిన అట్టివాని నితడు సంహరించెనే లేకున్న అటుల మాటలాడునా అని హిడింబి సంతోషించెను. భీముడు

చ్చి, అర్జునా రమ్ము, అమ్మా రమ్ము, అని వారిని పిలుచుకొని పోవ యత్నించెను. భీమన్ని పిలువలేదు. వానిచెల్లియలేక దా యని మాటలాడక పోయిరి. రాక్షసస్త్రీయేక దా యని కుంతియును పిలువలేదు. ఇదియును మాటలాడక యేమగునోయని పోయెను. వారు మఱ్ఱి చెట్టుక్రింద కూర్చుండిరి. భీముడు మాటలాడలేదు. ఈమె తల్లి. వారుసోదరులు. అను జ్ఞలేనిది అంగీకరింపడు అని తలచి హిడింబి అత్తకు బావకు నమస్కరించి, నేను వాని చెల్లెలను లేను. వచ్చితిని. వరించితిని. అంగీకరింపుడనెను. ఇది రాక్షసి. భీముని పిలుచుకొని పోయిన నెటులని వారు మాటలాడకుండిరి. భీమునికి అవమానముగ నుండినందున యేమి అత్త యేమి ధర్మ. మేమేవో భగవదనుగ్రహమున నున్నాము మాయొద్ద వచ్చెదవా యని భీముడు దాని కొట్టబోయెను. ధర్మరాజుకు నమస్కరించినదిగాన భీమా! యేమో స్త్రీ కామించినది. ఇష్టముండిన సమ్మతింపుము. దీనికై స్త్రీహత్యచేయవలయునా అని ధర్మరాజనెను. అన్నా! అటులే యని భీముడు నిలిచెను. అన్న తండ్రిసమానుడుక దా ఆయన వలదనగనే హిడింబి కుంతియొద్దకు పోయి అత్తా ఒక స్త్రీ అందగాని చూచి పడుపాట్లు మీకును తెలియునుక దా. మా అన్నవంటివాని చంపిన మహాపురుషుడు. మీరును స్త్రీయే అగుటచేత నాప్రార్థన నంగీకరింపుడు అని అది అనెను. అంతయూ పదగ నున్నదా యని కుంతియనెను. ఇపుడు మీకుమామని కోడ చేర్చిపెట్టిన యింతకు మించిన ఉపకారము లేదు. అని హిడింబి చెప్పెను. సరి మీయన్నను చంపిన భీముడు న్నాడు భయములేదు. కష్టకాలము ఇప్పుడు పెండ్లియేలనే యని కుంతి యనగా అత్తా! మీకష్టము తీరనే యని హిడింబి యనెను. ఏలనని కుంతియనగా రేపు ఉదయము వేదవ్యాసభగవానుడు రాబోవుచున్నారు. మీకష్టములన్నియును తీర్చునని హిడింబి చెప్పెను. అచటిసంగతుల తెలిసినది కావున, ఇదేమి త్రికాలజ్ఞానిగ నున్నదే యెటుల తెలియునే అని కుంతి యడుగగా, అత్తా నేను సామాన్య స్త్రీనికాను. అంగీకరింపుడని హిడింబి అనెను. దప్పిగనున్నదని కుంతియనగా అత్తా నేనుచూపు తీర్థమును పానము చేయుడు. శరీరముండువరకు దప్పికలుగదు. మీరును బావగారును చేరి అనుజ్ఞనీయుడు అని హిడింబియనెను. వారిద్దరునుచేరి భీమా యేలరా వలదనుచున్నావు. ద్రవ్యరాసుల నడుగుచున్నదా చేర్చుకొను మనిరి. భీమునికి లోపల అంగీకారముగనే యుండెను. ఎచ్చటికి పోదువు. చెట్టుక్రింద నేకదా యుండవలయును అని కుంతియనగా అత్తా అను జ్ఞనిచ్చిన యెత్తుకొని పోయెదనని హిడింబియనెను. వారు భయపడి పగటివేళ తీసికొని పొమ్ము. రాత్రులలో తెచ్చి విడువుము అనిరి. శాలిహోత్రమహర్షి ఆశ్రమమున తపసు చేత నేర్పరచిన శాలిహోత్రసరస్సునొద్దకు వారినందరిని హిడింబి యెత్తుకొని పోయెను. వారందరును అతీర్థమును గ్రోలిరి. ఆజలము పండ్రెండేడులకైనను ఆకలిదప్పులు యెత్తనీయదు. అట్టిజలము త్రాగి వారు సంతోషించిరి. అత్తా! పిలుచుకొని పోదునా అని హిడింబి అడుగగా పొమ్ము సాయంత్రమునకు తెమ్ము అని కుంతిచెప్పెను. హిడింబి

దివ్యాభరణములను ధరించుకొని వచ్చెను. ఓరీ ధర్మపుత్రా! భీముని యదృష్టము మంచిది, పరమమృదువు పరమరాసిక్యము గల ఉత్తమ స్త్రీలు మాటలాడునట్టుల మాట్లాడుచున్నది అని సంతోషించి అంగీకరించిరి. అది భీముని నెత్తుకొని పోయెను. సూర్యోదయము కాగా అపరసూర్యులై వేదవ్యాసులు వచ్చిరి. మీకు మంచికాలము వచ్చినదని చెప్పుటకై వచ్చితి ననిరి. పాండవులు నమస్కరించిరి. మీసంగతి చెప్పనక్కరలేదు. జ్ఞానినగుటచేత యెఱుంగుదును. ఒక కార్యము చేయుడు. ఆరుమాసములు వేచియుండుడు. దేవకార్యమున్నది. దేవరహస్యము, మంచికాలము వచ్చును. శాలిహోత్రుని ఆశ్రమమున ఆయనతపసుచేత దివ్యసరస్సు యేర్పడెను. ఆజలము పానముచేసిన ఆకలిదప్పులు శ్రమము ఉండవు. ఇచట ఆరునెల లుండుడు. ఒక నెలలోపల మరియొక పర్యాయము వచ్చెదను. అనిచెప్పి వ్యాసులు పోయిరి. వ్యాసులు చెప్పిరిగాన సుఖముకలుగును. ఇచటనే ఉందము అని వారు సరస్సులోని తీర్థమును పానముచేయుచు నుండిరి. హిడింబి వీరి యనుమతిమీద భీముని ఉదయము పిలుచుకొనిపోయి సాయంకాలము తెచ్చి విడుచుచుండెను. ఈకథకు హిడింబి కల్యాణమనియును పేరు.

---

(16) బకాసురవధ.

హిడింబి గర్భమాయెను. అది మనుష్యరూపమెత్తి బహుసౌందర్యముతో నుండెను. కురూపులగు గర్భిణి స్త్రీలుసహా రూపవంతులుగ నుందురు. హిడింబి అంతముగల స్త్రీ. దానితోడ లోపలనుండు బిడ్డ సామాన్యుడు కాడు. అందువలన తక్కువేమియును లేదు. అదృష్టహీనులు నేనేమి సుఖపడుచున్నాను. ఇక బిడ్డపుట్టి యేమిసుఖపడుదును అని దుఃఖింతురు. హిడింబి దివ్యఫలములు భుజించును. వస్త్రాభరణములకు చింతలేదు. అడవిలో నున్నామే యెటుల యెవరైన కొట్టినయెటుల అని భయమా. ఆలోకమున ఇంద్రాణి. ఈలోకమున భీమసేనుని పట్టరాణి అని సంతోషము, భర్తను వశపరచుకొనెను, దానికి జగత్తే లక్ష్యములేదు, అడుగడుగుకును నాకు సము లెవరని గర్వించుచుండెను. జగమునకంతయును మాయన్న హెచ్చు. వాని భీమసేనుడు చంపెను. నే నతని పట్టరాణిని. అని సంతోషపడుచుండగా ప్రసవకాల మాయెను. ప్రసవించెను. ఆబిడ్డకు పెద్దశరీరముగ నుండెను. కన్నులుచూడ అగ్నిజ్వాలవలె పళపళమని యుండెను. నోరుతెరవగా ప్రపంచము లోపల పోవునటు లుండెను. చెవులు పరకపైలుగ నుండెను. మ్రింగునేమో యని కన్నతల్లికే భయముగ నుండెను. ఘటోత్కచుడని వానికి పేరుపెట్టెను. ఘటమనగా కుండ, ఉత్కచ అనగా వెండ్రుకలు లేకుండుట. హిడింబి బిడ్డను చూడగా తల కుండవలెనుండెను. వెండ్రుకలు లేకుండెను. అందుచేత ఆపేరు. పాండవులకు విచారము కలిగెను. మనకు రాజ్యములేదు. శ్రమపడ్డి చేరితిమి.

భోజనము లేదు. ఏమో ఒకతె ప్రాప్తించెను. పోనిమ్మని యుంటిమి. ఈబిడ్డ పుట్టెను. ఈబిడ్డ ఐదుబండ్ల ఆహారము భుజించును. అది యేబదిబండ్లు భుజించును. వీరిని పిలుచుకొనిపోయి యెచ్చట సుఖపడుదుము అని స్వామిని తలచిరి. స్వామీ! అనేక కష్టములు నీయనుగ్రహమున పోయి యిచట చేరితిమి. అసురుని చంపితిమి. దీనికి గర్భము రావలయునా. ఇంతవాడుగ పుట్టవలయునా. భోజనము నెందు తెత్తుము. ఆయాపదలో కాపాడితివి. ఒకరిని అడుగుద మనుకొనవచ్చునా. నీవుతప్ప యెవరున్నారు. రక్షించిన ను శిక్షించినను నీవేను అని ప్రార్థించగా స్వామికి కాపాడవలయునని తోచెను. ఘటోత్కచుడు క్రమముగ పెరుగవలెనా. లేచి బిరబిర నడచుచుపోయి పాండవులకు నమస్కరించి నాకు భోజనము వలదు. తలచినపుడు వచ్చెదను అనిచెప్పి పోయెను. దీని నెటుల చేయుదమని యుండగా యిక నన్ను పిలుచుకొని పోవలదు. ఇక అటుల పిలుచుకొనిపోయిన బాగుగ నుండదు. మీరు సుఖముగ పొండి, తలచినపుడు వచ్చెదను. తమస్వాధీనములో నుండెదను అని హిడింబి చెప్పెను. భీమునిమీద తనమనసునుంచి మీరెపుడు తలచిన వచ్చెదను. దీని నేల పెండ్లాడితినని తమకు శ్రమ కలుగరాదు. తలచిన పుడె వచ్చెదను. బిడ్డయును వచ్చును పిలిచినకార్యము చేయుదుము. అనిచెప్పి భీము నే తలచుచు పోయెను. సకలగుణములలోను ఆబిడ్డ భీమసేనునికి సముడు (కర్ణుడు అర్జునుని చంపుటకై శక్త్యాయుధమును ఉంచుకొని యుండెను. మనయింటి అల్లుడు పోవునే అని స్వామికి యోచన. ఒకరాత్రియుద్ధముకాగా ఘటోత్కచుని దలచిరి. వాడు వచ్చెను. రాత్రి రాక్షసులకు బలము. వాడు ఘోరముగ పోరగా దుర్యోధనుడు కర్ణుని పిలిచి అర్జునునికొరకై ఉంచియున్న శక్త్యాయుధమును వీనిపై ప్రయోగింపుము. నేడు గడచిన చూతము అనెను. కర్ణుడు వేసెను. వాడు మృతినొందెను. పాండవులు యేడ్వగా స్వామి ఆనందించెను. ఏల అంతసంతోషమని వారనగా అర్జునుడు బ్రతికినేయని స్వామిచెప్పెను. మీకు అర్జునుడు ఉండవలయును. నాకు మాచెలియలి మాంగల్యము ఉండవలయును. సామాన్యుని యిచ్చిన కర్ణుడు సమ్మతింపడు అని స్వామిచెప్పెను.) అట్టివాడు ఘటోత్కచుడు. వారిరువురును పోగా యిచట నుండరాదు హిడింబాసురుని చంపిన దెవడని ఊహింతురు అని పాండవులు బయలువెడలిరి. వ్యాసులు వచ్చిరి. మీరు బయలుదేరి యేకచక్రనగరమునకు పొండు. బ్రాహ్మణరూపములో నుండుడు. నేను అపుడపుడు వచ్చుచుండెదను. అని వ్యాసులు చెప్పగా వారు బ్రాహ్మణవేషములు వేసికొని ప్రకాశించుచుండిరి. వేదాధ్యయన మున్నదిగాన వేదమును వేదాంగములను అధ్యయనము చేయుచుండిరి. వేదవ్యాస భగవానుడు వారితోడనే ఉండెను. కుంతికిని వారికిని సమాధానము చెప్పుచుండెను. ఇటు లుండగా, స్వామీ, అంబాలికకు మీరనుగ్రహించికదా నాభర్త పుట్టెను. నేను కోడలిని కదా. వీరు తమ మనుమలు. ఇట్టిమాకు అడుగడుగుకును యేల కష్టములు వచ్చుచున్నవి. అని కుంతి దుఃఖించి అడిగెను. మీరు పుణ్యాత్ములు. మను

ష్యులు పుణ్యకార్యములు చేయుదురు. రెండు అబద్ధములును చెప్పుదురు. పాపము చేసి తిమే దైవమున్నాడేయని బ్రాహ్మణునికి నాలుగణాలు దక్షిణ నిత్తురు. కావున మంచి కలిగినపుడు పుణ్యఫల మనుకొనుము. కష్టపడునపుడు పాపఫల మనుకొనుము. నీవు బుద్ధిశాలివి చింతింపరాదు అని యిటుల వ్యాసుడు సమాధానముచెప్పి వారిని యేకచక్రనగరమునకు పిలుచుకొనివచ్చి ఒక బ్రాహ్మణయింట ఒప్పచెప్పి వీరు మాతో చేరినవారు, చూచుకొనుడని అచ్చట కాపురముంచి అగుగడుగుకును వచ్చుచుండెదనని చెప్పి పోయెను. పాండవులు తమ స్వరూపమును మార్చుకొని యిది యొకకాలవిశేషమని మంచికాలమును నిరీక్షించుచుండిరి. వారు భుజింపవలయునే బ్రాహ్మణులు పెట్టుదురా. బ్రాహ్మణవేషము వేసిరిగాన భిక్షతీసికొనుట కధికారులైరి. వంటచేసికొనుట కష్టమని భిక్ష మెత్తుట కారంభించిరి. మంచి తేజస్సుగలవారు. వేదాధ్యయనము చేయుచున్నారని ఊరివారు అధికముగ భిక్ష వేయుదురు. తెచ్చి తల్లియొద్ద నిత్తురు. కుంతి అర్ధభాగమును భీమునకిచ్చి మిగత అర్ధభాగమును తమకు ఉపయోగించుకొనును. స్వామీ! మిగుల శ్రమపడుచున్నాము. భిక్షకుపోయి భోజనము చేయుచున్నాము అది దేహమునకు పట్టునా. మేము యెవరికి పుట్టితిమి. ఏ జాతివారము. ఇట్టివేళలో పరాకు సేయజనదు. నీయత్త, అత్తబిడ్డలము. అసురుడు ప్రహ్లాదుడు పిలువగా పోలేదా. ధ్రువుడును రాజు పిలువ పోలేదా. ఏనుగు పిలువగ పోలేదా. మేము మీసమీపబంధువులము భిక్ష మెత్తి భుజింపవలయునా. అని ప్రార్థించిరి. ఒకనాడు భీమసేనుడు వచ్చుచుండగా నొక కుమ్మరవాని యింటిలో నొకమూల నిప్పుపడెను. వా రందరును అల్లాడుచుండిరి. వారు అల్లాడుటను జూచి భీముడు వారింటిని చేతితో నెత్తి దూరముగ నుంచెను. వాడు ప్రత్యుపకారమును కోరుమని భీమునితో చెప్పగా పేదవాడవు నీవేమి యీయగలవు. ఒకబండెడు అన్నము పట్టునంత కుండ చేసియిమ్మనెను. వా డటులే చేసియిచ్చెను. భీముడు ఆకుండ నెత్తుకొని భిక్షకు పోవుచుండగా, దీనినిండుగ నెవరువేయుదురు, ఇతడు దీని నెటుల మోయును దీనిలోని అన్నమును యేనూరుమంది భుజింపవచ్చునే అని జనులు మాటలాడుకొన నారంభించిరి. భీమా హిడింబాసురుని చంపినదే సందేహము. వ్యాసులు రహస్యముగ నుండు మనిరి. ఇటుల పోరాదు. సందేహింతురు. రేపటినుండి నీవు బిచ్చమునకు రావలదు. మేము నలుగురమును పోయి భిక్ష తెచ్చెదము. తెచ్చినదానిలో అర్ధభాగమైనను ముప్పాతిక భాగమైనను భుజింపుము అని ధర్మరాజు చెప్పగా, భీముడు సరియనెను. భీముడును కుంతియును యింటిలోనుండగా నొకనాడు ఆయింటివారు యేడ్వనారంభించిరి. కాపురముండు యింటివారు కూటమున కూర్చుండవచ్చునా. భీముని చూచిన రాక్షసస్త్రీలును మోహింతురు. కావున ఆయన భోజనముకాగనే వీధి అరుగుమీద కూర్చుండును. అమ్మా లోపల యేడ్చునటులున్నది విచారింపుము. ఎపుడు మనము కాపురముఉన్నామో వారి క్షేమమును విచారించవలదా. అందరుచేరి యేడ్చుచున్నారు. పోయి

విచారింపుము అని భీముడు కుంతితో చెప్పెను. కుంతి సంగతివిచారించి పోవుదమని వాకిట నిలిచెను. ఆయింటి బ్రాహ్మణుడు యిటులచెప్పెను. సమీపమునందు బకుడను రాక్షసుడు వచ్చి నూరు యిన్నూరుమందిని భక్షించి పోవుచుండెను. జనులు ఒకవ్యవస్థచేసి దినమున కొకని బలియిత్తు మనిరి. ఇపుడు మాయింటివంతు వచ్చెను. రేపటిదినము యీయవలయును. నేను పోవుదునా, భార్యను పంపుదునా, పుత్రిని బంపుదునా, పుత్రుని బంపుదునా, యని దుఃఖించెదను. అయ్యో యెవడైన నొక పురుషుడు రావచ్చునని యుండరాదా. చిన్నవారిని పంపవలయునని యేర్పాటు ఉన్నదే! అటుల అడుగకున్న నేను పోదునే. ఎప్పుడైనను పోవలయుననిన పోదునే. పదమూడు సంవత్సరముల కొకపర్యాయము వంతు వచ్చును రేపటిదినము నేను పోయిన యిక పదుమూడేండ్లకు చూచుకొనవచ్చునే. పురుషుడనక చిన్నపిల్లవాడని యేర్పాటుచేసిరే నాకు ఉండునది ఒక్కబిడ్డయె అని దుఃఖించెను. నన్ను పంపుడు. నేను పోయెదను. మీరు మరల పెండిలిచేసికొనవచ్చును. మీరుపోయిన నేను పెండ్లాడరాదు. వీరిని కాపాడలేను నేను బ్రతుకలేను. నన్ను పంపుడు అని ఆబ్రాహ్మణుని భార్య అనెను. మాతృహీన పిల్లలను పెట్టుకొని నేనేమి సేతును. మరియొకతె వచ్చెనేని తోడనే విషముపెట్టుటకు యత్నించును. నాకు నెనుబదియేండ్లు లాయెను. పిల్లనిత్తురా. నేను పోయినను నీవు బిచ్చమెత్తి వీరిని కాపాడవచ్చును అని బ్రాహ్మణుడనెను. అమ్మా నాయనయు నీవును పోరాదు. నన్నుపంపుడీ. ఏలయనగా నేను మీయింట నుండుటకు పుట్టలేదు. మీరు కూర్చుండి మంత్రపూర్వకముగ నన్ను దానముచేయుదురు. ఇపుడు సమయమునకు ఉపయోగపరమగునుడు అనిపుత్రిక అనెను. కుంతి ఆమాటలు విని దుఃఖించుచుండెను వారు ఆపిల్లమాట విని అధికముగ దుఃఖించిరి. ఏడ్పు నిలుపగనే పోదమని కుంతి నిలిచియుండెను. తండ్రీ తల్లీ అక్కా మీరేల దుఃఖించుచున్నారు, నాచేతిలోనుండు బొగ్గుతో వాని చంపెదను అని పుత్రుడనెను, ఆతల్లి దుఃఖసముద్రమున మునిగి యుండినను కొంతసంతోషపడెను. వింటిరా. మాట అనికొంచెము సుఖము కలిగెను. వింటినని బ్రాహ్మణుడనెను. అమ్మా తమ్ముని మాట వింటిరాయని పుత్రియనెను. వారు అపుడు దుఃఖమును మాని సంతోషముతో నుండగా, యిదియె సమయమని కుంతి లోపలపోయెను, వారు కుంతిని తమయింటనుండు యోగ్యస్త్రీయనిగదా భావించియుండిరి, అవ్వా రమ్మ అనిరి, మీరు సంకటపడుచున్నారే సంగతిచెప్పుడు, తీర్చెదను అని కుంతి అనెను, రాక్షసుని శక్త్యాయుధము తెగిలి చచ్చినవారిని బ్రతికించు మృతసంజీవిగా ఆమాట యుండెను. సమీపమునందు అసురుడు తినయిష్టానుసారముగ జనులను భక్షించుచుండెను, అగ్రహారము పాడగునని ఒకబండి అన్నము ఒక మనుష్యుడు రెండు యెద్దులను ప్రతిదినమును పంపెదమని వ్యవస్థచేసికొంటిమి, ఆనాటినుండి గు అటుల జరుగుచున్నది. ఇప్పుడు ఒకబండియన్నము ఒకమనుష్యుని క్షేమము యీయవలసి యున్నది అని తాను

చెప్పెను. బ్రాహ్మణుడు కన్నులలో ధారధారగా నీరు కారగా అమ్మా రేపటిదినమున మావంతు, ప్రళయకాలమువలె వచ్చెను. అమ్మా ఈకొడుకువలన వంశవృద్ధి కావలయును, వీడు పోయిన మరల యెటుల వచ్చును, అనిచెప్పి హాయని యేడ్చెను. మీరు దంపతులు యిద్దరు బిడ్డల నుంచుకొనియున్నారు, నాకు యేవురు బిడ్డలున్నారు, ఒకనీ బంపెదను, మీరు చెప్పినటుల ఒకబండి యన్నము రెండు యెద్దులను సిద్ధపరచి యుంచుడు, తీసికొనిపోవుటకు ఒకబిడ్డను పంపెదను, అని కుంతిచెప్పెను. ఆబ్రాహ్మణుడు ఒకబండియన్నమునా యిచ్చును యేబదిబండ్లనీయడా. కన్నులలో ధారధారగా నీరు వచ్చెను, ఆశ్చర్యముకలిగెను, మరియొక కాపురమైయుండిన యీసంగతి వినగానే మనల నడుగుదురని చెప్పకయే లేచిపోరా అని మనసున సంతోషించి తోడనే అంగీకరించక, అమ్మా మీబిడ్డను పంపుడనిన బ్రహ్మహత్యయగును, నేను నాబిడ్డను పంపిన ఆత్మహత్యయగును, మమ్ముకాపాడుకొనుటకై బ్రహ్మహత్య చేయవచ్చునా, వలదమ్మా యని బ్రాహ్మణు డనెను. ఆమాటలన్నిటిని భీముడు వినుచుండెను. సరి అమ్మ సమ్మతించెను, అతడు సమ్మతింపవలయును, నను పంపవలయును బండియన్నము దొరకును అనుకొనెను. అమ్మా! నాబిడ్డ అట్టివాడుకాడు. రాక్షసుని జంపువాడు. వానిచేత జంపబడువాడుకాడు. నాబిడ్డకు భోజనముమీద దృష్టి. పాలు పెరుగులను బిందెలలో నుంచుడు. భక్ష్యములనుంచుడు అని కుంతిచెప్పగా అంత శక్తిగలవాడైన పోనీయుమమ్మా మనబిడ్డ బ్రతుకును. వాడుచచ్చెనేని ఊరే బ్రతుకును అని వారనిరి. అమ్మా విచారించితివా యని భీముడడుగగా కుంతి సంగతిచెప్పెను. అమ్మా భోజనమున్నదా నన్ను పంపెదనంటివా ఆమె సమ్మతించెనా అని భీము డడుగగా బ్రహ్మహత్యయనెను నీవు బలిష్ఠుడవని నాకు తెలియునే. నిన్ను పంపెదనంటిని అని కుంతి చెప్పెను. అమ్మా భోజనమును అధికముగ ఉంచమంటివా యని భీము డడుగగా అహా యేర్పాటుచేసితిని. ఓరీ రేపటికి పోననకుము పోరాదుగదా అని కుంతియనెను. అమ్మా పోనందునా భోజనము లేదనరుకదా యని భీముడడుగగా అన్నియుచెప్పితినని కుంతి యనెను. సరి పంపనిమ్ము వానికి నేనో నాకువాడో బలియనియు, యెప్పుడు ఉదయమగునో యనియు భీముడుండెను. ధర్మరాజుమొదలగు నలుగురును భిక్షకుపోయి వచ్చిరి. వీనివలన నేమి సంగతి యేర్పడునోయని ధర్మరాజు వచ్చునపుడే భీముని చూచుచు వచ్చును. ఆదినము యెప్పటివలెకాక మిగుల సంతోషముగ నుండెను. అమ్మనడుగగా రేపటిదినము వానికి విందుభోజనమని కుంతి చెప్పెను. మాకు లేదాయని ధర్మరా జడుగగా కుంతి సంగతిచెప్పి భీముడున్నాడుకదా భిక్షకు కూడ పోవుటలేదుకదాయని కుంతిచెప్పెను. ధర్మరాజుకు కోపము వచ్చెను. అమ్మా స్థానము సుఖముగ నిద్రించితిమి. మనలను యెత్తుకొని వచ్చెను. చెట్టుక్రింద దాచుచు తెచ్చెను. వాడు లేకున్న హిడింబాసురుడు యేమిచేసీ యుండును. ఇంకను యేమి ఆపదవచ్చునో వాడులేక యెటులుందుము. మమ్ము కాపాడువాడు వానిబంప యేమి

సాహసించితివి అనిధర్మరాజనెను. ధర్మపుత్రా! అవసరపడకుము. భీముడు పోయిన బకాసురుడు చంపునా. అంతధైర్యములేక చెప్పుదునా. నేను కన్నతల్లిని. నీవు అన్నవు. దాయాదివి. నాకులేనియాళి నీకు ఉండునా చాలునురా. నిలుపు. హిడింబాసురుని జంపుటచేత నాకు నమ్మిక కలిగినది అందుచేత సమ్మతించితిని మాటలాడకుమని కుంతి చెప్పెను. ఆధైర్యము నాకునునున్నది. అయినను నీవేల అటుల సమ్మతించితివని ధర్మరాజనెను. రేపు సూర్యోదయమైనయెడల బకాసురునికి ఆహారమగుమనో అనికదా భయపడి స్వప్నము వచ్చును. రేపు తనకు లభింపబోవు భక్ష్యములు పాలుపెరుగులు బండిమధ్యలో! కూర్చుండి భుజించునటుల భీమునికి స్వప్నము వచ్చెను. రేపుమనబిడ్డ అసురుని చంపునని కుంతిచెప్పగా ఊరిజనులు సంతోషించిరి. భీముడు పోవుసపుడు యిటుల ఒక నాటితోనే సరిపోవునే రేండెనిమిది దినములు కారాదా యని చింతించెను. ఈశ్వరా! నీకుకదా చింత. అర్ధ పాతిక కడుపునకు ఉన్నదని విశేషముగ నిచ్చితివా అని ఆనందముతో పోయెను. కొంత ఆలస్యమాయెను. ఏల రాలేదు ప్రొద్దాయెను అని ఆగ్రహముతో బకాసురు డుండగా భీముడు అయసురుడు వసించు వనమునకు పోయెను. ఆవన మెటులున్నదనగా నిత్యమును ఒకమనిషి రెండుయెద్దులు, అటుల అనేక దినములనుండి చచ్చుచుండుటచేత యెముకలు కొండవలెపడ్డియుండెను. బకాసురుని వానిసుట్టముల యిండ్లు చంపుటకువచ్చు యముని గుడారములటుల ఉండెను. గడగడమని గాలివచ్చెను. ప్రొద్దాయెనని యముడు త్వరితముగ వచ్చుచున్నాడేమో వాని మహిషము శ్వాసవిడుచుచున్నదేమోయని తోచెను. సృగాలాది మృగముల శబ్దము స్తోత్రము చేయునటులుండెను. భీముడు అచ్చట బండినిలిపి భోజనపదార్థములను భగవద్గీత 9 అధ్యా 27 శ్లోకమటుల భగవదర్పణముచేసి భుజింప నారంభించెను. అంతయన్నము పట్టునంతటి ఆకు ఉండదుగాన బండిలోనుండియే భుజించెను. గంపలుగంపలుగ పదార్థముల భుజించి త్రేపు విడిచెను. సింహగర్జనము చేయగా వనమంతయును గడగడ నడకెను. ఇంకను రాలేదని బకాసురుడు చూచుచుండగా శబ్దము వినెను. వాసన వచ్చుచుండెను. ఆలస్యమగుచున్నది వాసన వచ్చుచున్నది సింహధ్వని వినవచ్చుచున్నది. ఎవడో ఒకడు తినుచున్నాడు. చూతము అని తలచి యీనాభుజబలము ఆపిల్లవానికి తెలియదేమో అని బకాసురుడు ఒకతట్టు తట్టెను. ఎందరినో చంపినందున వానిదేహమంతయును రక్తముగనుండెను. పచ్చకర్పూరము కలిపిన చందనమును పూసికొనినటుల ప్రాణుల రక్తమాంసములను రొమ్మున పూసికొని యుండెను. ప్రాణులను చంపుటకు రెండుపండ్లు పొడుగుగ నుండెను. పండ్లమధ్య ప్రాణులు వ్రేలాడుచుందురు లోపలత్రోసికొనుచుండును. పొడుగుగనుండు రెండుపండ్లను చూడగా ఆమనుష్యుల యెముకలే అటుల నిలిచెనేమో యనితోచుచుండెను. అట్టి బకాసురుడు వచ్చి యెవడురా అనెను. ఆసింహధ్వనికి మరి యొకడైన చచ్చియుండును. వాడు కూయగా యితడు తిరిగిచూడలేదు. ఏలయన,

ఒకవేళ లేచి వానిచంపి భుజింతమనిన శవస్పర్శచేత నిది అభోజ్యమగునని చూడలేదు. బండి మిగుల పెద్దది. దాని నిండుగ కూరి పంపిరి. భీముడు దానిని తినెను. వాడు వీపులో తన్నినయెడల ఏమన మయిన నెటులని భీముడు ఔషధమును పరిగ్రహింపవలయు నని తలచెను. (ఓ జనులారా మందుచెప్పెదను వినుడు ఆ చెట్టివ్యాధినైనను కుదుర్చును. సకల కర్మ, జ్ఞాన, భక్తి, ధ్యాన, యోగములను తెలిసిన యాజ్ఞవల్క్యాదులు కనిపెట్టిన మందు అది. అదెచ్చట నున్నదనగా లోపల నున్నది. హృదయమున చీకటిగ నున్న దేయనిన ఆమందే జ్యోతిస్వరూపము. దానికి వెలయేలేదు. వేరువేరుమందులవా ర్చపనిలేదు. ఒకేమందు. మిగులగొప్పవ్యాధిని కుదుర్చుమందు మిగులచేదుగ నుండును. అది అట్లుకాదు అమృతము. దీనికి కృష్ణుడనిపేరు. దీని భుజింపుడు (అనగా కృష్ణా కృష్ణా యనుడని అర్థము.) ఈమందు లోపలపోయి అద్భుతముగ పనిచేయును.' ఇది యెన్నటికిని వ్యాధిని రానీయక సుఖమును కలిగించును. దీని గైకొనుడని కులశేఖరులు అనిరి.) భీముడు అట్టియౌషధమును భుజించెను. ఒకమనుష్యుడు భుజించుటను వాడు చూచునా. వాడుసమీపించి భీముని వీపులో కొట్టెను భీమునికి కుదిలించినటులాయెను. తినిన పదార్థములు లోపలపోయెను. తిరిగిచూడలేదు. ఎవరైనను తట్టిన బాగుగ నుండు నని తలచితిని దైవమ్మానుషరూపేణ అని వచ్చెను. అనితలచి భీముడు గమనింపకుండెను. బకాసురుడు ఒకచెట్టును పుచ్చుకొని ఓరీ గమనింపవా యని భీమునిమీద కొట్టెను. భీముడాచెట్టును యెడమచేతితో పట్టుకొని కుడిచేతితో భుజించుచుండెను. ఓరీ భుజించి వచ్చెదను ఉండుమనెను. ప్రయోజనము లేదని వాడు వృక్షమును విడిచెను. వాడు లేచి ఓరీ సంతోషము. యింతఅన్నము నాకు లేదనిచింతలేదు. నీవు యింతయు తింటివి. నిన్ను నేను తినెదను అనెను. ఉండురా భుజించిలేచి చేయికడిగి ఆచమనముచేసి వచ్చెదను అని భీముడనెను. వాడు పైకి రాగా భీముడు త్రోసెను. కొలుమైలు దూరముగ పోయి పడెను. భీముడు లేచి చేయికడుగుకొని ఆచమనముచేసి భగవదర్పణముచేసి రారా యనుచు వచ్చెను. భీముడు మనుష్యునివలె తోచలేదు కొండనిలుచునటుల తోచెను. బకాసురుడు భయంకరముగ కూయుచు చెట్టునుతీసి త్రిప్పెను. ఓరీ భోజనమునకు ముందే భయపడలేదు. ఇపుడు చెట్టుకు భయపడుదునా అని భీముడనెను. ఇతడు ఓరీయనగా పిడుగుపడినటుల తోచెను. అటులగాకున్న భుజించియుండునా ఆలస్యముగ వచ్చియుండునా. నాతిండి నేటితోసరి అని బకాసురుడు అనుకొని మరల చెట్టుతో రాగా భీముడు దాని పెరికి పారవేసెను. వాడొక వృక్షమును అయన ఒక వృక్షమును పెరుక్కసాగిరి. ఇరువురును అట్టహాసము చేసిరి. వీరి అడుగులచేతను సింహధ్వనులచేతను భూమి గడగడ వడకెను. చెట్లతో కొట్టుకొనగా వీరికి తగులలేదు. చెట్లు పొడిపొడి ఆయెను. వృక్షశిలాశైల బాహు యుద్ధములు చేసిరి. ఆకాశములో బ్రహ్మాదులు చూచుచుండిరి. భీముడు వాని క్రిందత్రోసి కుడిచేతితో గొంతును యెడమచేతితో

కోడలను పట్టుకొని చెరకుగడనువలె వాని వీపును తనమోకాలిమీదనుంచి వంచగా వాని దేహము రెండాయెను. చెరకును విరచిన శబ్దించునటులను, శ్రీరాముడు సీతను పెండ్లాడుటకై శివధనుస్సును విరచినపుడు శబ్దము కలిగినటులను, ధ్వని కలిగెను. వాని ముఖము నుండి రక్తము వచ్చెను. మరణకాలమున వికారధ్వనిచేసెను. కీచుమనికూసి మృతుడై క్రిందపడెను. అనన్యభావముతో స్వామిని నమ్మినవారైనందున ఆపదలు వచ్చునటుల తోచినను పర్యవసానమున మంచియే అగును. పాండవులవలె స్వామిని నమ్మిన కాపాడును అని తలపవలెను. బకాసురుడు పెద్ద పర్వతమువలె క్రిందపడెను. ఊరికిపోయి చంపితి ననిన నమ్మరు. చంపకయే వచ్చినాడని తలంతురు అని భీముడు తీగలను తీసి వాని కాలికి కట్టి యీడ్చి తెచ్చి ఊరిబయట వేసి వచ్చెను. రాత్రి అయెను. శవమును స్పృశించినందున స్నానముచేసి దోషపరిహారార్థమై ఆచమనముచేసి తడివస్త్రముతో రాత్రి పన్నెండుగంటలకు వచ్చెను. అయ్యో! అర్థరాత్రి అయెను రాలేదే అని బ్రాహ్మణుడు అనుకొనెను. వీరికని అటులే తోచెను. అమ్మా హిడింబాసురుని చంపినాతండే వానికి పైవాడుండడా. స్త్రీసాహసము ఇక మనగతి యెటుల అని ధర్మరాజనెను. కృష్ణా! వాడు వచ్చునో రాడో. వీరునన్ను బాధించుచున్నారు అని కుంతి ప్రార్థించెను. అపుడు భీముడు వచ్చెను. ఏమిరా తడివస్త్రము అనగా అసురుని సంహరించితి ననెను. బ్రాహ్మణా! బండిని యెద్దులను తింటి రక్తము అంటకొనవలదు. కడిగితిని. నేనును స్నానమాచరించితిని అని భీముడనెను. వారికి యెంత ఆనందమై యుండునో కదా.

ద్రౌపదీకల్యాణము.— 1-వ భాగము.

భీముడు పెద్ద దుష్టనిగ్రహమను కార్యము చేసి భగవదర్పణముచేసి, యింకను రాలేదేయని బ్రాహ్మణుడు కుంతి మొదలగువారు చింతించుచుండగా, రాత్రి పన్నెండుగంటలకు యిల్లుచేరెను. బ్రాహ్మణునికి సంతోషము. తనబిడ్డను పంపియుండినను వచ్చియుండడే ఇతడు వచ్చెనే యనియు, వీరు యితని బకాసురునికి బలియిచ్చి కొడుకును పోకుండునటుల మరల వచ్చెనే యనియు మరియొక సంతోషము. పాండవులకు యేయాపద వచ్చినను యిది తప్పదని తోచును. కడపట మంచిగనే తేలును. ఎంత యాపదలు వచ్చినను అనన్యభావముతో దీనబంధు ఆపద్బాంధవుని తలచినటులైన పోవును. ఆపదలు రావు. వచ్చినను అనాయాసముగ పోవును. బ్రాహ్మణుడు తనవారిని ధర్మరాజాదులను కుంతిని ఉంచుకొని తండ్రీ! నీవు బయలుదేరి పోయినదిమొదలు యింతవరకు జరిగిన కథ చెప్పుము. భయపడితివా యని అడుగగా నాకేమిభయము బకాసురవధము లీలగా ఆయెనని అతడు చెప్పెను. అందరు నవ్వి కథవినిరి. ఇతడు బయలుదేరినదిమొదలు వచ్చినవరకు సంగతి చెప్పగా వారికి పరమానంద ఆశ్చర్యములు

కలిగెను. అయ్యా! బకాసురుడనిన లోకము గడగడ వడకునే నీవు వానికి బలికాక వాని బలిగ తీసికొంటివే. నీబలముకాదు. స్వామిబలమేను. నీవు బ్రతికినది మాయదృష్టముకాదు. అవ్యాజకరుణానిధియొక్క కృప అనిరి. బకశరీరమును ఊరివెలుపల వేసియుండెనే ఆసంగతి యెవరికిని తెలియదు. మరునాడు జనులు స్నానమునకు పోగా వాడు పడియుండెను. వాని చంపుటకు దైవమునకును సాధ్యముకాదే వాడు చచ్చినా డనుకొందురా. నిన్న బలి సరిగా చేరలేదు. అందుచేత వాడు వచ్చినాడని తలచి కొందరు పారిపోయిరి. కొందరు నిదానించి చూచిరి. లేవలేదు. అయ్యో పోయినటులున్నది. నిన్న బలిలేనందున లేవడా అనిరి. సమీపమునకు పోయి చూడుడు అని కొందరనగా సరి బాగుగనే యున్నదని మరికొందరనిరి. అనేక నిదర్శనములచేత వాడుచచ్చెనని తీర్మానించిరి. గుంపులు గుంపులుగపోయి చూచి, అబ్బా మాకందరికిని మృత్యువుగ నుంటివే. నీకును మృత్యువు యేర్పడెనా అనిరి. వీని నెవరైన చంపిపోయియుండవలదా నిన్నయెవరివంతు అని లెక్కచూచి బ్రాహ్మణుని ఇంటికిపోయి, నిజము చెప్పుము. నిన్నటిదినము పోయినవాడే చంపియుండవలయును. నీపుత్రుని బంపితివా. చెప్పుము అనిరి. నాపుత్రుని బంపలేదని బ్రాహ్మణుడు అనెను. నిన్నటిదినము యెవరిని పంపితిరి. అంతయన్నమును భుజించి వాని చంపినవాడెవడు అనియడిగిరి. సంగతిచెప్పినయెడల వీరిసంగతి వెల్లడియగును. చెప్పకున్న విడువరు. చెప్పి తీరవలయును. వృద్ధుడు అబద్ధము చెప్పరాదు. ఆబ్రాహ్మణుడు యోచించి, బుద్ధిశాలియగుటచేత, జనులారా! నిన్న జరిగిన సంగతి చెప్పెదను వినుడనెను. చెప్పవలదని పాండవులు సైగచేసిరి. హేజనులారా నిన్న నాబిడ్డను పంపుటకు దుఃఖించుచుంటిని. ఒక బ్రాహ్మణ దర్శనమాయెను. నేను పోయెద ననెను. అతడు పోయి మరల వచ్చునని తోచెను. తేజస్వి. ఆయన తన శక్తిచేత చంపినటు లున్నది అని బ్రాహ్మణు డనెను. బ్రాహ్మణుడు చంపియుండడు. దైవమే అటుల వచ్చి చంపియుండును అని జనులు తలచి అట్టిస్వామికి యేదియైన ఉత్సవము చేయవల యునని తలచి ఆయూరి నృసింహస్వామికి అన్నరాసులు సమర్పించిరి. నరసింహా! నీవే యిటులచేసితివి. నీకేమి యీయగలమనిరి. స్వామి సారమును గ్రహించెను. ఎల్లవారును బ్రాహ్మణుని చూచి, రండు మీయింటివంతు వచ్చినపుడుకదా ఆబ్రాహ్మణుడు వచ్చె ను అనిరి. ఆబ్రాహ్మణుడు వారితో చెప్పకయే భీముని ముందుంచుకొని పోయెను. అంద రును స్వామిసన్నిధికి పోయిరి. వీరికెంతప్రసాదము యిష్టమో అంతప్రసాదమును యీయుడనిరి. ఆబ్రాహ్మణుడు ఆపెద్ద భాండమును తెమ్మని దానినిండుగ ప్రసాద మును వేసెను. ద్వితీయవిఘ్నములేక అన్నము దొరకెనని భీముడు భుజించెను. ఇతడు ముందుపోవుచుండగా బ్రాహ్మణుడు భిక్షుకుని పిలుచుకొని పోవుచున్నాడని అందర నుకొనిరి. ఆయూరి జనులకు బ్రాహ్మణులకు బకాసురవధ మాయెనని సంతోషము. రెండుదినములు కడుపార ఆహారము దొరకెనని భీమునికి సంతోషము. శ్రీకృష్ణుగ మంచి

కాలము వచ్చునని వ్యాసులు చెప్పిరని నిరీక్షించుచుండిరి. పాండవులు దేవాంశములుగాన అధ్యయనము బాగుగ చెప్పుచు, వేదమంత్రములను ఉపనిషత్తులను అధ్యయనము చేయుచుందురు. ఉచ్చారణ క్రమము మిగుల బాగుగ నున్నది. మిగుల చురుకుదనము గలవారు అని ఊరివారు అనుకొనిరి. ఒకయింట కాపురముండువారు యేఅరుగు మీదనో పరుండవలయును ఇంటివారితో సమముగ పరుండరాదని పాండవులు అస్మదాదులకు చూపిరి. పాండవులు కుంతి యింటి అరుగుమీద పరుండగా మరియొకరికి స్థలముండెను. ఒకబ్రాహ్మణుడు రాగా వారికిని పరుండ చోటు నిచ్చిరి. అందరును పరుండి నిద్రించిరి. కుంతికి చింత. బ్రాహ్మణుడు పెద్దవాడు. అతనికి నిద్రరాలేదు. అన్నా మనమిటుల ఏకచక్రనగరమున భిక్షమెత్తి కాలము గడపుచుండుట, వాడు అఖండరాజ్యము నేలుట. వ్యాసుడు మంచికాలము వచ్చుననెను. ఎన్నిదినములకు అని వారును అందరును నిదురలేచిరి. స్వామీ మీరెచ్చట నుండువారు. తీర్థయాత్రార్థముగ వచ్చితిరా చెప్పుడు అని పాండవు లడిగిరి. ఆబ్రాహ్మణుడు అయాతీర్థముల నదుల మాహాత్మ్యమునుచెప్పి అచ్చట స్నానము చేసితి ననెను. అయా ఆశ్రమములు తాను చేసిన సంగతులను చెప్పెను. ఇటుల ఆయా దేశముల తీర్థముల తటాకముల సంగతి చెప్పి అటుల వచ్చితిని. సమీపమున పాంచాలమను ఊరున్నది. అయూరిరాజు మిగుల ఆరోగ్యుడు. ద్రుపదుడనువాడు. వారి కుమారితకు స్వయంవరమట. విశేషదక్షిణయును నాలుగుదినములు భోజనమును దొరకును. ఘనపాఠులకు ధోవతులని తెలిసెను. మనకేమి తక్కువ అనెను. మన మిటుల బ్రాహ్మణవేషములతో నున్నామని పాండవులకు సంకటము. భోజనము దొరకునని బ్రాహ్మణునికి సంతోషము. అనేక దేశములనుండి అనేక విద్వాంసులు వత్తురు. మీరును వచ్చుటకు సౌకర్యముండిన యెడల మనమందరము కలిసి పోవుదము అని బ్రాహ్మణుడనెను. ఆరాజుకూతురి పేరేమి అని పాండవులును కుంతియును అడుగగా ద్రౌపది, కృష్ణ యనిపేరని ఆయన చెప్పెను. సాధారణముగ పుత్రైషా తపమాచరించగా పుత్రైనా యని ఎరడుగగా, ద్రుపదుడు ద్రోణాచార్య అను అవమదించుట, ద్రోణుడు చింతించి కురుపాండవులకు విలువిద్య నేర్పి గురుదక్షిణగ ద్రుపదుని కట్టి తెమ్మనుట, అర్జునుడు అతని కట్టి తెచ్చి ఆచార్యునిముందు పడవేయుట, ఆచార్యుడతని అగౌరవముగ మాటలాడుట, అంత ఆరాజు యాజోప యాజులద్వారా పుత్రకామేష్టి జరిపి ద్రోణుని జంపుట కొరకు పుత్రుని అంతకూరుడగు అర్జునుని నల్లనిగ చెనికొనుట కొరకు పుత్రికను బడయుట యిత్యాది సంగతులను ఆబ్రాహ్మణుడు సాంగోపాంగముగ తెలిపెను.

కష్టకాలము వచ్చెను. భగవత్సంకల్పము. అదేమి ద్రుపదునికట్టి తెచ్చుట. అట్టివారిని రాజ్యమునుండి వారణావతమునకు దుర్యోధనుడు పంపెను. లక్కయింటిలో నుంచి నిప్పుపెట్టెను. అవాం పాండవులు కాలిపోయియుండరు. దుర్యోధనునితో చే

నవారే కాలి చచ్చినటు లున్నది. ఆసంగతి దైవమెరుగును. ఆదిమొదలు పాండవుల సంగతియే తెలియలేదు. అని బ్రాహ్మణుడనగా యీరీతి మారువేషములతో నుండగ తెలియునా అని వారనుకొనిరి. వారిసంగతి తెలియలేదని బ్రాహ్మణుడు దుఃఖించెను. ద్రుపద్రుడు అర్జునునికి యీయవలయునని పిల్లను పెంచుచున్నాడుకదా. పాండవులు లక్కయింట కాలిపోయిరని జనులు చెప్పగా అయ్యో ఎట్టి రూపము. ధైర్యము వీర్యము బలము అని ద్రుపదుడు దుఃఖించెను. పాండవులును కుంతియును చచ్చుట దుఃఖమే. అందునను మహాశూరుడు. నన్ను పట్టికట్టినవాడు అర్జునుడు మృతినొందెనో తప్పి బ్రతికెనోయని ద్రుపదుడు హాయని యేడ్చెనని బ్రాహ్మణుడు చెప్పగా నాకు అగునటుల తోచుచున్నదని అర్జునుడు అనుకొనెను. ద్రుపదుడు అటుల యేడ్చుచుండగా పురోహితుడు వచ్చెను. ద్రుపదమహారాజా! అర్జునుని కిచ్చుటకు కూతురిని కంటిరే ఆయర్జునుడు పోయెనని దుఃఖించితిరే. పాండవు లెట్టివారు. వారియెడ భగవదనుగ్రహము ఆచార్యానుగ్రహము యెంతయున్నది. పరమశూరులు. వారు చచ్చియుండరు. వారు కాలవ్యత్యాసమని యెచ్చటనో దాగిఉందురు. యోచించవలయును. దుఃఖింపవలదని పురోహితుడనెనని ఆ బ్రాహ్మణుడు చెప్పెను.

భగవదనుగ్రహముచేత బ్రతికి అరుగుమీద నున్నామేయని వారనుకొనిరి. ఆయర్జునుని చూడవలయునే కన్యనీయవలయునే వాని యెందు వెత్తును అని రాజనగా, వారు యేరూపములో నున్నారో నాకు తెలియదు. స్వయంవరమని వార్తాపత్రికలలో ప్రకటింపుము. తప్పక రాజులు వత్తురు. అందులో అర్జునుడును వచ్చును. అందరును స్వయంవరమని చాటింపుడు అని పురోహితుడు చెప్పెను. ఆయర్జునుని కనిపెట్టుటక్కై ద్రుపదుడు స్వయంవరము నేర్పరచెను. నేను నా శిష్యులతోడ పోబోవుచున్నాను. మీరును రండి అని బ్రాహ్మణుడనెను. వారికి మిగుల సంతోషము. అవ్వా బిడ్డలను పిలుచుకొని బయలుదేరుము. పోయిన భోజనము లభించును. నిర్బంధములేదు. మీరువచ్చునెడల ఒకరికొకరు తోడుగనుందుము. ఇంకను కథలు చెప్పెదను. వేడుకగ రండియని చెప్పి బ్రాహ్మణుడు ప్రొద్దాయె స్నానమునకు వెండనెను. వారు లేచిరి. బిడ్డలారా ఆయన చెప్పినది వింటిరా ఆరంభము మొదలు ముగింపు వరకు మీకథనే చెప్పెను. ఇట్టి మిమ్ముకని అల్లాడుచున్నానుకదా. ఒకవేళ పిల్ల దొరకిన దొరకును. లేకున్న ఆబ్రాహ్మణు డనినటుల భోజనము దొరకును అని కుంతిచెప్పగా అమ్మా నీ యిష్టముండిన పోవుదమని పాండవు లనిరి. కుంతి పుత్రులను బిలుచుకొని వారుండు యింటి యజమానునియొద్దకు పోయి అయ్యా యేమియో మీయింటికి వచ్చితిమి. బిడ్డ బ్రతికెను. పరదేశులము పోయెదము అచ్చటికి పోయిన మంచివస్తువు దొరకునట. ఆశీర్వదింపు డనెను. అమ్మా మీకు కావలసినది లభించును. పొండని బ్రాహ్మణుడనెను. అందరు బయలుదేరిరి. మనము పాండవులమనియు యీమె కుంతియనియు

పోయినచో పిల్ల నిత్తురు. బ్రాహ్మణులటుల పోయిన దక్షిణ యిచ్చి పంపవలసినటులుండును. కన్య లభింపదు. ఎటులని పాండవు లేవురికిని మనసున యోచన. కుంతికిని యోచన. ఋష్యాదులు పరమాత్మయని స్వామినిగూర్చి తలపవలసియుండును. పాండవులకు బంధువుగాన కృష్ణా నీతో చేరినవారు అల్లాడుట నీకు కదా అగౌరవము. బిగువు చేయుచున్నావేమిరా యనవచ్చును. అందుచేత కుంతి కృష్ణా రారా అందరికిని జాబులు పంపియుండును. అటులే నీకును జాబు వచ్చియుండును. మేము వచ్చులోపల నీవువచ్చి చేరియుండుము అని ప్రార్థించుచు పోయెను. నేను తలచుటలోపల స్వామికి తెలిసియుండును. బ్రాహ్మణుడును చెప్పెను. ఇంటి యాయనయు ఆశీర్వదించెను. నేనును స్వామిని పిలిచితిని. ముక్కాలుభారము కార్యము అగునని తోచుచున్నది అని కుంతి చింతించుచు పోయెను. మంచికాలము వచ్చెను. మీరు చింతించరాదని వ్యాసులు వచ్చెను. నేనువ్నాను. అచ్చట పనిజరుపుటకు కృష్ణుడున్నాడు వీరికి చింతయేలయని వ్యాసుడు రాగా కుంతియును పాండవులును నమస్కరించి, రాత్రి ఒక బ్రాహ్మణుడు వచ్చియుండెను. వేడుకగా కథచెప్పెను. ప్రస్తావవశముగ పెండ్లిభోజనము దొరకును పొండి అనెను. మీయనుగ్రహమున కలుగునేమోయని పోవుచున్నామనిరి. సంశయముతో పోకుడు నిశ్చయముతో పొండు అని వ్యాసులు చెప్పగా వారు నాకగును నాకగును అనుకొనిరి. అందరికి అగునని వ్యాసుడనగా యిదేమి యేవురికి ఒకభార్యయా యని పాండవులనిరి. కారణములేక అటుల చెప్పను. అది ఒకమహర్షి యొక్క కూతురు. మంచి భర్త కావలయునని పరమశివునిగూర్చి తపమాచరించెను పరమశివుని సంతోషపెట్టగా ఆయనవచ్చి నీకేమి కావలయు ననెను. మిగుల ఆశచేత పతి పతి పతి పతి పతి. అని అడిగెను. ఆయనయును ఐదుమారులు భర్తలభింతుననెను. అదేమి ఐదుమారులు చెప్పుచున్నారని ఆమె అనగా నీవేల ఐదుమారులు అడిగితివి. నేను చెప్పినది తప్పదు. నీకైదుమంది భర్తలగుదు రనెను. అదేలయని ఆమెఅడుగగా పరమశివుడు రాగా నీవు మర్యాదతో అనుగ్రహింపుడనరాదా ఐదుమారులు అడిగితివి. కాని ఒమ్మంటిని. తప్పదు. నీవు యీజన్మమున తపమాచరించి మరుజన్మమున మహాశూరులు మహాత్ములు లోకవీరులు అగుభర్తలను పొందుదువు అనిచెప్పెను. భగవత్సంకల్పము ఆయనయిష్ట మటులున్నది. మీకు యోచన వలదు. ధైర్యముగ పొండు. మీకంటె గొప్పవా రెవరుందురు కావున పొండు పెద్దలందరును వచ్చియుందురు. నాకును లేఖవచ్చెను.వచ్చెదను.ద్రౌపదిసంగతి సంగ్రహముగ చెప్పబడెను. విస్తారముగ చెప్పవలయును.మనుష్యులకై యేర్పడిన ధర్మశాస్త్రము మిమ్ము బాధించదు.మీరు దేవతలు.మీకు వివాహము కాబోవుచున్నది. ఇపుడు అధికముగ మాటలాడుటకు లేదు. త్వరగ పొండని చెప్పి వేదవ్యాసులు పోయెను.వ్యాసులవాక్యమును, తల్లిఅనుగ్రహమును, బ్రాహ్మణుల ఆశీర్వాదములను తలచి వారు ధైర్యముతోను సంతోషముతోను మార్గమున తమతోడ

వచ్చువారితో మాటలాడుచు పోయిరి. మీరెచ్చటికి మీరెచ్చటికని ప్రశ్నచేసి
కొనిరి. అయ్యా మీరెచటికి అని వారు కుంతినడుగగా, వీరు నాబిడ్డలు పిలుచుకొని
పోవుచున్నానని ఆమెచెప్పెను.మీకేమైనను లభించును తేజస్వులు అనిరి.ఆశీర్వాదమని
పాండవులనిరి. మరికొందరు ఘనాంతము పాఠమాయెనా. కొంచెము చెప్పుడనగా
పాండవులు చెప్పుచు పోయిరి. శాస్త్రిగారూ ఆవాక్శుద్ధిని చూచితిరా. వీరికి గొప్ప
బహుమానము లభించునటు లున్నదనిరి.కొందరు వ్యాకరణము తర్కము మీమాంసము
చర్చించుచుపోయిరి. విషయవిచారము చేయుచు కొందరు, వేదమంత్రముల చెప్పుచు
కొందరు పోవుచుండిరి. పాండవు లిటుల బ్రాహ్మణబృందముతోడ పోవుచుండిరి.
వారు అటుల పోవునపుడు ఒక్కొక సంఘమును యేదైన కారణముచేత నిలిచినయెడల
తక్కినవారు పోవుచుందురు. అటుల పాండవులు వెనుకచిక్కిరి. కొందరు రాత్రి సుఖ
మని అపుడు నడచిపోవుచుండిరి. కొందరు పగలు సుఖమని పోవుచుండిరి. ఇట్లుండగా
పాండవులు ప్రత్యేకముగ పోవుచుండిరి. వీరిసంగతి యెంత దాచినను దాగలేదు.
శాస్త్రిలవారూ వారిని చూచితిరా. తేజస్సుచూడ బ్రాహ్మణులుగ తోచలేదు అను
కొనిరి. భీమా మనము రహస్యముగ నుండినను తెలియుచున్నది. రాత్రియందే పోవు
దము అని ధర్మనందను డనెను. అటులే పోవుదమనుకొని, అంధకారములో ముసలియా
మెను వెంటబెట్టుకొని పోవుచుండిరి. దివ్వటి పట్టుకొని అర్జునుడు పోవుచుండెను. అర్జు
నుడు మహా శూర వీర ధీరుడగుటచేత వీరిని కాపాడుటకై ముందుపోవుచుండెను.
గంగానదియొక్క సమీపమునకు వచ్చిరి. దప్పియని తీర్థమును స్వీకరింతమని నదిలో
దిగిరి. గంగాతీర్థమును గైకొనిరి. అనట ఒకగంధర్వుడు అనేక స్త్రీలతోడ జలక్రీడ
లాడుచుండెను. అది మనుష్యులు జలమును తాకువేళకాదు. వీరు దాహముచేత దిగి
కాళ్ళుకడిగి జలమును స్వీకరించిరి. నేను జలక్రీడసల్పుచున్నాను. మాకాలము. ఇపుడు
యేవురు ఒకస్త్రీని పిలచుకొనివచ్చి యోచించక దిగి నిర్భయముగ పోవుచున్నారు వీరికి
యేమిక్రొవ్వు. అకాలమని తలచిరా. మేము జలక్రీడ సల్పుచున్నామని కొంచెమైనను
సిగ్గుపడిరా అని ఆగంధర్వుడు వస్త్రమును చుట్టుకొని యెవరు అనెను. వారు మాటలా
డలేదు. అడుగుచున్నవాడు యిట్టివాడని తెలియలేదా. నాకు అంగారపర్ణుడని పేరు.
పరాక్రమశాలిని. నేను జలక్రీడ లాడుచుండగా మీరేల వచ్చితిరి. నన్నెరుగరు. తెలి
యక చేసితిమని క్షమాపణవేడుడు అని గంధర్వుడనెను. మేము హిండింబుని బకుని లక్ష్య
ము సేయలేదు. అంగారపర్ణుడట. ఓరీ రాక్షసులు భయపడుచుండ నీవేమిరా. ఏమి
చేయ మనుచున్నావని వారనగా మీరేల వచ్చితిరని వాడనెను. గంగానదిని వెలకు తీసి
కొంటివా. సకల ప్రాణులు కడతేరుటకై భగవదనుగ్రహముచేత నీయబడిన వారిపొందో
తక్కజలము అని వారనిరి. అంత ధైర్యము ఉండబట్టియే దిగిరని వాడు తలచెను. వినను
వానికి కోపమువచ్చెను. ఓరీ అదేలరా మర్యాదమీరి మాటలాడుచున్నావు యీనది